



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 363 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-




## భారత్‌కు గుడ్‌న్యూస్.. టారిఫ్‌పై డొనాల్డ్ ట్రంప్ యూటర్న్?!

- 50శాతం టారిఫ్‌లో 25 శాతం పెనాల్టీ టారిఫ్‌ను రద్దు చేయనున్నట్లు సమాచారం
- ఆ పెనాల్టీ టారిఫ్ విషయంలో భారత్-అమెరికా మధ్య చర్చలు
- 25 శాతం పెనాల్టీ సుంకానికి భౌగోళిక రాజకీయ పరిస్థితులు కారణం

5



## ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది

- సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు.. ఓటు దొంగలను రక్షిస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్
- పద్ధతి ప్రకారం ఎవరో లక్షలాది ఓట్లు తొలగిస్తున్నారు
- కర్ణాటక సీఐడీ కోరినా ఈసీ సమాచారం ఇవ్వలేదు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

# జీఎస్టీ 2.0 గేమ్ చేంజర్



- రాష్ట్ర ఖజానాకు రూ.8 వేల కోట్ల నష్టం.. అయినా ఆ మేరకు ఏపీ ప్రజలకు లబ్ధి
- మోదీ దేశానికి సంపద.. పన్నుల తగ్గింపుతో డిమాండ్, ఉత్పాదకత పెరుగుతాయి
- తద్వారా కొత్త ఉద్యోగాలు వస్తాయి
- పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరుగుతుంది
- అప్పులు చేసి సంక్షేమం ఇస్తే మనుగడ ఉండదు
- జీఎస్టీపై చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఈ సంస్కరణలతో 140 కోట్ల మందికి లబ్ధి: సీఎం**

**ఆర్థిక వ్యవస్థలోకి 2 లక్షల కోట్ల నగదు ప్రవాహం**

**సంస్కరణలకు మద్దతిచ్చిన మొదటి రాష్ట్రం మనదే**

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

జీఎస్టీ 2.0 సంస్కరణలను దేశ ప్రగతికి గేమ్ చేంజర్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. వీటివల్ల దేశ ఆర్థిక వ్యవస్థలోకి రూ.2 లక్షల కోట్ల నగదు ప్రవాహం వస్తుందని తెలిపారు. 140 కోట్ల మంది దేశ ప్రజలు లబ్ధి పొందుతారని అన్నారు. రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.8 వేల కోట్ల నష్టం వాటిల్లుతున్నా.. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. నాలుగు శ్లాబుల జీఎస్టీ పన్ను విధానాన్ని 2 శ్లాబులకు కుదించి మరింత సరళీకృతం చేశారని.. అలాగే 12 శాతం పన్ను పరిధిలో ఉన్న 99 శాతం వస్తువులు జీరో శాతానికి రావడం ప్రజలకు నిజమైన పండుగేనని చెప్పారు. వారికి దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలన్నీ ఒకేసారి వచ్చినట్లేనని అన్నారు. గురువారం శాసనసభలో.. జీఎస్టీ సంస్కరణలతో 140 కోట్ల ప్రజలకు మేలు చేస్తున్న ప్రధాని మోదీని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామంటూ చంద్రబాబు తీర్మానం చదివి వినిపించారు. అనంతరం - మిగతా2లో

## ఎన్టీఆర్‌కు నివాళికి 10 మందేనా?

ప్రజాప్రతినిధుల గైర్హాజరుపై సీఎం సీరియస్

2



## నేపాల్‌లో శాంతి స్థాపనకు అండగా ఉంటాం

- సుశీలా కార్కీకి మోదీ హామీ.. ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుంది
- సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగింది
- నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం

5

# రంగంలోకి ఈడీ

- ఒకేరోజు ఐదు రాష్ట్రాల్లో 20చోట్ల సోదాలు
- మద్యం స్కామ్‌లో మనీ లాండరింగ్‌పై నజర్
- రాజ్ కసిరెడ్డి భార్యకు చెందిన 'ఆరేట్'లో తనిఖీలు
- నగల దుకాణాలు, పండ్ల వ్యాపారాలు, రవాణా కంపెనీలతో ముడిపడిన స్కామ్
- నకిలీ ఇన్వాయిసలు, డొల్ల కంపెనీలపై ఆరా
- మే నెలలో రాజ్ కసిరెడ్డిని ప్రశ్నించిన ఈడీ





**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

వేల కోట్ల మద్యం స్కామ్‌లో ఎట్టకేలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఇప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వ 'సిట్' నుంచి సమాచార సేకరణకే పరిమితమైన ఈడీ... ఇప్పుడు క్షేత్రస్థాయిలో సోదాలు మొదలుపెట్టింది. గురువారం ఒకే రోజు, ఒకే సమయంలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ రాష్ట్రాల్లో దాదాపు 20 ప్రాంతాల్లో సోదాలు జరిపింది. జగన్ హయాంలో జరిగిన రూ.3500 కోట్ల మద్యం స్కామ్‌పై 'సిట్' ఇప్పటికే మూడు చార్జిషీట్లు దాఖలు చేసింది. జగన్ సన్నిహితులైన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మిథున్ రెడ్డి సహా కీలక నిందితులను అరెస్టు చేసింది. ఈ స్కామ్‌లో భాగంగా భారీగా షెల్ కంపెనీలను సృష్టించి, మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు 'సిట్' గుర్తించింది. దీనికి సంబంధించిన సమాచారాన్ని సహా కీలక నిందితులను అరెస్టు చేసింది. ఈ స్కామ్‌లో భాగంగా భారీగా షెల్ కంపెనీలను సృష్టించి, - మిగతా2లో



## రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు నిరాధారం.. అవాస్తవం

- రాహుల్ ఆరోపణలపై ఈసీ రియాక్షన్.. పటాకులే పేలాయంటూ సెటైర్లు
- సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటునూ తొలగించడం లేదు
- "ఎన్నికల నిర్వహణ కోసం ఈసీ నిష్పక్షపాతంగా పనిచేస్తోంది

5

# అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం విఫలం



- అసెంబ్లీలో ప్రజల గొంతు వినాలని కూటమికి లేదు
- తాడేపల్లిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వైఎస్ జగన్ భేటీ
- ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, నిలదీసేందుకు అవసరమైన పూర్తి మెటీరియల్ సిద్ధంగా ఉంది
- మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వడం లేదు కాబట్టి.. సభకు హాజరు కావడం లేదు
- స్కూళ్లలో నాడు-నేడు పనులన్నీ గాలికి ఎగిరిపోయాయి. గోరుముద్ద నాశనం అయ్యింది
- రైతులకు యూరియా కూడా సప్లై చేయని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది
- మొత్తం బ్లాక్ మార్కెట్‌ను నడిపిస్తున్నారు. ఇంకా ఏ పంటకూ గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు.

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. శాసనసభ, మండలి సమావేశాల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో తొలిసారి ప్రభుత్వంపై ఇంత తక్కువ వ్యవధిలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఈ ప్రభుత్వం అన్ని రంగాల్లో దారుణంగా విఫలమైందని తెలిపారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? అన్న సందేహం ప్రజలకు కలుగుతోందన్నారు. శాసనసభలో తాము మాట్లాడేలా తగిన సమయం కేటాయించడం ఇష్టం లేకనే, వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. మొత్తం సభ్యులతో కలిపి, కేవలం ఒక ఎమ్మెల్యేకు మాత్రమే ఇచ్చే అతి తక్కువ సమయంలో ప్రజా సమస్యలు ఎలా ప్రస్తావిస్తామని ఆయన ప్రశ్నించారు. అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్న ఆయన, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, నిలదీసేందుకు అవసరమైన పూర్తి మెటీరియల్ సిద్ధంగా ఉందని, కానీ మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వడం లేదు కాబట్టే.. సభకు హాజరు కావడం లేదని తేల్చి - మిగతా2లో



## జీఎస్టీ 2.0తో ప్రతి పౌరుడికీ లబ్ధి

- తొలిగా మద్దతు తెలిపిన ఏపీ
- రాష్ట్ర ఆదాయానికి నష్టమైనా.. ప్రజల ప్రయోజనాల కోసం సమర్థించిన చంద్రబాబు
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

2

# జీఎస్టీ 2.0 గేమ్ చేంజర్

-మొదటిపేజీ తరువాయి

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ జీఎస్టీ 2.0 సంస్కరణలకు ఆమోదం తెలుపుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిని సభ్యులందరూ ఆమోదించినట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రకటించారు. జీఎస్టీ సంస్కరణలు అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు మేలుచేసే అత్యద్భుతమైన సంస్కరణలని సీఎం చర్చ సందర్భంగా చెప్పారు. వీటికి మద్దతిచ్చిన మొదటి రాష్ట్రం మనదేనన్నారు. 'ఈ ఏడాది 4.19 ట్రిలియన్ డాలర్ల జీడీపీ, 2,880 డాలర్ల తలసరి ఆదాయం, 760 బిలియన్ డాలర్ల ఎగుమతుల స్థాయికి దేశం ఎగబాకింది. 2014లో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న దేశాన్ని ప్రధాని మోదీ 11 ఏళ్లలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దారు. మరో రెండేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నాం. ఎర్నెస్ట్ అండ్ యంగ్ నివేదిక ప్రకారం 2038 నాటికి భారత్ రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది. ఇంత ఉజ్వల అభివృద్ధికి కారణం సరైన సమయంలో సరైన వ్యక్తి మోదీ రూపంలో మన దేశానికి ప్రధానమంత్రి కావడమే' అని ప్రశంసించారు. ఆయన దేశానికి సంపదన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

**మద్దతివ్వాల్సింది పోయి.. పారిపోతారా..?**

ఇన్ని భారీ సంస్కరణలు జరుగుతుంటే వైసీపీ ఎమ్మెల్యేలు మద్దతివ్వాల్సిందిపోయి అసెంబ్లీకి రాకుండా పారిపోయారు. ప్రజలకు మేలుచేసే సంస్కరణలకు మద్దతివ్వడం ఇష్టం లేకపోతే.. కనీసం అర్థం చేసుకునే ప్రయత్నమైనా చేయాలి. సంపద సృష్టించలేని వారికి సంక్షేమం ఇచ్చే అధికారం లేదు. అప్పులు చేసి సంక్షేమం ఇస్తే మనుగడ ఉండదు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యం.

**ప్రభుత్వానికి రూ.800 కోట్లు మిగులు**

జీఎస్టీ 2.0లో భాగంగా ఆరోగ్య బీమా ప్రీమియంపై ఉన్న 18 శాతం పన్నును తీసివేయడం వల్ల ప్రభుత్వం ప్రతిపాదించిన యూనివర్సల్ హెల్త్‌కేర్ పథకానికి రూ.800 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉంది. 2 శ్లాబుల పన్ను విధానం, ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్లు చిన్నవ్యాపారాలకు మార్గం సుగమం చేస్తాయి. రా మెటీరియల్స్, ప్యాకేజింగ్, వ్యవసాయ వస్తువులపై పన్ను తగ్గడం వల్ల ఆత్మనిర్భర్ భారత్ ఊపందుకుంటుంది. మూడ్రోజుల్లో ఆటోమేటిక్‌గా వ్యాపారాల రిజిస్ట్రేషన్ వల్ల కార్యకలాపాలు వేగంగా జరుగుతాయి. రాష్ట్రాల మధ్య సరిహద్దు చెక్‌పోస్టులు లేకపోవడం వల్ల 30% వేగంగా రవాణా కార్యకలాపాలు జరుగుతాయి. పన్ను రీఫండ్ ఆటోమేటిగ్గా జరగడం వల్ల నిధుల లభ్యత పెరిగి వ్యాపారాలు ఊపందుకుంటాయి. ఏఐని ఉపయోగించుకుని ఉల్లంఘనలు జరిగిన చోటనే తనిఖీలు, విచారణలు ఉంటాయి. అందరినీ ఇబ్బంది పెట్టడం ఉండదు.

**అద్భుత ఫలితాలు..**

2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రస్తుతానికి పరోక్ష పన్నుదారులు 65 లక్షల నుంచి 1.51 కోట్లకు (132 శాతం) పెరిగారు. 2018లో జీఎస్టీ వసూళ్లు రూ.7.19 లక్షల కోట్లు ఉండగా.. 2025 నాటికి రూ.22.08 లక్షల కోట్లకు పెరిగాయి. రెండు శ్లాబులను పూర్తిగా తీసేయడం.. వందల కొద్దీ వస్తువులపై పన్నులు సవరించడం (తగ్గించడం) వల్ల వినియోగం పెరుగుతుంది. దీంతో డిమాండ్, ఉత్పాదకత పెరుగుతాయి. తద్వారా కొత్త ఉద్యోగాలు వస్తాయి. వాటి రాకతో పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరుగుతుంది. ఈ సంఖ్య పెరిగితే పన్నులు మరింత తగ్గుతాయి. పాలు, పనీర్, పెరుగుపై ఉన్న 5 శాతం పన్నుతీసివేశారు. నిత్యావసరాలు, షాంపూ, టూత్‌పేస్ట్, తలనూనెలు, సబ్బులు, వెన్న నెయ్యి, వంటపాత్రలపై ఉన్న 12 శాతం పన్ను 5 శాతానికి తగ్గుతోంది. కార్లు, ఫ్రిజ్‌లు, ఏసీలపై పన్ను 18 శాతానికి తగ్గించారు. ఇలా అన్ని రంగాల్లోనూ.. ముఖ్యంగా వ్యవసాయ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో పన్నులు తగ్గడం ప్రజలకు మేలు చేసే అంశం.

**11 ఏళ్లలో ఎన్నో సాధించాం..**

2014 తర్వాత 144 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వచ్చాయి ఎయిర్‌పోర్టులు రెట్టింపు అయ్యాయి. 60 శాతం హైవేలు కొత్తగా వేశారు. డీబీటీ లావాదేవీలు 90 శాతం పెరిగాయి. 2.7 కోట్ల ఇళ్ల నిర్మాణం జరిగింది. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 34 శాతం పెరిగాయి. స్వదేశీ రక్షణ వ్యవస్థలు తయారు చేసుకున్నాం. 80 కోట్ల మందికి బియ్యం పంపిణీ జరుగుతోంది. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు వచ్చారు. స్టార్టప్‌లు 350 నుంచి లక్షన్నరకు పైగా పెరిగాయి. వందల ఉత్పత్తుల ధరలు 22వ తేదీ నుంచి తగ్గిపోతున్నాయి. వీటిపై ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. 22 నుంచి అక్టోబరు 22 వరకు ఈ అవగాహన కార్యక్రమం కొనసాగాలి.

**6 గంటలు మనసుపెట్టి..**

ఎమ్మెల్యేలు 6గంటలు మనసు పెట్టి అసెంబ్లీలో కూర్చుని సమస్యలు అర్థం చేసుకోవాలి. మంత్రులు, సంబంధిత అధికారులు సభలో ఉండాలి. ఈ అసెంబ్లీ 175 మంది కోసం కాదు.. ఐదు కోట్ల మంది భవిష్యత్ కోసం. ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో నమ్మకంతో ప్రార్థనలు చేస్తాం. చట్టసభలు పవిత్ర దేవాలయాలు. రేట్ల తగ్గింపుపై ప్రచారమే కాదు.. ప్రజల మనోభావాలకు అనుగుణంగా సంస్కరణలు తెచ్చే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుంది. నేను వారానికి 3 రోజులు యోగా చేస్తున్నా.. యోగా దినోత్సవం రోజున మీరంతా ఫొటోలకు పోజులిచ్చారు.. కానీ రోజూ చేయడం లేదు కదా! రోజు యోగా చేయండి.. ఆరోగ్యానికి మంచిది. భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండాలి. ఇందులో తెలుగువారి పాత్ర ప్రముఖంగా ఉండాలనేదే నా ఆకాంక్ష. జీఎస్టీ సంస్కరణలతో స్వర్ణాంధ్ర విజన్-2047లోని 10 సూత్రాలు ఊపందుకుంటాయి. కొంతమంది ఆపరేషన్ సిందూర్‌ను ఎగతాళి చేశారు. కానీ ఇప్పుడు అమెరికా లాంటి దేశం కూడా ఇండియాతో సంబంధాల కోసం ఎదురుచూపులు చూస్తోంది. ఇది మోదీ ఘనత.

# రంగంలోకి ఈడీ

-మొదటిపేజీ తరువాయి

మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు 'సిట్' గుర్తించింది. దీనికి సంబంధించిన సమాచారాన్ని ఇదివరకే ఈడీతో పంచుకుంది. ఈ నేపథ్యంలోనే ఈడీ నేరుగా రంగంలోకి దిగింది. హైదరాబాద్‌లో... ఏ-1 రాజ్ కసిరెడ్డి భార్య పైరెడ్డి దివ్యా రెడ్డి డైరెక్టర్‌గా ఉన్న ఆరేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో సోదాలు జరిపింది. అదే సంస్థలో మరో డైరెక్టర్‌గా ఉన్న తీగల విజయేందర్ రెడ్డితో రాజ్ కసిరెడ్డి ఏర్పాటు చేయించిన యూవీ డిస్టిల్లరీస్లోనూ తనిఖీలు నిర్వహించింది. నకిలీ ఇన్వాయిసల కోసం మద్యం ముఠా సృష్టించిన ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, వెంకటేశ్వర ప్యాకేజింగ్‌లాంటి కంపెనీల అసలు గుట్టును ఈడీ వెలికి తీసినట్లు సమాచారం. హైదరాబాద్‌లోనే వెస్ట్ మారేడ్‌పల్లి వెల్లింగ్టన్ ఎన్‌క్లేవ్‌లో ఉన్న బూరుగు రమేశ్, ఆయన కుమారుడు విక్రాంత్ నివాసాల్లో ఏడు గంటలకు పైగా సోదాలు జరిపింది. మహదేవ్ జువెలర్స్‌తోపాటు రాజశ్రీ ఫుడ్స్‌లో విక్రాంత్ డైరెక్టర్‌గా ఉన్నారు. హైదరాబాద్‌లోనే వెంకటేశ్వర ప్యాకేజింగ్, సువర్ణదుర్గ బాటిల్స్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, ఎన్ఆర్ ఉద్యోగ్ ఎల్ఎల్‌పీ తదితర సంస్థల్లోనూ సోదాలు జరిగాయి.

**'సిట్' నుంచి సమాచారం...**

మద్యం స్కామ్‌పై 'సిట్' లోతుగా దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే... పొరుగు రాష్ట్రాల కంపెనీలు, షెల్ కంపెనీలు, హవాలా లింకులు అనేకం బయటపడ్డాయి. ఎక్సైజ్ విధానం దుర్వినియోగం, లిక్కర్ బ్రాండ్ల మానిప్యులేషన్, ముడుపుల స్వీకరణ మొదలుకొని మద్యం ముడుపుల వెనుక కీలకంగా ఉన్న మనీ రూటింగ్‌ను 'సిట్' పసిగట్టింది. ఈ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించిన మాజీ సీఎం జగన్ ఐటీ సలహాదారు రాజ్ కసిరెడ్డి(ఏ-1) రిమాండ్ రిపోర్టులోనే మనీలాండరింగ్ అంశాన్ని ప్రస్తావించింది. దీనిపై ఈడీ అధికారులు స్పందించి 'సిట్' అధిపతి రాజశేఖర్ బాబు(విజయవాడ పోలీస్ కమిషనర్)కు మే మొదటి వారంలో లేఖ రాశారు. లిక్కర్ స్కామ్ కేసు ఎఫ్ఐఆర్ కాపీతోపాటు అప్పటి వరకూ దర్యాప్తులో లభించిన ఆధారాలు అందజేయాల్సిందిగా కోరారు. ఈ వివరాలు అందిన అనంతరం... పీఎంఎల్ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్) సెక్షన్ల కింద మే 24న ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్‌ఫర్మేషన్ రిపోర్ట్) నమోదు చేశారు. విజయవాడ జైల్లో ఉన్న రాజ్ కసిరెడ్డిని మూడు రోజులపాటు కోర్టు అనుమతితో ప్రశ్నించారు. కమీషన్లు దండుకునేందుకు వీలుగా ఎక్సైజ్ పాలసీని రూపొందించడం, ముడుపులను మధ్యవర్తుల ద్వారా మనీ రూటింగ్ చేయడం వంటి వివరాలను రాబట్టారు. దీని ఆధారంగా దర్యాప్తు చేపట్టి నాలుగు నెలలపాటు పలు ఆధారాలు సేకరించి గురువారం తెల్లవారుజాము నుంచి సోదాలు జరిపారు.

**వందల కోట్ల హవాలా..**

"మాది మద్యం వ్యాపారం. మా బ్రాండ్ మార్కెట్ పెంచుకోవడానికి బంగారం కాయిన్లు కొన్నాం' అంటూ కట్టుకథలు చెప్పిన మద్యం వ్యాపారులు ఈడీ విచారణలో అసలు గుట్టు విప్పారు. బంగారం కొన్నట్లు చూపించిన బిల్లులన్నీ నకిలీవేనని, ఉత్తుత్తి ఇన్వాయిసలు చూపించి మద్యం ముడుపుల్ని వైట్ మనీగా మార్చుకున్నట్లు తేలింది. మరింత లోతుగా ఆరా తీయడంతో హవాలా రూపంలో దుబాయ్, హాంకాంగ్ మీదుగా ఆఫ్రికాకు తరలించి అక్కడ మైనింగ్ వ్యాపారం చేసినట్లుగా చూపించి, అదే డబ్బును తిరిగి భారత్‌కు తీసుకురావాలని ప్లాన్ వేశారు. అయితే అక్కడ మైనింగ్ వ్యాపారమేదీ లేదని, ఉత్తుత్తి లావాదేవీలు చూపించి, ముడుపుల సొమ్మును వైట్ చేయించుకునేందుకే ఈ స్క్రిప్టు రాశారని ఈడీ గుర్తించింది.

**కీలక ఆధారాలు లభ్యం...**

మనీ లాండరింగ్‌కు సహకరించిన వ్యాపారుల గోదాములలో ఈడీ అధికారులు సోదాలు జరిపారు. నకిలీ ఇన్వాయిసలు, కొనుగోలు చేయని బిల్లులు, ఆయా వ్యాపార సంస్థల ఆడిట్ వివరాల రికార్డులు, నగదు లావాదేవీలు, ఇతర కీలక డాక్యుమెంట్లు, డిజిటల్ డేటాను స్వాధీ నం చేసుకున్నట్లు తెలిసింది. డొల్ల కంపెనీల లావాదేవీలు, తప్పుడు బిల్లుల పూర్తి ఆధారాలను సేకరించినట్లు సమాచారం. చెన్నైలోని ది ఇండియా ఫ్రూట్స్ ప్రైవేట్ లిమిటెడ్, మోహన్‌లాల్ జువెలర్స్ (చెన్నై)లో ఈడీ అధికారులు సోదాలు జరిపారు. మద్యం రవాణా సంస్థ 'సిగ్మా' ప్రధాన కార్యాలయమున్న నోయిడాలోనూ తనిఖీలు జరిపారు. అప్పట్లో డిస్టిలరీల నుంచి మద్యం డిపోలకు, దుకాణాలకు మద్యం రవాణా చేసే కాంట్రాక్టు 'సిగ్మా'కు దక్కింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరఫరా అయిన మద్యం పరిమాణం, ప్రభుత్వానికి జమ అయిన నగదు లెక్కలు తేల్చడంపై ఈడీ దృష్టి సారించినట్లు సమాచారం.

**జగన్ అప్రమత్తం...**

మద్యం స్కామ్‌లో అనూహ్యంగా ఈడీ రంగంలోకి దిగి... ఐదు రాష్ట్రాల్లో సోదాలు జరపడంతో 'తాడేపల్లి క్యాంపు' ఉలిక్కి పడినట్లు సమాచారం. తాజా పరిణామాలపై కొందరు సీనియర్ న్యాయవాదులతో జగన్ సమావేశమై సమీక్షించినట్లు తెలిసింది.

## దేశంలో నిర్మాణ రంగం వేగంగా విస్తరిస్తోంది



హైదరాబాద్

దేశంలో నిర్మాణ రంగం వేగంగా విస్తరిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ నిర్మాణ రంగం 12 శాతం వృద్ధితో దూసుకుపోతుందన్నారు. హైదరాబాద్‌లోని హయత్ ప్యాలస్ లో ప్రముఖ బీ2బీ ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఇన్ఫోర్మా మార్కెట్స్ ఇండియా ప్రత్యేక మీడియా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో 'వరల్డ్ ఆఫ్ కాంక్రీట్ ఇండియా 2025' 11వ ఎడిషన్‌కు నాంది పలికారు. ఈ ప్రధాన ఎక్స్‌పో అక్టోబర్ 8 నుంచి 10వ తేదీ వరకు ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్లో జరగనుంది. ఇందులో 250 పైగా ఎగ్జిబిటర్లు, 350 పైగా బ్రాండ్లు, 15,000 పైగా ఇండస్ట్రీ నిపుణులు నిర్మాణం, మౌలిక సదుపాయాల రంగాల నుంచి పాల్గొననున్నారని ఇన్ఫోర్మా మార్కెట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ తెలిపారు.

## ఎన్టీఆర్‌కు నివాళికి 10 మందేనా?

అమరావతి

అసెంబ్లీ సమావేశాల తొలిరోజు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు నివాళి అర్పించడం ఆ పార్టీ ఆనవాయితీ. అయితే గురువారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, చినరాజప్ప, కాగిత కృష్ణ ప్రసాద్, బూర రామాంజనేయులు, బోడె ప్రసాద్, తెనాలి శ్రావణ్ కుమార్, ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాత్రమే ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి అసెంబ్లీకి వచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. కొన్నేళ్లుగా పాటిస్తున్న సంప్రదాయాన్ని విస్మరించడం ఏమిటని విప్‌లపై సీరియస్ అయ్యారు.

## జీఎస్టీ 2.0తో ప్రతి పౌరుడికీ లబ్ధి

అమరావతి

జీఎస్టీ శ్లాబులను సులభతరం చేయడం ద్వారా దేశంలోని ప్రతి ఒక్కరికీ లబ్ధి కలిగేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని తీసుకుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణలపై ఈ ఏడాది ఆగస్టు 15న ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి చేసిన ప్రకటన.. దేశ ప్రగతికి బాటలు వేస్తోందని కొనియాడారు. ఈ సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రంగా చంద్రబాబు నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిలిచిందని కొనియాడారు. 'రాష్ట్ర ఆదాయానికి నష్టం కలుగుతున్నా.. సామాన్యుల ప్రయోజనాల కోసం ఈ సంస్కరణలను చంద్రబాబు బలంగా సమర్థించారు. సంస్కరణలను ముందుండి నడిపిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కృషి అభినందనీయం' అని ప్రశంసించారు. జీఎస్టీ 2.0 సంస్కరణలపై శాసనసభలో గురువారం జరిగిన చర్చలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'సీఎం చంద్రబాబు సూచనల మేరకు ఈ నిర్ణయానికి ఏపీ నిర్మాణాత్మక సహకారం అందించింది. జీఎస్టీ విధానంలో తెచ్చిన అతిపెద్ద సంస్కరణల్లో ఒక దానికి రాష్ట్ర ప్రతినిధిగా బాధ్యత వహించడం గర్వకారణం' అని పేర్కొన్నారు.

**ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు..**

జీఎస్టీ రేట్ల సరళీకరణ ద్వారా ప్రజలు అధికంగా ఉపయోగించే ఉత్పత్తులు, సేవలకు డిమాండు పెరుగుతుంది. కొత్త పెట్టుబడులను ఆకర్షించి దేశాన్ని స్థిరమైన వృద్ధి మార్గంలో నిలుపుతుంది. పన్నుల విధానాన్ని సులభతరం చేసి వ్యాపార, పరిశ్రమల అభివృద్ధికి సహకరిస్తుంది. కొత్త పెట్టుబడులకు ప్రోత్సాహం అందిస్తుంది. ఆర్థిక వృద్ధి జరుగుతుంది. రైతులకు ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రపరికరాలు, ఇన్‌పుట్స్‌పై పన్నులు తగ్గించడం వల్ల సాగు వ్యయం తగ్గి ఉత్పాదకత పెరుగుతుంది. గ్రామీణుల ఆదాయం పెరుగుతుంది. ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ వృద్ధి బలపడుతుంది. పేదల కుటుంబ బడ్జెట్ తగ్గించే నిర్ణయం జీఎస్టీ సంస్కరణలతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. పాలు, పెరుగు, పన్నీరు తదితర నిత్యావసరాలపై పన్ను సున్నా చేయడంతో తక్కువ ఆదాయ కుటుంబాలకు రోజువారీ ఖర్చు తగ్గుతుంది. నెయ్యి, వెన్న, వంటపాత్రలపై పన్ను తగ్గింపు నిర్ణయం పేదల కుటుంబ బడ్జెట్‌ను తగ్గిస్తుంది. సబ్బులు, షాంపూలు, టూత్‌పేస్టులు తదితర వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల తగ్గింపుతో.. ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత మెరుగుపడుతుంది. కారు, ఫ్రిడ్జ్, టీవీ, ఏసీల ధరలు అందుబాటులోకి వస్తాయి. సిమెంట్‌పై జీఎస్టీని 18 శాతానికి తగ్గించడం ద్వారా సొంతింటి కల సాకారమవుతుంది. మందులపై జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజారోగ్య సంరక్షణ మెరుగుపడుతుంది. ఎన్నో కుటుంబాలకు బీమా భరోసా లభిస్తుంది. విద్యను మరింత అందుబాటులోకి తెస్తుంది. జీఎస్టీ సంస్కరణల ఫలితాలు ప్రతి కుటుంబానికి చేరుకునేలా కార్యక్రమం చేపట్టాలి. రెవెన్యూ, వాణిజ్య పన్నులు, పంచాయతీ అధికారులు గ్రామస్థాయిలో ప్రజల్ని నేరుగా కలిసి.. ప్రయోజనాలు వివరించాలి.

# అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం విఫలం

-మొదటిపేజీ తరువాయి

చెప్పారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే.. రాష్ట్రంలో కీలకమైన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం ఏడు త్రైమాసికాలు పెండింగ్. ప్రతి క్వార్టర్‌కు రూ.700 కోట్లు. గత ఏడాది ఎన్నికల ముందు.. 2024 జనవరి-మార్చి మొదలు ఈ ఏడాది సెప్టెంబరు వరకు చూస్తే.. మొత్తం ఏడు క్వార్టర్లు.. అంటే దాదాపు రూ.4900 కోట్లు బకాయి. అయితే ప్రభుత్వం ఇచ్చింది కేవలం రూ.900 కోట్లు మాత్రమే. అంటే ఇంకా దాదాపు లా రూ.4 వేల కోట్లు బకాయి. వసతి దీవెన గత ఏడాది రెండు దఫాలు. ఈ ఏడాది మరో దఫా పెండింగ్. అలా మొత్తం రూ.4200 కోట్లు బకాయి.

**తాడేపల్లిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వైఎస్ జగన్ భేటీ**

వసతి దీవెన కింద మరో రూ.2,200 కోట్లు బకాయి పడ్డారు. అలా ఈ రెండు పథకాలకే రూ.6,200 కోట్లు బకాయి పడ్డారు. కాలేజీలు కూడా చేతులెత్తేసే పరిస్థితులు వచ్చాయి. స్కూళ్లలో నాడు-నేడు పనులన్నీ గాలికి ఎగిరిపోయాయి. గోరుముద్ద నాశనం అయ్యింది. ట్యాబులిచ్చే కార్యక్రమం ఆగిపోయింది. సీబీఎస్ఈని రద్దు చేశారు. సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్ గాలికి ఎగిరిపోయింది. స్కూళ్లలో మినరల్ వాటర్ ప్లాంట్లు పని చేయకపోవడం కూడా ఆగిపోయింది. ఇంకా పిల్లలకు ఇచ్చే చిక్కీలు కూడా ఆపేశారు. ఇక వైద్య రంగం పరిస్థితి చూస్తే మరింత ఘోరంగా ఉంది. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీని ఆపేశారు. ఆరోగ్య శ్రీకి రూ.3500 కోట్లకు పైగా బకాయి పడ్డారు. దీంతో పథకంలో వైద్యం చేయలేమని ఆస్పత్రుల్లో బోర్డులు పెట్టేస్తున్నారు. ఇంకా ఆరోగ్య ఆసరా కింద రూ.600 కోట్ల బకాయి పడ్డారు.

**ఇవీ మెడికల్ కాలేజీల ప్రయోజనాలు:**

మన ప్రభుత్వంలో ఒకేసారి 17 మెడికల్ కాలేజీల పనులు మొదలుపెట్టి, ఏడు కాలేజీలు పూర్తి చేశాం. ఒక మెడికల్ కాలేజీ అనేది కేవలం కాలేజీ మాత్రమే కాదు. దాంతో టీచింగ్ హాస్పిటల్ ఉంటుంది. మంచి వైద్య సేవలందుతాయి. అది ప్రభుత్వ బాధ్యత. ఒకవేళ ప్రభుత్వం స్కూళ్లు, ఆస్పత్రులు, బస్సులు నడపకపోతే.. ఆయా రంగాల్లో ప్రై వేటు దోపిడిని అరికట్టగలుగుతారా? అందుకే ఎక్కడైనా, వాటిని ప్రభుత్వం తప్పనిసరిగా నిర్వహిస్తుంది. మనం ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ పనులు మొదలుపెట్టాం. దాని వల్ల అక్కడ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్య సేవలందుతాయి. ఒక మెడికల్ కాలేజీ ఉంటే, సీనియర్ వైద్యులు, స్పెషలిస్టులు, నర్సులు అందరూ అందుబాటులోకి వస్తారు. వైద్య సేవలందిస్తారు. అలా ప్రజలకు మంచి వైద్యం అందడమే కాకుండా, మన పిల్లలకు.. ముఖ్యంగా నిరుపేద పిల్లలకు మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి.

**వ్యవసాయ రంగం పరిస్థితి దారుణం:**

రైతులకు యూరియా కూడా సప్లై చేయని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. మొత్తం బ్లాక్ మార్కెట్‌ను నడిపిస్తున్నారు. ఇంకా ఏ పంటకూ గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు. ఏ పంటకు ఎంత ధర ఇవ్వాలన్న దానిపై నాడు మనం ప్రతి గ్రామంలోనూ పోస్టర్ ఇచ్చే వాళ్లం. సీఎం యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి రైతులకు తోడుగా నిలబడే వాళ్లం. మార్కెట్ జోక్యంతో మంచి ధరలకు పంటలు కొన్నాం. అందుకు రూ.7800 కోట్లు ఖర్చు చేశాం. కానీ ఈ ప్రభుత్వంలో ఏమీ లేవు. ఉచిత పంటల బీమాను కూడా రద్దు చేశారు. అన్నదాతా సుఖీభవ కింద రెండేళ్లకు రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చారు. వ్యవసాయం చేయడానికి రైతులు భయపడుతున్నారు. ఇలా అన్ని రంగాల్లోనూ పూర్తిగా తిరోగమనమే.

**ఎక్కడికక్కడ దోపిడి. నీకింత.. నాకింత:**

శాంతి భద్రతల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వ్యవస్థల్లో ఇంత లంచాలు ఎప్పుడూ చూడలేదు. ఎక్కడికక్కడ సిండికేట్లుగా మారి వసూళ్లు చేస్తున్నారు. పెదబాబుకు ఇంత, చిన బాబుకు ఇంత అని పంచుతున్నారు. లిక్కర్‌ను ఎమ్మార్పీ కన్నా ఎక్కువకు అమ్ముతున్నారు. అక్రమంగా పర్మిట్ రూమ్‌లు నడుపుతున్నారు. ఉచిత ఇసుక అన్నారు. అది లేదు. ఇంకా క్వార్ట్జ్, సిలికా.. దేన్నీ వదిలిపెట్టడం లేదు. చివరకు ఫ్లైయాష్ కూడా అమ్మేసుకుంటున్నారు.

**అన్నింటా విఫలమైనా నిస్సిగ్గుగా సూపర్‌హిట్!:**

అన్నింటా దారుణంగా విఫలమైనా, ఎన్నికల హామీలు నిలబెట్టుకోకపోయినా, ఇటీవల సూపర్‌సిక్స్.. సూపర్‌హిట్ పేరుతో కార్యక్రమం చేశారు. ఆ సభ సందర్భంగా ఇచ్చిన అడ్వర్టైజ్‌మెంట్, ఎన్నికల నాటి యాడ్‌తో చూస్తే పూర్తిగా మారిపోయింది. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు. 50 ఏళ్లు నిండిన వారందరికీ పెన్షన్ రూ.4 వేలు లేవు. పథకాలు కూడా మారిపోయాయి. ఇదీ ఈ ప్రభుత్వ నిర్వాకం.

**ప్రజల గొంతు వినడం ప్రభుత్వానికి ఇష్టం లేదు:**

అసెంబ్లీలో ప్రజల గొంతు వినిపించాలన్న తపన, ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. నాడు మన ప్రభుత్వం ఉన్నప్పుడు, టీడీపీ నుంచి వారంలోనే 5గురు మనవైపు వచ్చి కూర్చున్నారు. అలా ఇంకొందరిని లాక్కుని, చంద్రబాబుకు ప్రతిపక్ష నాయకుడి హోదా లేకుండా చేద్దామని చాలా మంది సలహా ఇస్తే, నేను వద్దన్నాను. విపక్షం గొంతు వినాల్సిన అవసరం ఉందని చెప్పాను. ఆమేరకు వారికి అవకాశాలు ఇచ్చాం. సభలో వారు చెప్పేది విన్నాం. కానీ, ఈరోజు ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ.. ప్రతిపక్షం లేకుండా ఉండాలని కోరుతోంది. అందుకే మనకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వద్దని అనుకుంటోంది. అందుకే మనల్ని ప్రతిపక్షంగా గుర్తించడం లేదు. ఇటీవల ప్రెస్‌మీట్‌లో మూడు అంశాలపై గంటన్నర మాట్లాడాను. అలా మనకు అసెంబ్లీలో కూడా అవకాశం ఇస్తేనే, ప్రజా సమస్యలు ప్రస్తావించగలం. అలా కాకుండా ఒక ఎమ్మెల్యే మాదిరిగా కొన్ని నిమిషాల సమయం మాత్రమే ఇస్తే, ఏం మాట్లాడగలం?

**ఉన్నదే ఏకైక విపక్షం.. అయినా..!:**

నిజానికి సభలో ఉన్నవి నాలుగే నాలుగు పార్టీలు. అందులో మూడు కూటమిగా అధికారంలో ఉన్నాయి. ఇక్కడ ఉన్నది ఒకేఒక విపక్షం. అటు టీడీపీ, జనసేన, బీజేపీ మూడు కూటమి. ఇక్కడ మనది ఒకేఒక విపక్షం. కానీ దాన్ని గుర్తించబోమని చెబుతోంది. ఎందుకంటే సభలో ప్రజల గొంతు వినడం ప్రభుత్వానికి ఇష్టం లేదు. అందుకే మన పార్టీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదు.

# విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శుక్రవారం 19 సెప్టెంబర్ 2025

3


www.viswamvoice.com


# క్షేత్ర స్థాయిలో యూరియా సమస్యపై రైతుల అపోహలు నివృత్తి

దొమ్మేరు ప్యాక్స్ వద్ద రైతులతో నేరుగా సంభాషణ

కలెక్టర్ కీర్తి చేకూరి "

**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం సాయంత్రం కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి వెళ్లి రైతులతో నేరుగా మాట్లాడారు. ఇటీవల యూరియా సరఫరా, అందుబాటు పై పలు అపోహలు వ్యాపించడంతో వాటిని తొలగించేందుకు కలెక్టర్ స్వయంగా దొమ్మేరు ప్యాక్స్ వద్దకు చేరుకున్నారు. కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ, "ప్రస్తుతం జిల్లాలో రైతులకు అవసరమైనంత యూరియా సరిపడా నిల్వలో ఉందన్నారు. ఎక్కడా యూరియా కొరత లేదనీ , రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. సమయానికి యూరియా అందుబాటులోకి వచ్చేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం" అని స్పష్టం చేశారు. పర్యటన నేపథ్యంలో రైతులను ప్రశ్నిస్తూ, వివిధ పంటలలో యూరియా వాడకం, దిగుబడులపై వారికి ఉన్న అనుభవాలను తెలుసుకున్నారు. అధిక మోతాదులో యూరియా







వాడటం వలన నేల ఆరోగ్యం దెబ్బతినడం, పంటలకు నష్టం కలగడం, దిగుబడి తగ్గడం వంటి అనర్థాలను వివరించారు. రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో, సిఫార్సు చేసిన మోతాదులోనే యూరియాను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత, సొసైటీ అధ్యక్షులు గారపాటి రామకృష్ణ, వ్యవసాయ సహాయ సంచాలకులు సి. హెచ్. శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ఏ. గంగాధర్, తహసీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, రైతులు, గ్రామ వ్యవసాయ సిబ్బంది, ఆర్ఎస్కే, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టీల్ కంచాలు వితరణ






రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్: రాజమండ్రి మున్సిపల్ కార్పోరేషన్ నాల్గో వార్డు మాజీ కార్పోరేటర్ బళ్ళా సత్యవతి మాతృమూర్తి స్వర్గీయ జిలగం పార్వతి జ్ఞాపకార్థం పదో వార్డు మోరంపూడి సిటీ స్పెషల్ మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు వంద స్టీల్ కంచాలు వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాస రావు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీవీ సత్యనారాయణ, జిలగం సూర్యారావు, జిలగం వీరవెంకట సత్య నారాయణ, వాణిశ్రీ, కమల్,సీనియర్ ఉపాధ్యాయురాలు పి రమాశాంతి,గణిత ఉపాధ్యాయులు అప్పన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఫైనాన్స్ సంస్థ వేధింపులకు ఆటో డ్రైవర్ అకాల మరణం

ఐఎఫ్టీయుసి జిల్లా అధ్యక్షులు వాసంశెట్టి గంగాధర్ దిగ్భ్రాంతి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఫైనాన్స్ సంస్థ వేధింపులు భరించలేక మల్లికార్జున నగర్ కు చెందిన ఆటోడ్రైవర్ మావూరి సుబ్రహ్మణ్యం (49) గురువారం అకాల మరణం చెందారు.ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.ఆటో రంగంలో ఉపాధి సన్నగిల్లడంతో సుబ్రహ్మణ్యం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు.అలాంటి ప్రతికూల పరిస్థితిలో ఇటీవల అతనిపై ఫైనాన్స్ సంస్థ ముప్పేట వేధింపులకు దిగడంతో సుబ్రహ్మణ్యం హై బీపీ కి గురై ,రక్త నాళాలు చిట్లిపోయాయి. ఆ నేపథ్యంలో ఐఎఫ్టీయుసి జిల్లా అధ్యక్షులు వాసం శెట్టి గంగాధర్ హుటాహుటిన చొరవ తీసుకుని ఆయన్ను ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి, శస్త్ర చికిత్స చేయించినా ఫలితం దక్కలేదు. గురువారం ఆయన ప్రాణాలు కోల్పోయారు.ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.ఈ మేరకు దుర్ఘటనపై వాసం శెట్టి గంగాధర్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైనాన్స్ వేధింపులతో పాటు ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పెట్టాక ఆటో డ్రైవర్ల మనుగడ కష్టంగా మారిందని,ఆయన మరణానికి ఇది కూడా ఒక కారణంగా తోడయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేసి ఆటో డ్రైవర్ల జీవనోపాధికి ఆర్థిక ఆసరా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.మేడపాటి షర్మిళ రెడ్డి,అజ్జరపు వాసు తదితరులు సుబ్రమణ్యం భౌతిక కాయానికి నివాళులర్పించారు .

## పలివెల కుటుంబాన్ని పరామర్శించిన స్వర్ణాంధ్ర ప్రెస్ క్లబ్ సభ్యులు

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** సీతానగరం మండలం చిన్న కొండేపూడి గ్రామంలో ఇటీవల కాలంలో సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పలివెల వీరబాబు మామయ్య అయిన కోడి గంగరాజు అనారోగ్య కారణంతో మృతి చెందడంతో పలివెల కుటుంబాన్ని సీతానగరం మండల స్వర్ణాంధ్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పలివెల నివాసానికి వెళ్ళి పరామర్శించి మనోధైర్యం



కల్పించారు. స్వర్ణాంధ్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు కోడి గంగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు నల్లి పెద్దబాబు మాట్లాడుతూ కోడి గంగరాజు అందరితో ఎంతో సన్నిహితంగా ఆప్యాయంగా ఉండేవారని ఆయన లేని లోటు పలివెల కుటుంబానికి తీరనిది అని అన్నారు. గ్రామంలో పెద్దమనిషిగా వ్యవహరిస్తూ పలు కుటుంబాల్లో ఎదురయ్యే కలహాలను సరిచేస్తూ గ్రామంలో,పెద్దల తరహా వ్యక్తుల్లో ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారని ఈ సందర్భంగా పెదబాబు గుర్తు చేశారు. కోడి గంగరాజు సౌమ్యుడు,మృదు స్వభావి అని గ్రామంలో అందరికీ తన వంతు సాయం చేస్తూ చిన్న కొండేపూడి గ్రామ ప్రజల అభిమానాన్ని పొందారని అన్నారు. అలాంటి మంచి వ్యక్తి ఈ రోజున లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు బందిల దుర్గాప్రసాద్,పసలపూడి రత్నరాజు,తాతపూడి బెంజిమెన్,నసమంద్ర లాజరు,దారా జీవన్ బాబు,ఆరాధ్యుల సాయి, చెరుకూరి సురేష్,అరవపల్లి సురేష్,మెరుపో రమేష్,కొల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## జేగురుపాడులో చెత్త సేకరణను పరిశీలించిన డిప్యూటీ సీ.ఈ.వో



**కడియం,విశ్వంవాయిస్ న్యూస్:** కడియం మండలం జేగురుపాడు గ్రామంలో జరుగుచున్న ఇంటింటికి చెత్త సేకరణ,చెత్త నుండి సంపద తయారీ వంటి పనులను బుధవారం డిప్యూటీ సీఈవో రామ్ గోపాల్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ చెత్త సేకరణ కార్యక్రమం అమలుపై ఆ గ్రామస్తులను, పరిశుద్ధ కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరును కూడా ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్,ఇంచార్జ్ ఎంపీడీవో సుబ్బారావు, డిప్యూటీ ఎంపీడీవో ఎన్.శ్రీనివాస రావు, కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసరావు, మండలపరిషత్ సీనియర్ అసిస్టెంట్ దాస్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాజమండ్రి కాపునాడు యువజన విభాగం అధ్యక్షుడిగా దుర్గా ప్రసాద్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమండ్రి సిటీ కాపునాడు యువజన విభాగం అధ్యక్షుడిగా సింహాద్రి వీర వెంకట దుర్గా ప్రసాద్ ను నియమించారు. ఈమేరకు స్థానిక దేవిచౌక్ లోని కాపునాడు కార్యాలయంలో ఉభయగోదావరి జిల్లాల కాపునాడు అధ్యక్షుడు గుదే రఘు నరేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ విభాగం అధ్యక్షుడు ముమ్మిడి వీరబాబు, కాపు నాయకులు చిత్రకళ బాబ్జి చేతుల మీదుగా దుర్గా ప్రసాద్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుదేరఘు నరేష్, తదితరులు మాట్లాడుతూ యువత వృత్తిలో నైపుణ్యత నేర్చుకోవాలని, సత్ప్రవర్తనతో మెలగాలని, ఉపాధి అవకాశాల గురించి అవగాహన పెంపొందించుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సేవా కార్యక్రమాలు చేపట్టాలని, సమాజాభివృద్ధిలో భాగం అవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి దేవకివాడ చక్రపాణి, సిటీ అధ్యక్షుడు రుద్ర దుర్గాప్రసాద్, రూరల్ అధ్యక్షుడు దేవినీడి రాంబాబు, రాజానగరం అధ్యక్షుడు కాళ్ల చక్రరావు, ప్రధాన కార్యదర్శి పుల్లింకల సతీష్, యూత్ ఉపాధ్యక్షుడు కోరుమిల్లి నాయుడు,యువతసుంకర మల్లికార్జునరావు, ఎరుబండి బాలాజీ , పురంశెట్టి బ్రదర్స్ , లంకలపల్లి రాజేష్, కొమ్మన బ్రదర్స్, నిల్లి బ్రదర్స్, వరద బ్రదర్స్,సింహాద్రి బ్రదర్స్, నరాల రాలశెట్టి బ్రదర్స్, మంచాల బ్రదర్స్ పాలపర్తి లక్ష్మణరావు, తలతం శ్రీను, దాసరి రాము, కలగా పండు, అద్దాల బ్రదర్స్, పేరాబత్తుల శివ, దాసరి భరత్, సాయితేజ నాగవరపు వాసు, సపిరెడ్డి వెంకటేష్, అయోధ్యల ప్రసాద్,చల్ల అజయ్, సుందరనిడి వాసు, కన్నీ పాపారావు, పెంటకోటవాసు, రామకృష్ణ,వీర శ్రీను పతివాడ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## కోరుకొండ కింగ్స్ క్రికెట్ సభ్యులకు అభినందనల వెల్లువ బిలడపా.



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** రాజమహేంద్రవరంలో ది గోదావరి ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బి3 ఫైనల్ లో ఘన విజయం సాధించిన కోరుకొండ కింగ్స్ టీం కి జనసేన పార్టీ నాయకులు అడపా శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభినందన తెలియజేస్తూ ఘన సత్కారం నిర్వహించారు. గురువారం బూరుగుపూడిలో కోరుకొండ కింగ్స్ క్రికెట్ టీం కెప్టెన్ కట్ల వీరసూరి,వైస్ కెప్టెన్ వెంకట్,మన్ ఆఫ్ ది మ్యాచ్ సిరీస్ కిషోర్,మ్యాచ్ క్రికెట్ ప్లేయర్స్ సతీష్,రమణ,వీర్రాజు,శివ,సుధాకర్, నాగేంద్ర,జయరాజు,వంశీ,అఖిల్,వికాస్, రాకేష్,నరేంద్రలను డాక్టర్ అడపా శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభినందనలు తెలియజేస్తూ, పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. పలువురు కోరుకొండ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు కోరుకొండ కింగ్స్ క్రికెట్ టీం సభ్యులకు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా కోరుకొండ కింగ్స్ క్రికెట్ టీం అడపా, తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 35వ శ్రీ దేవి నవరాత్రి మహోత్సవ ఆహ్వాన గోడ పత్రిక ఆవిష్కరణ.



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** మండలంలోని కాపవరం సెంటర్లో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో 22వ తేదీన ఉదయం 6-18 నిమిషాలకు ఆలయ వ్యవస్థాపకులు నీరుకొండ వర్తన విజయభాస్కర్ దంపతులు చేతుల మీదుగా కలశ ప్రతిష్ట చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం రాజరాజేశ్వరి ఆలయంలో శ్రీదేవి వెంకట మణిసాయి మోటార్స్ వర్కర్స్ యూనియన్ సభ్యులు, ఆలయ వ్యవస్థాపకులు నీరుకొండ బాబ్జి చేతుల మీదుగా 35వ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుండి వచ్చే నెల రెండో తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు.29వ తేదీ అమ్మవారి మూల నక్షత్రం సందర్భంగా సామూహిక కుంకుమార్చనలు,భక్తులు 550 రూపాయలు చెల్లించి పూజ ద్రవ్యాలు అందిస్తామన్నారు. వచ్చేనెల 5వ తేదీన అమ్మవారి గ్రామోత్సవం, 8వ తేదీ బుధవారం భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు. యావన్మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని, అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు, మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కట్ట సత్తిబాబు, ఉపాధ్యక్షులు జుత్తుక శ్రీమన్నారాయణ, పచారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయాలా?

- సమయం సందర్భం లేకుండా యథేచ్ఛగా మద్యం అమ్మకాలు
- ఎక్కడబడితే అక్కడ తప్పతాగుతుంటే చర్యలు ఎక్కడ?
- చివరకు మద్యం మత్తులో పోలీసులపై కూడా దాడులు
- తెలుగుదేశం ప్రభుత్వ తీరును ఎండగట్టిన మాజీ ఎంపీ భరత్





**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** మద్యం పాలసీ గురించి గొప్పలు చెప్పుకునే కూటమి ప్రభుత్వంలో ఎమ్మార్పీ ధరలకంటే పెంచి మద్యం విక్రయాలు చేయడం దారుణమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ విమర్శించారు. ఈవిషయంలో జనం నుంచి వస్తున్న ప్రశ్నలకు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, సెప్టెంబరు 12 శుక్రవారం నుంచి ఎం ఆర్పీ ధరల కంటే రూ 10 పెంచి అమ్మడం మొదలు పెట్టినట్లు జనం వాపోతున్నారని పేర్కొన్నారు. మరి చంద్రబాబు ప్రభుత్వం ఏమిచేస్తున్నట్లని ఆయన నిలదీశారు. ఇప్పటికే ఒక సమయం సందర్భం లేకుండా యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని, మద్యం షాపుల లోనే కాకుండా చుట్టూ పక్కల మందుబాబులు తప్పతాగి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నా ఏమాత్రం చర్యలు లేవని భరత్ వాపోయారు. చివరకు యువకులు తప్పతాగి, నగర నడిబొడ్డున పోలీసులపైనే దాడులకు దిగడం కూడా ఇటీవల చూశామని భరత్ ప్రస్తావించారు. తప్పతాగిన యువకులు సృష్టించిన భీభత్సానికి జనం విస్తుపోయారన్నారు. చారిత్రాత్మక రాజమహేంద్రవరంలో కూటమి మంచి పాలన అంటే ఇదేనా అని భరత్ ప్రశ్నించారు. ఇది వైభవం కాదా అని పేర్కొన్నారు. వైసిపి హయాంలో రాత్రి 8 గంటలు దాటితే మద్యం షాపులు మూతవేసేవని, ఇప్పుడు ఎప్పుడు పడితే అప్పుడు అమ్మేస్తున్నారని, దీంతో మందుబాబులు కూడా ఎక్కడ బడితే తాగుతున్నారని భరత్ పేర్కొన్నారు. ఈవిషయమై మీడియా ప్రతినిధులే పోలీసుల దగ్గర ప్రస్తావించారని ఆయన గుర్తుచేశారు. బెల్ట్ షాపులు ఇబ్బడి ముబ్బడిగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

## శస్త్ర చికిత్స చేయించుకున్న జర్నలిస్టు సురేష్ ను పరామర్శించిన అభిరామ్



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** మండలంలో ప్రజాశక్తి దినపత్రిక నందు పనిచేయుచున్న సీనియర్ జర్నలిస్ట్ చెరుకూరి సురేష్ ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమాల నిర్వహణ వ్యవహారాల పర్యవేక్షణ మంత్రి పెందుర్తి వెంకటేష్ తనయుడు రాజానగరం నియోజకవర్గ తెలుగు దేశం యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ జర్నలిస్టు నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా అభిరామ్ మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని,ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని ఉన్నారు. ప్రజల కోసమే పని చేసే నిజాయితీ గల సీతానగరం మండల విలేకరులకు ఏ చిన్న కష్టం వచ్చినా నా వంతు సహకారంగా అండగా నిలబడతానని అన్నారు. విలేకరుల అభివృద్ధి కోసం నా వంతు సహకారంగా రాష్ట్రస్థాయి కూటమి నాయకులకు విలేకరుల సమస్యలను వివరించి విలేకరుల అభివృద్ధి కోసం పని చేస్తానని అన్నారు. నిజాయితీగా పని చేస్తున్న విలేకరులు ఎంతోమంది పేద వాళ్ళు ఉన్నారని వారి అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,మంత్రి నారా లోకేష్ అండగా నిలబడటానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆయన వెంట గుల్లి దుర్గాప్రసాద్, కొడవాటి వెంకట రామారావు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన రుడా ఛైర్మన్ బొడ్డు




**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** వివిధ అనారోగ్య కారణాలతో చికిత్సల అనంతరం సీఎంఆర్ఎఫ్ కి దరఖాస్తు చేసుకున్న సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన పరిమెళ్ల పార్థసారథికి రూ. 43,670/-రూ॥ విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును రుడా ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ రాజనగరం నియోజకవర్గ ఇన్చార్జ్ ఐ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి జనసేన బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఎడిటర్ వాయిస్

# కార్యదీక్షతకు నిలువుటద్దం

ఆయన నిజాం వ్యతిరేక పోరాటయోధులలో ప్రముఖుడు. స్వార్థం అనే పదాన్ని దగ్గరకు రానీయకుండా, రాజకీయ పదవులకు ఏనాడూ పాకులాడకుండా, కేవలం ప్రజలకు, విలువల కొరకు ఎంతటి వారినైనా, ఎదిరించి ధైర్యంగా నిర్మొహమాటంగా నిలబడటం ఆయనకే చెల్లింది. సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోవడాన్ని అవమానంగా భావించి, పోరాడి సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభింప చేసిన ఘనత ఆయనదే. హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించిన కృషీవలుడు ఆయన. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని కోర్టు తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకు లందరిని ఒక తాటిపైకి తెచ్చి, ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించిన గొప్పతనం ఆయనదే. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు అకాడమి లాగ హిందీ అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షులయ్యారు. ఆయనే పోరాట పటిమకు, కార్యదీక్షతకు నిలువుటద్దంగా నిలిచిన యోధుడు కాటం లక్ష్మీ నారాయణ.

కాటం లక్ష్మీనారాయణ (సెప్టెంబరు 19, 1924 – ఫిబ్రవరి 25, 2010) రంగారెడ్డి జిల్లా శంషాబాదులో, లక్ష్మయ్య, సత్తెమ్మ దంపతులకు 1924 వ సంవత్సరంలో సెప్టెంబరు 19 న జన్మించారు. అయన తాత కాటం నారాయణ స్థానిక జమీందారుల అకృత్యాలను ఎదిరించిన దైర్యవంతులు. తాత పేరుతో పాటు దైర్య సాహసాలు కూడా పుణికి తెచ్చు కున్నారు. 1942 అక్టోబరు 12 న బూర్గుల రామకృష్ణారావు చాదర్ ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండులో సత్యాగ్రహం చేయడానికి సన్నాహాలు చేసిన సందర్భంలో నైజాము పోలీసులు బూర్గుల రామకృష్ణారావును, లక్ష్మీ నారాయణను అరెస్ట్ చేశారు. అప్పటికి నారాయణ వయస్సు పంతొమ్మిది. అప్పటి నుండి లక్ష్మినారాయణ బూర్గుల రామకృష్ణారావుని గురువుగా బావించారు. పోలీసులు లక్ష్మినారాయణను ఏడు నెలల పాటు చెంచల్ గూడ జైల్లో వుంచారు. తర్వాత లక్ష్మినారాయణ న్యాయవిద్య పూర్తిచేసి బూర్గులవారి వద్దనే జూనియర్ లాయర్‌గా చేరారు. బూర్గులతో పాటు అన్ని కార్య కలాపలాలలో క్రియా శీలక పాత్ర పోషించారు. ఆనాటి సామాజికి సమస్యలలో కూడా పాలు పంచుకున్నారు. నిజాం ప్రభుత్య ఆజ్ఞలను దిక్కరించి హిందీ పాఠశాలను స్థాపించారు. ఖాది వ్యాప్తి, దళిత జనోద్ధరణ వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆచార్య రంగా ప్రేరణతో 1945లో లక్ష్మినారాయణ హైదరాబాదు యువ జన కాంగ్రేసు స్థాపించి తాను ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. లక్ష్మి నారాయణ ఏదో ఒక ఉద్యమంలో పాల్గొనడం, అరెస్ట్ కావడం, తిరిగి రావడం, మళ్లి జైలుకెళ్లడం నిత్య కృత్యంగా మారింది. నిజాం పాలన అంతమై, నూతన రాష్ట్రం ఏర్పాటు అయ్యాక, ఆర్థిక, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో రాష్ట్ర పునర్ నిర్మాణానికి 1949 డిసెంబరులో "జనత" పేరుతో ఒక పత్రికను ప్రారంబించారు. గతంలో రజాకార్ల చేతిలో హతుడైన షోయబుల్లా ఖాన్తో కలిసి పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం ఇప్పు డితనికి బాగా ఉపక రించింది. అంతే గాక రైతుల సమస్యల పరిష్కారానికి 1952లో రాష్ట్ర కర్షక సంఘాన్ని స్థాపించారు."తెలుగు భూమి" అనే మరొక పత్రికను 1969లో ప్రారంబించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో తెలుగు అకాడమి లాగ హిందీ అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షులయ్యారు. 1968లో హైకోర్టు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకులందరిని ఒక తాటిపైకి తెచ్చి ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించారు. ఆ సందర్భంలో ఒక మహా సభ ఏర్పాటు చేయించారు. దానికి లక్షలాది మంది రాగా నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంది కూడా రావడం విశేషం.లక్ష్మి నారాయణ సాధించిన ఘన విజయాలలో ఇది ఒకటి. స్వాతంత్ర్య ఉద్యమాలలో పాల్గొన్న యోధులకు పెన్షన్ ఒక వరం లాంటిది అని నమ్మేవారు లక్ష్మి నారాయణ. స్వతంత్ర భారత్ లో ఈ అవకాశాన్ని అందరు వినియోగించు కుంటున్నా.... నిజాం పాలిత ప్రాంతాల యోధులకు ఆ అవకాశం రాలేదు. దీనిపై లక్ష్మి నారాయణ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. కేంద్రం అంగీకరించక పోవడంతో లక్ష్మి నారాయణ " తెలంగాణ సమర యోధుని సత్యాగ్రహం" అని రాసిన ఒక అట్టను మెడలో వేసుకుని ప్రధాని ఇంటి ముందు నిరాహార దీక్ష చేసారు. ఢిల్లీ పత్రికలు ప్రముఖంగా ఈ అంశాన్ని ప్రచురించాయి. దాంతొ ఇందిరా గాంధి లక్ష్మి నారాయణను పిలిపించి కారణం అడగగా..... " సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను మీరు గుర్తించక పోవడాన్ని మేము అవమానంగా భావిస్తున్నాము. బ్రిటిష్ ఆంధ్ర స్వాతంత్ర్య యోధులు ఒక బ్రిటిష్ వారితోనె పోరాడారు. కాని సంస్థాన లోని యోధులు అటు సంస్థానాధీశుల తోను, ఇటు బ్రిటిష్ వారితోను పోరాడారు. 15 ఆగస్టు మాకు స్వాతంత్ర్య దినం కాదా? హైదరాబాదు విముక్తి జరిగిన సెప్టెంబరు 17 ను స్వాతంత్ర్య



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

## స్థానిక సమస్యల పరిష్కారమే

# పంచాయితీ రాజ్ లక్ష్యం



భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీరాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయ తీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థలవ్యవస్థ. ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనా వ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగు ణంగా గ్రామ వృత్తి పనివారల ప్రతినిధులతో పనిచేయగా, బ్రిటిష్ పాలన కాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వ పరిపాలనా సంస్థలు రూపు దిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఆంధ్ర ప్రదేశ్ లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్ నగర్ జిల్లా, షాద్‌నగర్లో ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతి సమితి, జిల్లా స్థాయి లో జిల్లా పరిషత్ ఏర్పడింది. 1986లో బ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్ గా మార్చారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగా త్మక ప్రాతిపదికగా, సమాజ వికాసా భివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుక బడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యా లు, కుటీర పరిశ్రమలు అనే ఐదు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ స్కీమ్) గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీ ని 1956లో నియమించా రు. ఈ కమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈ కమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్య వికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి. బల్వంతరాయ్ మెహతా (1900 ఫిబ్రవరి 19 – 1965 సెప్టెంబరు 19) స్వాతంత్ర్య సమర యోధుడు, సామాజిక కార్యకర్త, పంచాయితీ రాజ్ నూతన వ్యవస్థ మార్గదర్శకుడు. ఆయన బర్డోలి సత్యాగ్రహ భాగస్వామి. గుజరాత్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. స్వయం పాలన కోసం ప్రజల పోరాటం ఆయన జీవితా శయం. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సంబంధంగా... "బల్వంతరాయ్ మెహతా కమిటీ" సిఫార్సులు దేశంలో అమలు పరచబడి, ప్రాచుర్యం పొందిన పంచాయితీ రాజ్ అనే విప్లవాత్మక కార్యక్రమంతో మెహతా గుర్తింపు పొందాడు. స్వాతంత్ర్యం తరువాత మెహతా భారతదేశ లోక్‌సభకు పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికయ్యా డు. పార్లమెంట్ అంచనా కమిటీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ప్రణాళిక ప్రాజెక్ట్స్ కమిటీ అధ్యక్షుడుగా రాష్ట్రాలలో మూడు అంచెల వ్యవస్థ స్థాపన కోసం మెరుగైన విధానానికి అద్భుతమైన నివేదికను సిద్ధం చేశాడు. తద్వారా భారత దేశపు పంచాయితీ రాజ్ ఫాదర్‌గా ప్రశంసించ బడ్డాడు. 1952, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన సమాజ అభివృద్ధి కారక్రమం ప్రాతి పదికగా, జాతీయాభివృద్ధి మండలి 1957, జనవరి, 16న బల్వంత్ రాయ్ గోపాల్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీ క్షించి, గ్రామ పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది. బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3 – అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ను సిఫారసు చేస్తూ, తన నివేదిక ను 1957, నవంబరు 24న జాతీ యాభివృద్ధి మండలికి సమర్పించిం ది. కమిటీ నివేదికను జాతీయా భివృద్ధి మండలి 1958, జనవరిలో ఆమోదించింది. ఈ నివేదికలోని అంశాల అమలు వివిధ రాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థఏర్పాటుకు ప్రయత్నించాయి. భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచ నంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్ జిల్లాలోని, సికార్ అనే ప్రాంతంలో ఈ విధానా న్ని ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం..."నేడు ప్రారంభమ వుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడతాయి". మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1959, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్లోని రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ వద్ద నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెహ్రూ ప్రారంభించారు. బల్వంతరాయ్ మెహతా కమిటీ చేసిన ముఖ్యమైన సిఫార్సులు... దేశంలో 3 అంచెల పంచాయతీ రాజ్ విధానం ఏర్పాటు చేయాలి. 1) జిల్లా స్థాయిలో – జిల్లా పరిషత్, 2) బ్లాకు స్థాయిలో – పంచాయతీ సమితి, 3) గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీప్రజల భాగస్వామ్యం కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నిక లను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమ బద్ధంగా ఎన్నికలు జరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి. స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కింది స్థాయి లో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయుల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరి పాలనా, వనరుల, ప్రణాళికా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేయాలని బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగా పరిష్కరించడం, ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్ వ్యవస్థ యొక్క ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్య సాధన కోసం స్వాతంత్ర్యానంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తనవంతు కృషి చేస్తూనే ఉన్నాయి.

# మనసు కవి ఆత్రేయ

1921 మే 7 న శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సూళ్ళూరుపేట మండలంలో గల మంగళంపాడు గ్రామంలో ఆత్రేయ జన్మించారు. తండ్రి కృష్ణమాచార్యులు. తల్లి సీతమ్మ. చిన్నప్పటినుండి నాటకంలోని పద్యాలను రాగయుక్తంగా చదివేవారు. సమాజంలో మధ్య తరగతి కుటుంబ సమస్యలను తీసుకుని మనోహరమైన నాటకాలుగా మలిచారు. 'ప్రవర్తన', 'ఎన్.జి.వో' నాటకాలు ఆంధ్ర నాటక కళా పరిషత్ అవార్డుల ను గెలుచు కున్నాయి. విశేషంగా రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో ప్రదర్శనలు జరిగాయి. అలాగే 'కప్పలు' బాగా ప్రాచుర్యం పొందిన నాటకం. రాయలసీమ క్షామ పరిస్థితుల ను వివరించే 'మాయ' నాటకం, స్వాతంత్ర్యానంతరం దేశంలో చెలరేగిన హిందూ ముస్లిం హింసాకండను 'ఈనాడు' అనే మూడంకాల నాటకం, విశ్వశాంతిని కాంక్షించే 'విశ్వశాంతి' నాటకాన్ని రచించారు. విశ్వశాంతి నాటకానికి కూడా రాష్ట్ర స్థాయి బహుమతి లభించింది. 'సామ్రాట్ అశోక', 'గౌతమ బుద్ధ', 'భయం' నాటకాలు కూడా వ్రాసారు. ఆత్రేయ పలు చలన చిత్రాలకు సంభాషణలు, పాటలు రాశారు. ఆయన పాటలలో ఎక్కువగా మనసుకు సంబంధించిన ప్రస్తావన ఉండటం వలన అతను మనసు కవి, మన సుకవి అయ్యారు. దీక్ష (1950) చిత్రానికి తొలిసారి గీత రచన, అదే సంవత్సరంలో విడుదలైన సంసారం చిత్రానికి తొలిసారి కథా రచన చేసారు. వాగ్ధానం (1961) చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం కూడా చేసాడు. చిన్ని చిన్ని పదాలతో స్పష్టమైన భావాన్ని పలికించడంలో ఆత్రేయ ఘనాపాఠి. తెలుగు పాటను ఆస్వాదించే అందరి మనసులను దోచుకున్న ఈ మనసు కవి 1989, సెప్టెంబర్ 13 న ఈ లోకాన్ని వదిలిపోయారు. ఆత్రేయ తాత్విక ధోరణితో రాసిన సంభాషణలు జీవిత తత్వాన్ని గుట్టు విప్పుతాయి. జీవితాన్ని కాచి వడబోసిన నగ్నసత్యాలు. ప్రతి వ్యక్తి జీవితానికి మార్గ దర్శకాలు. "వెలుగు నీడలు" చిత్రంలో ఇటువంటి ఓ అద్భుత సంభాషణ తనదైన శైలిలో రాసి ఓ సన్నివేశానికి ఆత్రేయ జీవం పోసారు. సెంటిమెంటల్ అనే పదానికి భావగర్భితమైన, కరుణ రసముగల, శృంగార భావములుగల అర్థాలున్నాయి. సినిమా పరిభాషలో సెంటిమెంటల్ డైలాగ్స్ అంటే పరస్పర ప్రేమాను రాగాలను, ఆత్మీయానుబంధాలతో, కరుణరస భరితంగా ఒకరికొకరు సంభాషించు కోవడం. సెంటిమెంటల్ డైలాగ్స్ రాయడంలో ఆత్రేయది అందెవేసిన చెయ్యి. ఆత్రేయకు లేడీస్ సెంటిమెంట్లు లేకపోయినా లేడీస్ సెంటిమెంట్ డైలాగ్స్ బాగా రాస్తారని చెప్పుకుంటారు. ఆత్రేయ గొప్ప వేదాంతి. ప్రతి విషయాన్ని వాస్తవిక దృష్టితో ఆలోచించి సంభాషణలను సమకూర్చాడు.



"వేదాంతం, వైరాగ్యం ఒంటపడితే చాలా ప్రమాదం. వాటి జోలికిపోకుండా ఉంటే చాలా మంచిది. అవి మనిషిలోని కార్య దీక్షను, గట్టి విశ్వాసాలను దెబ్బతీస్తాయి" అని ఆత్రేయ అనే వారు. శృంగార రసం శృతి మించితే అశ్లీలం అవుతుంది. ఇటువంటి కొన్ని సన్నివేశాలకు రచయిత పచ్చిగా రాయక తప్పదు. నేను రాయను అని మడికట్టుకు కూర్చుంటే సినీ రచయితగా చిత్ర పరిశ్రమలో ఏ రచయితా నిలబడ లేడు. ఈ కారణమే ఆత్రేయను బూత్రేయ అని కూడా పేరు మూట గట్టుకునేలా చేసింది. 'దీక్ష' (1950) చిత్రానికి తొలిసారి అతను పాటలు రాశారు. "పోరా బాబు పో.." అంటూ సాగే పాట ప్రేక్షకులను, సినీ మేకర్స్‌ని బాగా ఆకట్టుకోవడం ఆత్రేయ పాటల్లోని మాధుర్యం ఏంటో సినిమా పరిశ్రమకు తెలిసింది. అదే ఏడాదిలో విడుదలైన 'సంసారం' చిత్రానికి తొలిసారి కథా రచన కూడా చేశారు. దీంతో దర్శక, నిర్మాతలంతా ఆత్రేయతో పాటలు రాయించేందుకు క్యూ కట్టారు. 'అర్ధాంగి' చిత్రంలో 'రాక రాక వచ్చావు చందమామా..', 'తోడి కోడళ్ళు' చిత్రంలో 'కారులో షికారుకెళ్లి...', 'శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం'లో 'శేషశైలవాసా శ్రీ వెంకటేషా...', 'మంచి మనసులు'ల్లో 'శిలలపై శిల్పాలు చెక్కినారు...', 'మూగ మనసులు' చిత్రంలో 'ముద్దబంతి పువ్వులో...' 'డాక్టర్ చక్రవర్తి'లో 'నీవులేక వీణ ...', 'అంతస్తులు'లో 'తెల్ల చీర కట్టుకున్నది ఎవరి కోసము...', 'ప్రేమ్‌నగర్'లో 'నేను పుట్టాను ఈ లోకం మెచ్చింది. నేను ఏడ్చాను ఈ లోకం నవ్వింది. నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది...', 'మరోచరిత్ర'లో 'ఏ తీగ పువ్వునో ఏ కొమ్మ తేటినో...', 'ఇంద్ర ధనస్సు'లో 'నేనొక ప్రేమ పిపాసిని నీవొక ఆశ్రమ వాసివి...', 'అంతులేని కథ'లో 'కళ్ళల్లో ఉన్నదేదో కన్నులకు తెలుసు...', 'మరో చరిత్ర'లో 'విధి చేయు వింతలన్నీ...', 'ఇది కథ కాదు'లో 'సరిగమలు గలగలలు...', 'స్వాతిముత్యం'లో 'చిన్నారి పొన్నారి కిట్టయ్య...' తోపాటు 'తేనే మనసులు', 'ప్రైవేట్ మాస్టర్', 'బ్రహ్మచారి', 'మట్టిలో మాణిక్యం', 'బడి పంతులు', 'పాపం పసివాడు', 'భక్త తుకారం', 'బాబు', 'జ్యోతి', 'అందమైన అనుబంధం', 'గుప్పెడు మనసు', 'ఆకలి రాజ్యం', 'అభిలాష', 'కోకిలమ్మ', 'అభినందన', 'ప్రేమ' వంటి చిత్రాల్లో 400లకుపైగా పాటలు రాసి తెలుగు ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. పాటలన్ని భావోద్వేగాల సమాహారంగా ఉండటంతో ఆత్రేయను 'మనసు కవి'గా ప్రేక్షకులు, అభిమానులు అభివర్ణించారు. ఎంతటి బరువైన భావాలనైనా అర్థవంతమైన తేలికైన పదాలతో పలికించడంతో ఆత్రేయ దిట్ట. మూడున్నర దశాబ్దాల సినీ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను చవిచూశారు. పాటల్లో తన అనుభవాలను పొదిగి, గుండె బరువును దించుకునే వారని ఆయన సన్నిహితులు పలు సందర్భాల్లో చెప్పారు. రాయక నిర్మాతలనూ రాసి ప్రేక్షకులనూ ఏడిపిస్తాడని ఆయన పై ఓ ఛలోక్తి. కానీ ఆత్రేయ... రాస్తూ నేనెంత ఏడుస్థానో ఎందరికి తెలుసు అనేవారు. తెలుగు సినిమా పాటలను మామూలు వాడుక మాటలతోనే రాయగలిగిన ప్రతిభా శాలి ఆత్రేయ. ఉదాహరణకు, తేనె మనసులు సినిమాలో ఈ రెండు పాటలు "ఏవమ్మా నిన్నేనమ్మా ఏలా ఉన్నావు," "నీ ఎదుట నేను వారెదుట నీవు, మా ఎదుట ఓ మామా ఎప్పుడుంటావు." అలాగే ప్రేమనగర్ సినిమాలో "నేను పుట్టాను ఈలోకం మెచ్చింది,, నేను ఏడ్చాను ఈ లోకం నవ్వింది, నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది." పాట,, "తేట తేట తెలుగులా తెల్లవారి వెలుగులా" పాట. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ చిట్టా అనంతమే అవుతుంది. మరోచరిత్ర సినిమాకి రాసిన పాటలు/ ఏ తీగ పువ్వునో...ఏ కొమ్మ తేటినో.../ పదహారేళ్లకు...నీలో నాలో/ బలే బలే మగాడివోయ్ ...నీ అన నీ దానినోయ్...అనే పాటలు ఇప్పటికి శ్రోతలని అలరిస్తూనే ఉన్నాయి. కృష్ణ, శారదలు నటించిన "ఇంద్రధనుస్సు" సినిమాలోని పాట "నేనొక ప్రేమ పిపాసిని నీవొక ఆశ్రమ వాసివి" అనే పాట ఆత్రేయకు అత్యంత ఇష్టమైన పాటగా చెబుతారు. అతన్ని ఒకసారి ఏదో సందర్భంలో ఈ పాట నా జీవితానికి సంబంధించిన పాట అని చెప్పారు. మనసును గూర్చి ఆత్రేయ రాసినన్ని పాటలు వేరొకరు రాసి ఉండలేదు. అందుకనే ఆయనను మనసు కవి అనేవారు. ఆత్రేయ పాటల రచయిత మాత్రమే కాకుండా, అనేక సినిమాలకు మాటల రచయితగా కూడా ఉన్నారు. ముఖ్యంగా ప్రేమనగర్ సినిమా విజయంలో ఆత్రేయ రాసిన పాటలు, మాటలు ముఖ్యభూమిక వహించిందంటే అతిశయోక్తి కాదు.



## మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయడం దారుణం ...



20వ తేదీన విజయవాడ అంబేద్కర్ స్మృతివనంలో నిరసన

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఎ.పి.లో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీ లను పిపిపి విధానంలో ప్రైవేట్ పరం చేయడం అన్యాయమని ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఎంప్లాయిస్ %డ% ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మగ్రి బాబ్జీ ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థులకు చాలా నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. స్థానిక సి.టి. ఐ.ఆర్.ఐ రోడ్డు లోని కార్యాలయంలో మగ్రి బాబ్జి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు విజయవాడ లోని అంబేద్కర్ స్మృతి వనంలో జరిగే నిరసన కార్యక్రమానికి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ముఖ్య సలహాదారు సిహెచ్. సుబ్బారావు,కార్యదర్శి పి. రవికుమార్,సభ్యులు ఆస్వీర్వాదం,కొంకి రమేష్, చింతా అనిల్ బాబు,చింతా అనిత తదితరులు పాల్గొన్నారు.

## పలివెల వీరబాబు కుటుంబాన్ని పరామర్శించిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చిన్న కొండేపూడి గ్రామంలో సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు వారి మామయ్య కోడి గంగరాజు ఇటీవల స్వర్గస్తులైనారు. వారి పెద్దకార్యం కార్యక్రమంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపిఐ ఎంఎల్ వీరబాబు కుటుంబాన్ని పరామర్శించిన పెందుర్తి అభిరామ్



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** ఇటీవల కాలంలో సీతానగరం మండలం చిన కొండేపూడి గ్రామానికి చెందిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు మామయ్య కోడి గంగరాజు స్వర్గస్తులయ్యారన్న సంగతి తెలుసుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమాల నిర్వహణ వ్యవహారాల పర్యవేక్షణ మంత్రి పెందుర్తి వెంకటేష్ తనయుడు రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ వారి నివాసానికి వెళ్లి పరామర్శించి మనోధైర్యం కలిగించారు.

## నకిలీ ఎస్సైగా చలామణి అవుతున్న వ్యక్తిని అరెస్టు చేసిన కొవ్వూరు రూరల్ ఎస్సై శ్రీహరి



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** నకిలీ పోలీసుగా రోడ్లమీద తిరుగుతూ వాహనాలను ఆపి డబ్బులు వసూలు చేస్తున్న సరళ సంజయ్ రాజును అదుపులోకి తీసుకున్నట్లు కొవ్వూరు రూరల్ ఎస్సై శ్రీహరి తెలిపారు. వివరాలకు వెళితే బుధవారం ఉదయం తెల్లవారుజామున కొవ్వూరు మండలం గోవర్ధనగిరి మెట్ట వద్ద ఐసర్ వ్యాన్ లో వాషింగ్ పౌడర్ లోడ్ చేసుకుని వెళుతున్న ఐసర్ వ్యానును ఆపి రికార్డులను పరిశీలించి 5000 రూపాయలు ఇస్తే వదిలేస్తామని చెప్పగా సదరు వ్యక్తి దగ్గర 2000 రూపాయలు దౌర్జన్యంగా తీసుకుని రసీదు ఇవ్వగా ఆరసీదును పట్టుకువచ్చి కొవ్వూరు రూరల్ పోలీస్ స్టేషన్ లో ఐసర్ వ్యాన్ డ్రైవర్ గాండ్ల సంతోష్ ఫిర్యాదు చేశారు. ముద్దాయి ధవలేశ్వరం గ్రామం చెందిన సరేల సంజయ్ రాజుగా పోలీసులు గుర్తించి అతనిని అరెస్టు చేసి డీఎస్పీ దేవకుమార్ కొవ్వూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయబాబు పర్యవేక్షణలో ముద్దాయిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించినట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు. సదరు ముద్దాయి రాజమండ్రి వన్ టౌన్ 3 టౌన్ రాజానగరం రావులపాలెం శ్రీకాకుళం జేఆర్ పురం తదితర పోలీస్ స్టేషన్లో ఇదే తరహా నకిలీ ఎస్సైగా రోడ్లపై వాహనాలు ఆపి డబ్బులు వసూలు చేయడం తో కేసు నమోదు చేసి జైలుకు తరలించి

## జనుపల్లిలో ప్రధాన మంత్రి మోదీ పుట్టినరోజు సందర్బంగా.. స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం.





భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు రోజు సందర్బంగా సెప్టెంబర్ 18 గురువారం రోజున డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ జనుపల్లి గ్రామంలో స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంబించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం దేశంలోని మహిళలు పిల్లలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం వారికి అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించడం ఆరోగ్యం పై అవగాహన పెంచడం వంటి లక్ష్యాలు అమలు చేయడం. ఇందులో భాగంగా గురువారం జనుపల్లి గ్రామంలో మోదీ పుట్టినరోజు సందర్బంగా ఏర్పడిన స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ నందు గ్రామ సర్పంచ్ గాణాల భారతీ వెంకటేశ్వరావు అధ్యక్షతన వైద్య శిబిరం ప్రారంభిచబడింది. ఈ యొక్క ఆరోగ్య వైద్య శిబిరం మండల పరిధిలో బండారులంక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ గౌతమీ, డాక్టర్ అమృత, వారి సిబ్బంది అధ్యర్యంలో నడుపబడింది. సదరు శిబిరం నందు ప్రత్యేకంగా సుమారు 150మంది మహిళలకి యన్ సి డి, బి పి, (రక్తపోటు ) షుగర్ వ్యాధులు, క్షయ వ్యాధులు, టి బి,సికిల్ సెల్ ఎనిమియా, తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరం నందు టి బి రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో ఎం పి టి సి సభ్యులు పోలిశెట్టి మంగాదేవి, గంగన్న స్వామి, జయలక్ష్మి, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అమలాపురంలో వృత్తి పన్ను చట్టంపై అవగాహన సదస్సు



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** రాజమహేంద్రవరం డివిజన్ జాయింట్ కమీషనర్ ఉత్తర్వుల మేరకు, అమలాపురం ఏబీసీడీ ఫుడ్ కోర్టులో వృత్తి పన్ను చట్టంపై వ్యాపారస్తులకు, టాక్స్ కన్సల్టెంట్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ కమీషనర్ అమలాపురం స్పెషల్ ఎ సి టి ఓ భక్తవత్సలరావు, శ్రీనివాస రెడ్డి, జీవీఎస్ఎన్ ప్రసాదు, ఆఫీసు సిబ్బంది ఈ సమావేశం నిర్వహించారు. సదస్సులో అసిస్టెంట్ కమీషనర్ ఎం. జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, వార్షిక టర్నోవర్ రూ.10 లక్షలు ఉన్న వ్యాపారస్తులు తమ టర్నోవర్ ఆధారంగా వృత్తి పన్ను చెల్లించాలని సూచించారు. స్థానిక వ్యాపారస్తులు, టాక్స్ కన్సల్టెంట్లు అడిగిన సందేహాలకు వారు సమాధానాలు ఇచ్చి, నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ, బోణం సత్తి బాబు, ఛాంబర్ గౌరవ సలహాదారు కంచపల్లి అబ్బులు, జిల్లా టాక్స్ కన్సల్టెంట్ అధ్యక్షులు పి. వెంకటేశ్వరరావు, అమలాపురం టాక్స్ కన్సల్టెంట్ సెక్రటరీ కె. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమలాపురం లో ఘనంగా చెల్లిబోయిన పుట్టినరోజు వేడుకలు









**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అమలాపురం పట్నం సూర్య నగర్ కి చెందిన వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. మండపేట ముమ్మిడివరం నియోజకవర్గ వైసిపి పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు ఆయన స్వగృహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. బర్త్డే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు కార్యకర్తలు..

శుభాకాంక్షలు తెలిపిన వారిలో అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి నియోజకవర్గాల కోఆర్డినేటర్లు పినిపే శ్రీకాంత్. పిల్లి సూర్యప్రకాష్. గొల్లపల్లి సూర్యారావు గన్నవరపు శ్రీనివాసరావు పొన్నాడ సతీష్ గొల్లపల్లి డేవిడ్. వైసిపి పార్టీ మండల అధ్యక్షులు. మున్సిపల్ కౌన్సిలర్లు. వైసిపి పార్టీ యువజన విభాగం అధ్యక్షులు.ఆయన అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. గోసాల లో ఆవులకు పశుగ్రాసం. అమలాపురం ప్రభుత్వ హాస్పిటల్లో రోగులకు పళ్ళు బ్రెడ్స్ అందజేశారు.

## టెన్నిక్వాయిట్ విజేతలకు చైర్ పర్సన్ రాణి సత్కారం...



**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** ఇటీవల మండపేట లో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నిక్వాయిట్ పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చి తొలి రెండు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు పిల్లి రామారావు, వడ్డాది వినయ్ కుమార్ లను మండపేట మున్సిపల్ చైర్మన్ పతివాడ నూక దుర్గా రాణి అభినందించారు.మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్ కు క్రీడాకారులకు స్వీట్ బాక్సులు అందజేశారు. శాలువా తో సత్కరించారు. త్వరలో ఉత్తర ప్రదేశ్ లో నేషనల్ మీట్ లోనూ ఆపై జర్మనీ లో జరిగే ప్రపంచ కప్ లోనూ ఇదే తరహా ఆటను కనబర్చి మరోసారి విశ్వ విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. మండపేట పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలపాలని పేర్కొన్నారు.

## చలో అమలాపురం... యువజన విభాగ అధ్యక్షులు శ్రీకృష్ణ పిలుపు...



**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ శుక్రవారం విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో చలో మెడికల్ కాలేజి పేరుతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురంలో జగన్ హయాంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజ్ దగ్గరకు శాంతియుతంగా పెద్ద ఎత్తున వెళ్ళి, వాస్తవ పరిస్థితులను మీడియా మిత్రుల ద్వారా ప్రజలకు వివరించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ కార్యక్రమానికి వైయస్సార్ నాయకులు, యువకులు, విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని మండపేట నియోజకవర్గ యువజన విభాగం కన్వీనర్ చోడే శ్రీకృష్ణ పిలుపునిచ్చారు.

## శుక్రవారం రెవెన్యూ కేర్, ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహణ

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** సెప్టెంబర్ 19 వ తేదీ శుక్రవారం మధ్యా హ్నం మూడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు రెవెన్యూ కేర్, ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషా%శీ%తి స్థానిక కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు నిర్వహిస్తారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున రెవెన్యూ, పౌరసరఫరాల విభాగాలలో పనిచేసే సిబ్బంది తమ తమ ఉద్యోగ సంబంధిత సమస్యలను వ్యక్తిగతంగా ఆమె దృష్టికి వ్రాతపూర్వకంగా తీసుకుని వచ్చి తగు పరిష్కార మార్గా లు పొందాలని ఆమె ఆ ప్రక టనలో ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు.

## దిగువ స్థాయి నౌకరి, ప్రభుత్వాలు గుర్తించని చాకిరి

రెవెన్యూ శాఖలో అతి తక్కువ వేతనం కలిగిన వారు విఆర్ఎ లే..

8 సంవత్సరాలు గా పనిభారం పెంచారు,జీతాలు పెంచలేదు.

పదివేల రూపాయలతో నెలంతా కుటుంబాలతో బ్రతకగలమా.?

అర్హులైన వారికి విఅర్ఓ,అటెండ్,నైట్ వాచ్ మెన్ లుగా పదోన్నతి కల్పించండి.

రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పట్టిన విఆర్ఎ లు





**రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా విలేజ్ రెవెన్యూ సహాయకులు చేపట్టిన ఆందోళనలో భాగంగా గురువారం రాయవరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వీఆర్ఏ లు మండల కేంద్రమైన రాయవరంలో గల తహసీల్దారు కార్యాలయం ఎదుట, మండల విఆర్ఎ ల సంఘ అద్యక్షులు చంద్రమళ్ళ వీరబాబు అద్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ ప్రభుత్వం విఆర్ఎ ల సమస్యల గురించి పట్టించుకోవడం లేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం తమను అన్ని విధాలుగా వినియోగించుకుని, ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదని, వేతనాలు పెంచకపోగా, డిఎ ని సైతం ఉప సంహరించి రికవరీ చేశారని వాపోయారు, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అయినా జీతాలు పెరుగుతాయని, ప్రమోషన్లు అమలు చేస్తారని అశించామని, కానీ గడిచిన సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం విఆర్ఎ ల సమస్యలు ఏ ఒక్కటి పరిష్కరించలేదన్నారు. రీ సర్వే పేరుతో మైళ్ళకొద్ది దూరం ఇతర ప్రాంతాలకు వెళ్లి పని చేయాల్సి వస్తుందని, అదనపు పని భారం పెంచినందు కు అవసరమైన టి ఏ, డి ఏ లు గురించి మాట్లాడడం లేదని అన్నారు. అదనపు పనిభారం తో పాటు ఆర్థిక సమస్యలు కూడా తోడవడంతో, వీ అర్ ఏ ల కుటుంబాలు పస్తులతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. గత 8 సంవత్సరాల నుండి గ్రామ రెవెన్యూ సహాయకు లకు జీతాలు పెరగలేదని, నిత్యావసర వస్తువుల ధరలు చూస్తే ఆకాశాన్ని అంటుతున్నాయని వాపోయారు. రెవెన్యూ శాఖ లో దిగువ స్థాయిలో పనిచేస్తూ ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉన్నామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రధాన పాత్ర పోషిస్తూ, గ్రామాల్లో నివసిస్తూ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు.గ్రామ రెవెన్యూ సహాయకులుగా రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేస్తున్నామని, రెవెన్యూ శాఖలో సుదీర్ఘకాలం నుండి చాలా తక్కువ వేతనంతో పనిచేస్తున్నా గుర్తింపు లేదన్నారు.ముఖ్యంగా అర్హతను బట్టి విఆర్ఎ లకు విఆర్ఓ లుగా,నైట్ వాచ్ మెన్ లుగా,అటెండర్ లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టిన అనంతరం తహసీల్దారు ఐపి శెట్టి కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ ల సంఘం గౌరవ అధ్యక్షులు షేక్ ఖాషీం, సెక్రటరీ విక్కీ, కోశాధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మండపేటలో స్వస్థ నారి అభియాన్... మహిళల ఆరోగ్యం పట్ల అవగాహన సదస్సు...




**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** మండపేట లో 7,8వ వార్డు లలో యు పి హెచ్ సి అధ్వర్యంలో స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్యకరమైన మహిళలు బలమైన కుటుంబాల కోసం శిబిరాలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు పురస్కరించుకుని మండపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళలకు అసంక్రమిత వ్యాధులపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు,మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, క్షయవ్యాధి స్క్రీనింగ్ తో పాటు మానసిక ఆరోగ్య సేవలు,వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు,తల్లి–శిశు సేవలు, పోషకాహార సూచనలు అందించారు.డాక్టర్ రమ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించి, పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు.చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. విటమిన్లు, పోషకాలు ఆహారం ద్వారానే సమృద్ధిగా పొందవచ్చని సూచించారు. ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ మండపేట అంగన్వాడి టీచర్లు బి. అనంత లక్ష్మి ,కె. శ్యామల బాలింతలు తినాల్సిన ఆహారపు విధానం,ప్రతి నెలలో ఏ ఆహారం తీసుకోవాలో స్పష్టంగా వివరించారు.వారికి అందించే పోషకాహార కిట్ల వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 8 వ వార్డ్ టిడిపి ఇంచార్జ్ పెందుర్తి ప్రదీప్ కుమార్, బి ఎల్ ఏ ముమ్మిడివరపు నారాయణ రావు ,7వ వార్డ్ కౌన్సిలర్ సవరపు సతీష్ ,7వ వార్డు టిడిపి ఇంచార్జ్ చాపల వీరబాబు 7వ వార్డ్ నాయకులు గంధం వెంకన్న, యుపి హెచ్ సి హాస్పిటల్ సిబ్బంది, ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ సిబ్బంది ఎన్. అనంత లక్ష్మి , ఆశ వర్కర్స్, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.



# దేశ ప్రజల క్షేమం కోరే నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ

జిల్లా ఉపాధ్యక్షులు చాట్రాతి ఆద్వర్యంలో మోడీ జన్మదిన వేడుకలు

మండలంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన బిజెపి కార్యకర్తలు

ప్రధాని పాలనను కొనియాడిన జిల్లా కార్యదర్శి నల్లమిల్లి



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75వ పుట్టినరోజు వేడుకలను రాయవరం మండలం, పసలపూడి గ్రామంలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ రాయవరం మండల మాజీ అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తొలుత బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, లొల్ల గ్రామ సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి శుభాకాంక్షలు తెలిపి. అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పార్టీ శ్రేణులు, వివిధ వర్గాల ప్రజలు నరేంద్ర మోడీ గారి జన్మదిన వేడుకలు జరపడం సర్వసాధారణం, అయినప్పటికీ ఈ సంవత్సరం ఒక ప్రత్యేకతతో కార్యక్రమం జరుపుతున్నామన్నారు. ప్రజా అవసరాలకు తగినట్లుగా నిత్యవసర వస్తువులన్నిటిపై జీఎస్టీ తగ్గించడం గొప్ప పరిణామమని అన్నారు. దాదాపుగా 350 వస్తువులకు పైగా పన్నుల పూర్తిగా ఎత్తివేయడం వంటి విప్లవాత్మక మార్పులు చేపట్టి ప్రజలను, దేశాన్ని అభివృద్ధి పదం వైపు తీసుకువచ్చే నిర్ణయాలు చేయడం అనేది ఎంతో ఆనందదాయకమైన విషయం అని కొనియాడారు. దేశ ప్రజల గురించి ఆలోచించే ఇటువంటి గొప్ప నాయకుని దేవుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం డైరెక్టర్ నల్లమిల్లి అప్పారెడ్డి, నరాల రాంబాబు, శ్రీనివాస్ రెడ్డి, పిల్లి సత్యనారాయణ, ముత్యాల వీర్రాజు చౌదరి, అంగర జనార్ధనాచార్యులు, కరుటూరి శ్రీనివాస్, జనసేన గ్రామ అధ్యక్షులు ఇమ్మిడిశెట్టి శివ, బిజెపి బూత్ కమిటీ సభ్యులు మండ రాము, కర్రి వెంకటరెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**-ముప్వా శ్రీనివాస్, దొంతు మంగేశ్వరరావు**




**ఎటపాక విశ్వం వాయిస్ న్యూస్:** ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి ముప్వా శ్రీనివాస్, ఎటపాక వైస్ యం పి పి దొంతు మంగేశ్వ రరావు అన్నారు. గురువారం అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎటపాక మండల కేంద్రంలో గల యం పి డి ఓ మీటింగ్ హాల్ నందు పోషణ మాసం అనే కార్యక్రమాన్ని ఎటపాక చిల్డ్రన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ( సిడిపిఓ )పి అరుణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ముందుగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు చేయడం జరిగింది., అంగన్వాడీ కార్యకర్తలు తయారు చేసిన పిండి పదార్థాలను, కూరగాయలు ప్రదర్శించడం జరిగింది.అనంతరం జంకు పూడ్ తినడం వల్లనా కలిగే ఆరోగ్య సమస్యల గురించి నాటకం అంగన్వాడీ కార్యకర్తలు నాటక ప్రదర్శన చేయడం జరిగింది.పోషణ మాసం కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి ముప్వా శ్రీనివాస్, వైస్ యం పి పి దొంతు మంగేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు పాటి చలపతి రావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మారసు గంగాధరరావు,ఎటపాక తహసీల్దార్ కారం సుబ్బారావు,ఎటపాక యం పి డి ఓ ఇ ప్రేమ సాగర్,యం ఇ ఓ సరియం రాజులు, వెలుగు ఏ పి ఎం రావి భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ ద్వారా అందించే పోషకహారని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణీ స్త్రీ లు గర్భం దాల్చిన నాటి నుంచి పిల్లలకు 6సంవత్సరాల వయస్సు వచ్చే వరకు అంగన్వాడీ కార్యకర్తలది కీలక పాత్ర అని,గర్భిణీ స్త్రీ లు ప్రతి ఒక్కరు ఇళ్లలో పెంచే కూరగాయలు,ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యలు తీసుకోవాలి అని వారు తెలిపారు.ఈ కార్యక్రమం లో అంగన్వాడీ సూపర్వైజర్ పావని, రాధ, అంగన్వాడీ కార్యకర్తలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఐటీడీపీ ఛాంపియన్ జన్మదిన వేడుకలు



**ఎటపాక విశ్వం వాయిస్ న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం ఎటపాక గ్రామంలో ఎటపాక మండల ఐటీడీపీ చాంపియన్ బాచినేని శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాటి చలపతిరావు, జిల్లా తెలుగు యువత నాయకులు నలజల శ్రీకాంత్ ,పాటి సంపత్, క్లస్టర్ ఇంచార్జ్ వల్లభనేని చందు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గడేసుల. రంజిత్, యూనిట్ ఇంచార్జ్ పాలడుగు నవీన్ తదితరులు పాల్గొన్నారు

## బృహన్నలూ... మీ జీవన శైలిని మార్చుకోండి ...!



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్** బృహన్నలూ ... మీ మీ ప్రత్యేక జీవన శైలిని మార్చుకోండి. జాతీయ రహదార్లపై వ్యభిచరించడం నిషేధం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డం, వివాహాలు ఇతర శుభకార్యాల్లో బలవంతపు వసూళ్లకు పాల్పడ్డం నేరం. ఈ విధమైన నేరాలకు, అనైతిక కార్యకలాపాలకు వ్యతిరేకంగా చట్టబద్ధమైన శిక్షలు అమలులో ఉన్నాయి. అందుకే మీరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా సాధారణ జనజీవన స్రవంతి మాదిరిగానే మీ జీవనాన్ని కొనసాగించండని బృహన్నలకు ఎస్సై జి.శ్రీహరిబాబు హితోపదేశం చేసారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో సంచరిస్తూ వారిదైన దైనందిన ప్రత్యేక జీవన శైలిలో జీవిస్తోన్న బృహన్నలు అందరినీ అన్నవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ప్రత్యేకంగా సమావేశ పరిచి వారికి ఎస్సై శ్రీహరిబాబు మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుత సమాజంలో మీరొక ప్రత్యేక తరగతి / వర్గంగా కాకుండా అందరి పౌరులు మాదిరిగానే మీరు కూడా సగౌరవంగా జీవించాలని, అందుకు ప్రత్యామ్నాయ ఉద్యోగ, జీవనోపాధి అవకాశాలను అందిపుచ్చు కోవాలని, అందుకు ప్రభుత్వం తరఫున సహాయం అందిస్తామని ఎస్సై హితవు పలికారు.

దారి దోపిడీలు, దొంగతనాలు, వ్యభిచారం నేరాల్లో బృహన్నలు కూడా పాల్గొన్న కొన్ని ఘటనలు గతంలో అనేకం ఉన్నాయని, అటువంటి సంఘటనలు ఇకపై జరిగితే అందుకు బాధ్యులైన వారిపై చట్టం విధిగా కఠినమైన చర్యలను తీసుకుంటుందని ఎస్ఐ. హెచ్చరించారు. అన్నవరం పోలీసు స్టేషన్ పరిధిలోని బృహన్నల గణన, సామాజిక పరిస్థితులపై ఇప్పటికే పలు వివరాలను పోలీసు శాఖ సేకరించిందని, వారి కదలికలపై నిఘా ఉంచిందని ముందస్తుగా ఎస్ఐ హెచ్చరించారు. ఎప్పటికప్పుడు సంఘ వ్యతిరేక శక్తులు, అనైతిక కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి దృష్టి సారించాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు తాము ఈ సమావేశాన్ని నిర్వహించాం అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్తిపాడు సిఐ సూర్య అప్పారావు పర్యవేక్షించారు.

## బేటి బచావో- బేటి పడావోపై అవగాహన




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గంలోని మండల కేంద్రం శంఖవరంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో బేటి బచావో- బేటి పడావో అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పధకం సంచాలకురాలు సి.హెచ్. లక్ష్మి ఆదేశాల మేరకు శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ. పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహనా కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ జాగరపు విజయ విద్యార్థినిలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ బాలల హక్కులు, బాలికలు వారు జీవించే, రక్షణ పొందే, అభివృద్ధి చెందే, పాల్గొనే హక్కుల గురించి వివరించారు. లైంగిక వేధింపులు, మంచి, చెడు స్పర్శలు, బాలల చట్టాలను గురించి తెలిపి అత్యవసర పరిస్థితుల్లో బాలల హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ కాల్ చేయాలని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 పని తీరు గురించి వివరించారు. ఈ నెంబర్ కు సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలిపారు. అదేవిధంగా యువతికి18, యువకునికి 21 సంవత్సరాల వయస్సు నిండకుండా వివాహ చేసినట్లు అయితే బాల్య వివాహం నిర్మూలన చట్టం ప్రకారం 2 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 1,000,00 ల జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.బాలా మణి కుమారి మాట్లాడుతూ విద్యార్థులందరూ బాలల హక్కులు, చట్టాల పైన పూర్తి అవగాహన ఏర్పరచుకొని వారి జీవితంలో మంచి వృత్తి, ఉద్యోగ, వ్యాపార, జీవనోపాధి రంగాల్లో స్థిరపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యదర్శి డి.భవిత, పాఠశాల ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

# టీడీపీకి మరో గవర్నర్ పదవి

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీకి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మరో బిగ్ ఆఫర్ ఇచ్చినట్లు తెలిసింది. కూటమి గా ఏర్పడిన గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఎన్నికల్లో సూపర్ సక్సెస్ సాధించిన తర్వాత టీడీపీకి బీజేపీ వరస ఆఫర్లు ఇస్తుంది. అందులో భాగంగా కేంద్రంలో రెండు ముఖ్యమైన మంత్రి పదవులు ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన అన్ని రకాలుగా ఆర్థిక సాయం అందిస్తుంది. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులకు వెనువెంటనే గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. అప్పులు చేయడానికి అవసరమైన అనుమతులను కూడా వేగంగా ఇస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడానికి చేయూతగా కేంద్ర ప్రభుత్వం నిలుస్తుంది.దీంతో పాటు తాజాగా మరొక కీలమైన కబురు కేంద్ర బీజేపీ నుంచి వచ్చినట్లు తెలిసింది. విశాఖలో యోగాడే అద్భుతంగా నిర్వహించిన చంద్రబాబుకు ప్రధాని మోదీ గిఫ్ట్ ల మీద గిఫ్ట్ లు ఇస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందులో భాగంగానే ఇప్పటికే ఏపీకి రెండు గవర్నర్ పదవులు ఇచ్చాయి. ఒకటి బీజేపీకి చెందిన హరిబాబుకు గవర్నర్ పదవి లభించగా, మరొకటి టీడీపీకి చెందిన అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవి దక్కింది. సీనియర్ నేతగా ఉన్న అశోక్ గజపతి రాజు గోవా గవర్నర్ గా బాధ్యతలను స్వీకరించారు. ఇప్పుడు టీడీపీకి మరొక గవర్నర్ పదవి ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖం వ్యక్తం చేసిందన్న సమాచారం అందడంతో ఎవరిని ఎంపిక చేస్తారన్న దానిపై పార్టీలో చర్చ జరుగుతుంది. చాలా మంది సీనియర్లు... టీడీపీలో చాలా మంది సీనియర్లకు గత ఎన్నికల్లో టిక్కెట్లు లభించలేదు.కొందరు టీడీపీ సీనియర్లు పార్టీలో తొలి నుంచి సేవలు అందించారు. వయసు పెరిగి పోవడంతో వారి సేవలను పార్టీకి కాని, మరొక రూపంలో కానీ వినియోగించుకోవాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు యోచిస్తున్నారు. అందులో యనమల రామకృష్ణుడు పేరు వినిపించినప్పటికీ దాని విషయంలో కొన్ని ఇబ్బందులున్నాయి. యనమల కుటుంబానికి ఇప్పటికే చాలా పదవులు ఇచ్చారు. అదే సమయంలో యనమల తనకు రాజ్యసభ పదవి కావాలని కోరుతున్నారు. అందుకే రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకున్న కేఈ కృష్ణమూర్తి పేరును చంద్రబాబు నాయుడు పరిశీలిస్తున్నట్లు సమాచారం. గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన క్షత్రియ సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో, రాయలసీమకు చెందిన బీసీ నేత కృష్ణమూర్తిని గవర్నర్ గా పంపాలని చంద్రబాబు దాదాపు డిసైడ్ అయినట్లు చెబుతున్నారు. మరి నిర్ణయం ఎలా ఉంటుందో?

## "లావా ఎడ్యుకేషనల్ లిమిటెడ్"లో ఉచిత వైద్య శిబిరం




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ మధురానగర్ "లావా ఎడ్యుకేషనల్ కన్సల్టింగ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్"లోని వైద్య విద్యార్థినిలకు డా. కొల్లి క్రాంతి కుమార్ పర్యవేక్షణలో గురువారం ఉచిత వైద్యశిబరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారులను ఉద్దేశించి డాక్టర్ క్రాతికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ బలమైన ఆహారం తీసుకోవడంతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల సరియైన అవగాహన ఏర్పరచుకుని జాగ్రత్తగా ఉంటూ వ్యాధుల పట్ల అశ్రద్ధ చేయకూడదని సూచించారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకుని సకాలంలో సరైన ముందులను వాడాలని సూచించారు. అనంతరం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, చర్మం వ్యాధులు, రక్త హీనత, చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు సంబంధించి 100 మంది వైద్య విద్యారినిలకు ఉచిత వైద్య పరీక్షలను చేసారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లావా ఎడ్యుకేషనల్ కన్సల్టింగ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ – దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన కాకినాడ కేంద్రం ఇన్చార్జి ఆర్.సాయిబాబు, ఎం.ఐ.ఎస్. కోఆర్డినేటర్ జి.మురళీకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## లండన్ ను చుట్టేస్తున్న లోకేష్

**విజయవాడ :** ఏపీకి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు మంత్రి నారా లోకేష్ గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన తరచూ విదేశాల్లో పర్యటిస్తూ దిగ్గజ పారిశ్రామికవేత్తలను కలుస్తున్నారు. ఇలా కలిసే క్రమంలో చాలామంది పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా నారా లోకేష్ లండన్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో పెట్టుబడి పెట్టబోయే పారిశ్రామికవేత్తలతో సమావేశం అవుతున్నారు. కేవలం పెట్టుబడులను ఆకర్షించేందుకు మాత్రమే నారా లోకేష్ లండన్ పర్యటన కొనసాగుతోంది. మరోవైపు తన పర్యటన విజయవంతంగా జరుగుతున్నట్టు నారా లోకేష్ స్వయంగా తన ట్విట్టర్ ఖాతా ద్వారా తెలిపారు. లోకేష్ పర్యటన ఆంధ్రప్రదేశ్లో కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.విశాఖ సమ్మిట్ కు ప్రచారంగా.. విశాఖలో త్వరలో ఏపీ ప్రభుత్వం పార్టనర్షిప్ సమ్మిట్–2025 నిర్వహిస్తోంది. నవంబర్ 14, 15 తేదీల్లో జరగనున్న ఈ సమ్మిట్ కు సంబంధించి లండన్ లో లోకేష్ భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సమ్మిట్ ను భారత ప్రభుత్వ డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్, ఏపీ ప్రభుత్వం, కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. లండన్ లో పెట్టుబడుదారులను ఆకర్షించేందుకుగాను సుమారు 150 మంది పెట్టుబడిదారులతో ఈ రోడ్ షో కొనసాగనుంది. ముఖ్యంగా లోకేష్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎడ్యుకేషన్, ఫిన్ టెక్, ఫార్మా, హెల్త్ కేర్, డీప్ టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెడ్ టక్ వంటి రంగాలపై దృష్టి పెట్టారు. ఈ రంగాలలో ఏపీలో ఉన్న అవకాశాలను వివరించే ప్రయత్నం చేశారు.లోకేష్ లండన్ పర్యటన విజయవంతంగా జరుగుతోంది. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని ఆయన వివరించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా చంద్రబాబు విజన్, డిజిటల్ గవర్నెన్స్, ఈస్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి విధానాలను అక్కడి పారిశ్రామికవేత్తలకు వివరిస్తున్నారు.

## వైసీపీ ఓటర్లపై కమలం గురి

**కాకినాడ :** ఇదే సరైన సమయం. వైసీపీతో మనకు ఎలాంటి చీకటి ఒప్పందం లేదు. అంతర్గత దోస్తీ అంతకంటే లేదు. ఈ విషయం ఏపీ ప్రజలకు క్లారిటీ ఇవ్వాలి. ఏపీలో కాషాయం బలపడాలంటే ఫ్యాన్ పార్టీ ఓటు బ్యాంకు మనకు టర్న్ కావాల్సిందే. వైసీపీ ఓటర్లు బీజేపీ వైపు మళ్లాలంటే ఆ పార్టీపై సాఫ్ట్ కార్నర్ ఉంటే కుదరదు. వైసీపీకి ఇచ్చి పడేస్తేనే ఏపీ పొలిటికల్ పిచ్లో సెట్ అయిపోవచ్చు.ఇప్పుడిదే ప్లాన్తో ఉందట బీజేపీ. మొన్నటి దాక పొత్తులు..మద్దతు అంటూ ఊగిసలాడిన కమలనాథులు నవ్యాంధ్రలో బలపడడానికి ఇదే సరైన టైమ్ అని భావిస్తున్నారట. వైసీపీ అపోజిషన్లో ఉన్నప్పుడే ఆ పార్టీని మరింత వీక్ చేస్తే..టీడీపీకి షిఫ్ట్ కాని వైసీపీ ఓటర్లంతా తమకు వైపు మళ్లుతారని లెక్కలు వేసుకుంటున్నారట. ఈ పొలిటికల్ గేమ్తోనే ఏపీ సెంట్రిక్గా పెద్ద గేమ్ స్టార్ట్ చేసిందట బీజేపీ.వైసీపీని బీజేపీ రాజకీయంగా దూరంగానే పెడుతోంది. 2024 ఎన్నికల వేళ కూడా గుంటూరులో జరిగిన సభలో మోదీ వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి ప్రభుత్వం అని నాడు బీజేపీ పెద్దలు అన్నారు. అదే నిజమని ఇప్పుడు మరోసారి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విశాఖ వేదికగా వైసీపీ మీద తీవ్ర వ్యాఖ్యలే చేశారు. ఈ సారి ఇంకాస్త డోస్ పెంచారనే చెప్పొచ్చు. 2024 ఎన్నికల్లో ఏపీలో అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపారని..వైసీపీది అసమర్థ అస్తవ్యస్తమైన పాలన అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.మోదీ, అమిత్షాతో సహా బీజేపీ అగ్రనేతలెవరూ ఇప్పటివరకు ఈ స్థాయిలో వైసీపీని టార్గెట్ చేయలేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడి హోదాలో నడ్డా చేసిన కామెంట్స్ ఇప్పుడు కమలం క్యాడర్లో జోష్ను నింపుతున్నాయి. వైసీపీని ఒక డెత్ ట్రాప్గా అభివర్ణించారు నడ్డా.కూటమిగానే ఉంది. కేంద్రంలో టీడీపీ, జనసేన ఎంపీల మద్దతుతోనే అధికారంలో కొనసాగుతోంది బీజేపీ. అయితే ఏపీలో ఒంటరిగా బలపడి డిసైడింగ్ ఫ్యాక్టర్గా ఉండాలని..అవసరమైతే సొంతంగా అధికారంలోకి వచ్చేంత స్ట్రాంగ్ కావాలని కలలు కంటోంది కమలం పార్టీ. ఇప్పుడు తమ బలం పెంచుకోవడానికి..కూటమిగానే ఉంటామంటోంది.అలా అని రాజకీయ వ్యూహాల విషయంలో ఏ మాత్రం తగ్గడం లేదు. కూటమిని డిస్టర్బ్ చేయకుండా..సొంతంగా బలపడాలంటే వైసీపీని టార్గెట్ చేయడం తప్ప మరో మార్గం లేదని డిసైడ్ అయిపోయింది కమలం పార్టీ. వైసీపీకి 40 శాతం ఓటింగ్ ఉంది. ఆ పార్టీ ఓటు బ్యాంకును తమవైపునకు తిప్పుకునే స్కెచ్ వేస్తోంది బీజేపీ. అందుకు అనుగుణంగా గతంలో ఏ బీజేపీ జాతీయ నాయకుడు చేయని విధంగా జేపీ నడ్డా వైసీపీని టార్గెట్ చేశారు. ఏకంగా వైసీపీని ఎమ్మెల్సీనే చేర్చుకుని..గత వైసీపీ పాలనపై నడ్డా సహా నేతలంతా తీవ్ర విమర్శలు చేయటం హాట్ టాపిక్గా మారింది.ఆ 40 శాతం పొలిటికల్ వాక్యూమ్ మీదే కమలనాథులు ఫోకస్ పెట్టినట్లు క్లియర్ కట్గా అర్థమవుతోంది. వైసీపీ విషయంలో సాఫ్ట్ కార్నర్తో ఉన్నా.. విమర్శలు చేయకుండా ఉన్నా తమకే నష్టమని భావిస్తున్నారట బీజేపీ నేతలు. భవిష్యత్లో వైసీపీ బలపడటం, తిరిగి అధికారంలోకి రావడమన్న సంగతి తర్వాత..ఇప్పుడు ఏపీలో మనం బలపడాలి. అంతకంటే ముందు ఏపీ ప్రజలు మనల్ని నమ్మాలని పెద్ద వ్యూహమే రచిస్తున్నారట. ఇక నుంచి మీటింగ్ ఏదైనా..విషయం మరేదైనా వైసీపీ టార్గెట్గా అటాక్ మొదలు పెట్టకపోతే పొలిటికల్గా పికప్ అవడం కష్టమని లెక్కలు వేసుకుంటున్నారట.కూటమిలోనే ఉన్నా.. జగన్తో బీజేపీ అగ్రనేతలకు సన్నిహిత సంబంధాలున్నాయని ఇన్సైడ్ టాక్ నడుస్తుంటుంది. జగన్ మీద




# అసెంబ్లీలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై గళమెత్తాలి

- ప్రజాప్రతినిధులకు బొజ్జ రామకృష్ణ వినతి
- సంక్షేమ బోర్డును పునరుద్దరించాలి
- లేకుంటే కార్మికుల ధర్మపోరాటదీక్ష




**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చర్చించాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల సమైఖ్య అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.కార్మికులకు ఉపయోగపడే విధంగా కార్మికశాఖను తీర్చిదిద్దాలని ఆయన డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ఉందా తీసివేశారా అని ఆయన ప్రశ్నించారు.భవన నిర్మాణ కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో త్వరలో రాజమహేంద్రవరం, చుట్టు పక్కల వివిధ అసోసియేషన్ వివిధ ట్రేడ్ యూనియన్లు అందరితో మమేకమవుతూ మనకి ఏదైతే కార్మికుల హక్కులు ఉన్నాయో దీన్ని ప్రభుత్వం ద్వారా సాధించుటకు గాను మనం అందరం రోడ్లపైకి వచ్చి పోరాటం చేయడానికి అన్ని యూనియన్లను కలుపుకొని ఉద్యమిస్తామని ఆయన చెప్పారు. కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ప్రభుత్వాలు మొండి వైఖరి అవలంబిస్తున్న కారణంగా ఇబ్బందులు కలుగుతున్నాయని బొజ్జ రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. మనం బిల్డింగులు ఎక్కడైతే నిర్మిస్తున్నామో దాని నిమిత్తం మన పేరు చెప్పి సెస్ రూపంలో వసూలు చేస్తూ దానిని ఇతర సంక్షేమానికి ఉపయోగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. దీనివలన కార్మికుడు ప్రభుత్వం నుండి ఏ విధమైన బెనిఫిట్ పొందని పరిస్థితిలో ఉన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క కార్మిక శాఖ డిపార్ట్మెంట్ వారు కార్మికులందరికీ కూడా భవన నిర్మాణ కార్డు ఉండాలని, రెన్యువల్ చేయించుకోండని చెబుతూ వారి టార్గెట్లను పెంచుకుంటూ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారు తప్ప కార్మిక శాఖ వల్ల కార్మికులకు ఎటువంటి ఉపయోగం లేదని బొజ్జ రామకృష్ణ విమర్శించారు. ఉదాహరణకి ఈశ్రం అనే కార్డు బిజెపి పరిపాలించే రాష్ట్రాల్లో మాత్రమే పనిచేస్తున్నదని ఆంధ్రప్రదేశ్లో 2022 నాటికి పూర్తిగా మూతబడిందని ఆయన తెలిపారు.అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా వంద రోజులలో భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని, గత ప్రభుత్వం చేసిన తప్పులను తాము చేయబోమని చెప్పి కార్మికుల కుటుంబాల తో ఓట్లు వేయించుకున్న మహానేత ఈ రోజున కార్మికులకు ఏ విధంగా కూడా ఉపయోగపడలేని పరిస్థితి ఉన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డు ఉన్నదా తీసి వేసినారా అనే సందేహం కలుగుతున్నదని అన్నారు. ఇప్పటికైనా అసెంబ్లీ జరుగుతున్న శుభ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, మంత్రులు అందరూ కూడా కార్మిక శాఖకు సంబంధించి,కార్మిక సంక్షేమ ఫలాలు గురించి ప్రతి ఒక్కరు తమ గొంతు వినిపించాలని ఈ సందర్భంగా బొజ్జ రామకృష్ణ కోరారు. లేకుంటే అతి త్వరలో ధర్మ పోరాటం దీక్ష చేయడానికి తీర్మానం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆసపు శ్రీనివాస్( బుజ్జి ),విశ్వకర్మ వడ్రంగి పని వారల సంఘం ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ దేవత శ్రీనివాస్ రాజమహేంద్రవరం ప్లంబర్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ కొండపల్లి నాగేశ్వరావు,రాజరాజ నరేంద్ర పెయింటర్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ కూరపాటి రాజన్న, విగ్నేశ్వర బోర్డు సెంట్రింగ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, తాపీ పనివాళ్ల సంఘం ప్రెసిడెంట్ నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కార్మికులు పాల్గొన్నారు.

# 1800వ రోజుకు స్వర్ణాంధ్ర ఉచిత నిత్యాన్నదాన సేవలు

స్వర్ణాంధ్ర రాంబాబుకు నగరవాసులు మరింత సహకరించాలి

నిత్యఅన్నదాన సేవలతో రాజమండ్రి పేరు ప్రతిష్టలు పెరిగాయి

తూర్పుగోదావరి జిల్లా అదనపు ఎస్పీ మురళీకృష్ణ ప్రశంస



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న ఉచిత నిత్యాన్నదాన సేవలో 1800వ రోజుకు చేరాయి.. ఉద్యోగాన్ని తన జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేసిన స్వర్ణాంధ్ర రాంబాబుకు నగర వాసులందరూ మరింతగా ప్రోత్సాహం అందించాలని అదనపు ఎస్పీ ఎన్బీఎం మురళీకృష్ణ కోరారు.ఈ సందర్భంగా గురువారం ఉదయం స్థానిక పుష్కర్ ఘాట్ వద్ద జరిగిన అన్న దాన కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అదనపు ఎస్పీ ఎన్బిఎం మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై స్వయంగా భోజనాలు వడ్డించారు.ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడు తూ అన్నార్తుల వద్దకే అన్నదానం అనే స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా రాజమండ్రి నగరంలోని అవసరార్థులు నిరాశ్రయులతో పాటు ముఖ్యంగా రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులు వారి బంధువులకు ఎంతగానో ఉపయోగపడు తుందని మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. గత 30 సంవత్సరాలుగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ సేవా కార్యక్రమాల్లో అనేకసార్లు పాల్గొన్నానని స్వర్ణాంధ్ర లాంటి స్వచ్ఛంద సంస్థలు జిల్లాకి ఒకటి ఉంటే అనేక సేవలు అవసరార్థులకు అందుతాయి అన్న అభిప్రాయాన్ని మురళీకృష్ణ వ్యక్తం చేశారు .స్వర్ణాంధ్ర రాం బాబు చేస్తున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలు సమాజానికి ఉపయోగకరంగా ఉంటాయని ఇందుకు సహకరిస్తున్న దాతలను స్వర్ణాంధ్ర సభ్యులను అదనపు ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.ఈ సందర్భంగా తొలుత మురళీకృష్ణను దుస్సాలువతో సత్కరించి స్వర్ణాంధ్ర జ్ఞాపికను రాంబాబు బహుకరించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర రాంబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఉచిత నిత్యాన్నదాన పథకానికి సహకరిస్తున్న నగర ప్రజలకు అధికార అనధికార ప్రముఖులకు రాజకీయ నాయకులకు ముఖ్యంగా స్వర్ణాంధ్ర సభ్యులకు స్వచ్ఛంద సేవకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు . కోవిడ్ తదనంతరం ప్రారంభించిన ఉచిత నిత్యాన్నదాన సేవలో 1800 రోజులలో సుమారు 9 లక్షల మందికి భోజనాలు అందించినట్లు తెలిపారు ప్రతిరోజు నగరానికి వివిధ పనులు దర్శనాలకు రోజు కూలీ కోసం వచ్చే వారికి ఆసుపత్రి కోసం వచ్చే వారికి ఈ భోజనం ఎంతగానో ఉపయోగపడుతుందని రాంబాబు తెలిపారు .ఈ కార్యక్రమం లో గంగరాజు పాల డైరీ నిర్వాహకులు తెలుగుదేశం పార్టీ నాయకులు నిమ్మలపూడి గోవిందు స్వర్ణాంధ్ర వ్యవస్థాపకులు రావులపాలెం రామిరెడ్డి జమాలజిస్ట్ నాగభూషణం హెల్పింగ్ హాండ్స్ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ అనుప్ జైన్,యూసఫ్ అమీర్ దువ్వాడ రాజా,అన్సర్ అహమ్మద్,మీరా కుమారి, జహంగీర్ బెన్నీ ,కలీం హరికృష్ణ,జాయేద్ , అల్లావుద్దీన్,ఇమ్రాన్ షరీఫ్ ఆనంద్ ,దివ్య,సింధు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చెయ్యాలి

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలి

ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలి.

ఐటీడీఏ ద్వారా ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలి.

ఏపీ ఆదివాసీ జేఏసీ,భారత్ ఆదివాసీ పార్టీ డిమాండ్



**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్:** ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్,భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర ఉప అధ్యక్షులు ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ ఏ.పీ సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఆదివాసీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని, షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన 5వ,షెడ్యూల్డ్ భూ భాగంలో ఉన్న ఆదివాసీల హక్కులు చట్టాలు, ఉద్యోగ,ఉపాధి, అభివృద్ధి, సంక్షేమం పటిష్టంగా అమలు చేయాలని, 2025 మెగా డీఎస్సీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయటంతో షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వాస్తవానికి షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉపాధ్యాయ నియామకాల ఆదివాసీ పట్టా భద్రులతోనే భర్తీ చేయాలని,షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని, ఐటీడీఏ ద్వారా ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని,వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలతో వంద శాతం భర్తీ చేయాలని, ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని,షెడ్యూల్డ్ ప్రాంత హక్కులు,చట్టాలు పటిష్టంగా అమలు చేయకుండ ఉల్లంఘించిన ప్రభుత్వాలకు ఆదివాసీ లందరూ భవిష్యత్ లో ఓటు బ్యాంక్ తో తగిన గుణపాఠం చెబుతారన్నారు హెచ్చరించారు.

# పెద్దవం, ఐపంగిడీ గ్రామాల్లో కలెక్టర్ కీర్తి చేకూరి పర్యటన




వ్యాధి నిర్ధారణకు ప్రత్యేక నిపుణుల బృందం ద్వారా శాంపిల్స్ సేకరణ

వ్యాధిపై ఆందోళన అవసరం లేదు

రైతులకు కలెక్టర్ కీర్తి చేకూరి భరోసా

**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో పశువుల చికిత్స కొనసాగింపు జరుగుతోందని , ఇందు కోసం ప్రత్యేక వైద్యుల బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం సాయంత్రం కొవ్వూరు నియోజక వర్గం పరిధిలోనీ పెద్దేవం, ఐ.పంగిడీ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి రైతులతో ముఖాముఖి సంభాషించి, వారికి భరోసా ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, గేదెల వ్యాధి నివారణ కు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పశువుల పేడ పరీక్షల్లో %దీ. ఒశీశ్రీఱ% మరియు పొట్ట జలగ వ్యాధి నిర్ధారణ అయ్యిందన్నారు.

గేదెలకు చికిత్స చేయడం కొనసాగుతోందనీ, ఇప్పటికే కొంతమేరకు సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయని , వ్యాధి లక్షణాలు తగ్గడం గుర్తించినట్లు వైద్యులు తెలియ చేయడం జరిగిందనీ కలెక్టర్ రైతులకి వివరించారు. ఈ సందర్భంగా గేదెలలో కనిపించిన వ్యాధి లక్షణాలకు సంబంధించిన చికిత్స జరుగుతుందని, మరిన్ని ల్యాబ్ పరీక్షల కోసం నమూనాలు సేకరించబడినట్లు , రెండు మూడు రోజులలో వాటి వివరాలు వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. విజయవాడ పశువైద్య జీవవిజ్ఞాన పరిశోధన సంస్థ (వి బి ఆర్ ఐ) ప్రత్యేక నిపుణుల బృందం పర్యవేక్షణలో పశువులపై చికిత్స వ్యాధి తీవ్రత తదితర అంశాలపై కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సమీక్షించడం జరిగింది. బుధవారం పెద్దవం గ్రామంలో మృతి చెందిన గేదె కు విజయవాడ నుండి వచ్చిన జాయింట్ డైరెక్టర్ డా.చంద్రమౌళి ఆధ్వర్యంలో శవ పరీక్షలు చేపట్టడం జరిగిందనీ, వాటికి సంబంధించిన నమూనాలు తదుపరి పరీక్షలు నిమిత్తం విజయవాడ పంపుతున్నట్లు తెలిపారు.

పర్యటన నేపథ్యంలో తాళ్లపూడి మండలం పెద్దవం గ్రామానికి చెందిన రైతు జె. సత్యనారాయణ, కొవ్వూరు మండలం ఐ.పంగిడీకి చెందిన రైతు జె. కృష్ణార్జున లతో కలెక్టర్ ముఖాముఖి జరిపారు. గత పది రోజులకు ఇప్పటికీ వ్యాధి లక్షణాలు తగ్గుతున్నట్లు రైతులు వివరించారు. వ్యాధి నిర్ధారణ కోసం సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌లో పూర్తిగా పరీక్షించడం జరుగుతుందన్నారు. ఎటువంటి కొత్త కేసులు నమోదు కాలేదని అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ పర్యటనలో ఆర్డీవో రాణి సుస్మిత, విజయవాడ వి.బి.ఆర్.ఐ. కేంద్రం జాయింట్ డైరెక్టర్ డా. చంద్రమౌళి, సహాయ సంచాలకులు డా. శిరీష, జిల్లా పశుసంవర్ధక అధికారి డా. టి. శ్రీనివాస్, డీడీ సత్యనారాయణ, ఏ.డి. వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటిలో దోమల లార్వాలు.

విశ్వం వాయస్ వార్తకు స్పందన.

ఓవర్ హెడ్ ట్యాంకులు క్లీనింగ్.

త్రాగునీటికి పరీక్షలు.



**కోరుకొండ విశ్వం వాయస్ న్యూస్:** కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో ఓవర్ హెడ్ ట్యాంకులు క్లీన్ చేయకపో వడం బ్లీచింగ్ జల్లించకపోవడంతో ప్రజలకు అంది స్తున్న త్రాగునీటిలో దోమల లార్వాలు ప్రజారోగ్యాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గురువారం ఈ వార్తకు స్పందించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోరుకొం డ, పశ్చిమ గోనగుడెం తదితరు గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఓవర్ హెడ్ ట్యాంకులు క్లీనింగ్, పలు ప్రదేశాల్లో బ్లీచింగ్ జల్లించడం వంటి పనులు పూనుకున్నారు. అదేవిధంగా పశ్చిమ గోనగూడెంలో పైప్ లైన్ లీకేజీలకు మరమ్మతులు చేశారు. ఇటీవల అకాల వర్షాల కారణంగా పలు గ్రామాల్లో వర్షపు నీటితో పాటు మురికి నీరు చేరి దోమలకు, పందులకు నిలయాలుగా మారాయి. అదేవిధంగా సచివాలయ సిబ్బంది ఎబెట్ ఫాగింగ్ చేసి, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని అంటున్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టిన మండల స్థాయి అధికారులకు, సచివాల సిబ్బందికి పలువురు ప్రజా ప్రతినిధులు, పలు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణకు నిరసనగా మహా ధర్నా

- హాజరైన ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ,రాజకీయ పార్టీల నాయకులు
- సంఘీభావం తెలిపిన డి జి పి వే రాష్ట్ర అధ్యక్షులు అల్లుజయరాజ్




**విజయవాడ,విశ్వం వాయిస్ న్యూస్:** విజయవాడ ధర్నాచౌక్ వద్ద జై భీమ్ రావ్ భారత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్ కుమార్ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ చెప్పట్టిన మహాధర్నాకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ మరియు అనేక రాజకీయ పార్టీల వారు ఉద్యమ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అగ్రవర్ణ పేదలకు రాజ్యాంగ పరంగా వచ్చిన రిజర్వేషన్లు తీసివేయలనే కూటమి ప్రభుత్వ కుట్రను,బడుగు బలహీన వర్గాల పై జరుగుతున్న దాడులు అన్యాయాలపై విద్యార్థుల కు వైద్య విద్యను దూరం చేయాలనే కూటమి కుతంత్రాలను తిప్ప కొట్టాలని ధ్యేయంతో మహాధర్నాకు పిలుపు నీవ్వడం జరిగింది.ఈ కార్యక్రమానికి సంఘీ భావంగా దళిత గిరిజన ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు అల్లు జయరాజ్,జై భీమ్ రావు, భారత పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇంచార్జ్ వల్లూరు సత్యానందం, ప్రముఖ పాత్రికేయులు దిప్పిడి సుబ్రమణ్యం,బీసీ నాయకులు రెడ్డి రాజేష్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

## మాజీ ఎంపీ భరత్ ఆధ్వర్యంలో 19న ఛలో మెడికల్ కాలేజీ



**రాజమహేంద్రవరం,విశ్వంవాయిస్ న్యూస్:** వైసిపి హయాంలో 17మెడికల్ కాలేజీలు తీసుకు రావడం, వాటిని కూటమి ప్రభుత్వం పిపిపి పేరుతొ ప్రైవేటు పరం చేయాలని చూస్తున్న నేపథ్యం లో మాజీ పార్లమెంట్ సభ్యులు వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో ఛలో మెడికల్ కాలేజీ కార్యక్రమం జరుగుతుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 8 గంటలకు రాజమండ్రి సిటీ క్వారీ మార్కెట్ సెంటర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పార్లమెంట్ భవన్ వద్ద నుండి మెడికల్ కాలేజి వరకు జరిగే శాంతియుత నిరసన ర్యాలీ జరుగుతుంది. కావున ఈ కార్యక్రమంలో నగర వైస్సార్సీపీ నాయకులు, వార్డ్ ఇంచార్జిలు, వార్డ్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్లమెంట్ నియోజవర్గాల ప్రజలు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతూ వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి సిటీ కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

## సినీ పాత్రికేయులు ధీరజ అప్పాజీకి నిమ్మలపూడి గోవింద్ అభినందన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** హైదరాబాద్లో ఉంటున్న ప్రముఖ సినీ పాత్రికేయులు ధీరజ అప్పాజీకి గంగ రాజు డెయిరీ అధినేత నిమ్మలపూడి గోవింద్ దుశ్శాలువ కప్పి అభినందన సత్కారం నిర్వహించారు. గురువారం నగరంలోని టి.నగర్ లో గల గంగరాజు డెయిరీ కి అప్పాజీ వచ్చిన సందర్భం గా గోవింద్ ఆయనకు సాదర స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. గతంలో రాజమండ్రిలో పాత్రికేయునిగా అప్పాజీ తో తనకు ఉన్న అనుబంధాన్ని గోవింద్ ఈ సందర్భంగా గుర్తు చేసుకుని పెదవులపై సంతోషం పండించారు. తీపి ఆహార ప్రియులు ఎంత దూరంలో ఉన్నా గంగరాజు కోవాను స్వయంగా కొనుక్కుని,రుచి చవిచూసి వెళ్లడం వంటి సంఘటనలు గంగరాజు డైరీ అందిస్తున్న పాలు ఆధారిత పదార్థాలకు అందివచ్చిన గొప్ప గౌరవంగా చెప్పుకోవచ్చు.

# భారత్‌కు గుడ్‌న్యూస్.. టారిఫ్‌పై డొనాల్డ్ ట్రంప్ యూటర్న్?!

న్యూఢిల్లీ

భారత్‌పై 50శాతం టారిఫ్ విధింపు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. నవంబర్ 30 తర్వాత భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తువులపై అందుబాటులోకి రానున్న 50శాతం టారిఫ్‌లో 25 శాతం పెనాల్టీ టారిఫ్‌ను రద్దు చేయనున్నట్లు సమాచారం రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తుందని.. ఫలితంగా ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కొనసాగుతోందంటూ భారత్‌పై ట్రంప్ టారిఫ్‌తో పాటు పెనాల్టీ టారిఫ్ 25శాతం విధించారు. ఆ పెనాల్టీ టారిఫ్ విషయంలో భారత్–అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నాయని, ఆ చర్చలు సఫలమై.. పెనాల్టీ టారిఫ్‌ను తొలగించే అవకాశం ఉందంటూ కేంద్ర చీఫ్ ఎకనమిక్స్ అడ్వైజర్ (సీఈఏ)వీ అనంత నాగేశ్వరన్ కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం కోల్‌కతా మర్చంట్స్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎంసీసీఐ)సమావేశంలో వీ. అనంత నాగేశ్వరన్ మాట్లాడారు. మనదేశం నుంచి ఎగుమతయ్యే పలు ఉత్పత్తులపై 25శాతం ప్రతీకార సుంకం చెల్లించడంతో పాటు పెనాల్టీ కింద మరో 25శాతం.. మొత్తంగా 50శాతం టారిఫ్ చెల్లించేందుకు సిద్ధపడ్డాం. కానీ ఇకపై మనకు ఆ అవసరం ఉండదనీ నేను భావిస్తున్నాను. 25 శాతం పెనాల్టీ సుంకానికి భౌగోళిక రాజకీయ పరిస్థితులు కారణం. కానీ గత రెండు వారాలలో జరిగిన పరిణామాలను పరిగణనలోకి తీసుకుంటే నవంబర్ 30 తర్వాత 25శాతం జరిమానా సుంకం ఉండదని నేను నమ్ముతున్నాను. రాబోయే




రెండు నెలల్లో ప్రతీకార సుంకంతో పాటు జరిమానా పరస్పర సుంకాలపై పరిష్కారం లభిస్తోందన్నారు. ఈ వ్యాఖ్యలతో భారత్‌పై టారిఫ్‌ల విషయంలో ట్రంప్ యూటర్న్ తీసుకునే అవకాశం ఉందంటూ ఆర్థిక నిపుణుల అంచనా. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 1977లో రూపొందించిన ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్స్ పవర్ యాక్ట్ (ఐఈఈపీఏ) చట్టాన్ని ప్రస్తావిస్తూ, విదేశీ అత్యవసర పరిస్థితుల సమయంలో ఆర్థిక నియంత్రణలు, శిక్షలు విధించేందుకు ఈ చట్టాన్ని ఉపయోగించారు. ఈ చట్టం ఆధారంగా మనదేశంపై మొదట 25శాతం టారిఫ్‌లు విధించగా, ఇప్పుడు వాటిని 50శాతానికి పెంచారు.

**భారత్, మోదీతో మంచి స్నేహం ఉంది: ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు**

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా భారత్‌పై అదనపు సుంకాలు విధిస్తున్న ట్రంప్ తాజాగా మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బ్రిటన్ పర్యటనలో ఉన్న ఆయన.. భారత్‌తో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. మోదీతోనూ మంచి స్నేహం ఉందన్నారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో ద్వైపాక్షిక సమావేశం అనంతరం మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు.

"భారత్‌తో మంచి సంబంధాలు ఉన్నాయి. ప్రధాని మోదీ నాకు సన్నిహితుడు. ఇటీవలే ఆయనతో మాట్లాడి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశా. మా ఇద్దరి మధ్య చాలా మంచి స్నేహం ఉంది. ఆయన కూడా ఓ అందమైన ప్రకటన చేశారు. అయినప్పటికీ వాళ్లపై ఆంక్షలు విధించా. చైనా ఇప్పుడు భారీ స్థాయిలో అమెరికాకు సుంకాలు చెల్లిస్తోంది. మరిన్ని వేయడానికి సిద్ధంగా ఉన్నా. చమురు కొనుగోలు ఆపివేస్తేనే రష్యా దిగివస్తుంది" అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

**బ్రిటన్ రాజు అతిథిగా ట్రంప్**

**ఆ స్థావరాన్ని స్వాధీనం చేసుకుంటాం..**

అఫ్గానిస్థాన్‌లోని బగ్రామ్ ఎయిర్‌బేస్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవాలని అనుకుంటున్నట్లు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. చైనా అణ్వాయుధ ఉత్పత్తి కేంద్రాల నుంచి కేవలం గంట వ్యవధిలో వెళ్లవచ్చని అన్నారు. మునుపటి అధ్యక్షుడు జో బైడెన్ ఎటువంటి ప్రయోజనం లేకుండా ఆ వైమానిక స్థావరాన్ని విడిచిపెట్టారని ఆరోపించారు. చైనా భవిష్యత్తులో ఈ వైమానిక స్థావరంలో తిష్ట వేసే అవకాశం ఉందని అమెరికా అనుమానిస్తోంది. ఈ క్రమంలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది

లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందంటూ ఘాటైన వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. అంతేకాదు.. అక్రమంగా తొలగించిన ఓటర్ల జాబితాలోని వ్యక్తులను మీడియా ముందుంచారు రాహుల్ గాంధీ. ఇదే అంశంపై గురువారం మీడియాతో మాట్లాడిన రాహుల్.. ఇది కేవలం ఓట్ల జాబితా సమస్య కాదని, లక్షలాది మంది ఓటర్ల హక్కులపై జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. ఎన్నికల ప్రక్రియలో తేడాలు, అక్రమాలు సరిచేయాల్సిన సమయం వచ్చిందని, ఈ చీకటి రాజకీయం గురించి ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు.

**కర్ణాటకలో ఓట్ల తొలగింపు..**

కర్ణాటకలోని ఆలంద్ నియోజకవర్గంలో 6,000 ఓట్లను నకిలీ లాగిన్‌ల ద్వారా తొలగించారు. ఈ ప్రక్రియలో సాఫ్ట్‌వేర్‌ను దుండగులు హైజాక్ చేశారు. నకిలీ అప్లికేషన్‌లు, తప్పుడు ఫోన్ నంబర్లు ఉపయోగించి ఓట్ల తొలగింపునకు అప్పీల్ చేశారని రాహుల్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే అవకాశం ఉన్న బూత్‌లను లక్ష్యంగా చేసుకుని ఈ ఓట్ల తొలగింపు జరిగిందని రాహుల్ గాంధీ అన్నారు. ఈ చర్యలు తమ పార్టీని బలహీనపరచడానికి జరిగాయని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అలాంటి ప్రజాస్వామ్య విధ్వంసకులను రక్షిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు.

**ఓట్ల మోసంపై రాహుల్ గాంధీ ఆధారాలు..**

రాహుల్ గాంధీ కర్ణాటకలో ఓట్ల మోసం జరిగిందని ఆరోపిస్తూ కొన్ని ఆధారాలు చూపించారు. కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్న బూత్‌లలో ఈ మోసం జరిగిందని, గోదాబాయ్ పేరుతో ఫేక్ లాగిన్ ఉపయోగించి 12 ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగిందని ఆయన తెలిపారు. ఓట్ల తొలగింపు కోసం ఆటోమేటెడ్




ప్రోగ్రామ్ ఉపయోగించారని, ప్రతి బూత్‌లో మొదటి ఓటరును దరఖాస్తుదారుగా చూపేలా చేశారని వెల్లడించారు. ఎక్కువ ఓట్లు తొలగించిన టాప్ 10 బూత్‌లన్నీ కాంగ్రెస్ పార్టీ బలమైన ప్రాంతాల్లో ఉన్న చోటనే జరిగాయని రాహుల్ తెలిపారు.

ఫిర్యాదు చేసినా..

మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పెద్దఎత్తున ఓటర్లను లిస్ట్ నుంచి తొలగించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ తొలగింపులు వ్యక్తుల ద్వారా కాకుండా, ఓ సాఫ్ట్‌వేర్ ద్వారా కేంద్రీకృతంగా జరిగిందన్నారు. ప్రతి బూత్‌లో మొదటి పేరును ఆ ఆటోమేటెడ్ ప్రోగ్రాం తీసుకుని తొలగించేలా రూపొందించారని తెలిపారు. అంతేకాకుండా ఈ ప్రక్రియలో రాష్ట్రానికి చెందిన వారు కాకుండా ఇతర ప్రాంతాల ఫోన్లు ఉపయోగించి %హ్యా%లతో అప్లికేషన్లు దాఖలు చేసినట్లు ఆయన ఆరోపించారు. వీటి గురించి కర్ణాటకలో సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఈసీకి తెలిపినా పట్టించుకోలేదన్నారు.

**విడుదల చేయాలి**

ఈ మొత్తం వ్యవహారం చిన్న స్థాయిలో కాకుండా, పెద్ద ఎత్తున జరిగిందని గాంధీ పేర్కొన్నారు. ఈ తొలగింపులపై ఎన్నికల సంఘం స్పందించకపోతే, అది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే వారిని కాపాడుతున్నట్టు అవుతుందని ఆయన హెచ్చరించారు. ఎన్నికల సంఘం ఒక వారంలోపు తీసివేసిన ఓటర్ల వివరాలు, వాటికి ఉపయోగించిన ఫోన్లు, %హ్యా%ల సమాచారం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే, ఇది మరోసారి ఓట్ల చోరీకి నిదర్శనమవుతుందని రాహుల్ గాంధీ అన్నారు.

# రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు నిరాధారం.. అవాస్తవం

న్యూఢిల్లీ: ఓట్ల చోరీ పేరిట కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ చేసిన సంచలన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల స్పందించింది. ఆన్‌లైన్‌లో ఓట్లు ఎవరూ తొలగించలేరని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. అదే సమయంలో మరోవైపు.. బీజేపీ సైతం ఆయన చేసిన ఆరోపణలపై వ్యంగ్యాస్త్రాలు సంధించింది. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు నిరాధారం.. అవాస్తవం. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటునూ తొలగించడం లేదు అని ఈసీ స్పష్టం చేసింది. అదే సమయంలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓట్ల తొలగింపు ప్రయత్నాలను మాత్రం అంగీకరించింది. "ఆ సమయంలో కర్ణాటకలోని ఆలంద్ శాసనసభ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించేందుకు కొన్ని విఫలయత్నాలు జరిగాయి. ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ఎన్నికల సంఘం స్వయంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు జరిపింది" అని పేర్కొంది. మరోవైపు రాహుల్ గాంధీ చేసిన ఓట్ల దొంగతనం.. నకిలీ ఓట్ల చేర్పు ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఆయన బాంబు పేలలేదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ భారత్‌ను బంగ్లాదేశ్, నేపాల్ లాంటి పరిస్థితుల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నారు అని మండిపడ్డారు. "ఎన్నికల నిర్వహణ కోసం ఈసీ



నిష్పక్షపాతంగా పనిచేస్తోంది. కానీ రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తూ.. ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారు. ఆయన నేతృత్వంలో కాంగ్రెస్ సుమారు 90 ఎన్నికల్లో ఓడిపోయింది. ఆ వైరాగ్యంతోనే ఆయన అసత్య ఆరోపణలు చేస్తున్నారు అని ఠాకూర్ విమర్శించారు. హైడ్రోజన్ బాంబ్ పేలుస్తానన్న రాహుల్.. చివరికి పటాకులతోనే సరిపెట్టారు. ఆరోప ణలే ఆయన రాజకీయ ఆభరణంగా మారాయి. కోర్టు లు క్షమాప ణలు కోరడం, మందలించడం ఆయనకు అలవాటై పోయింది అని అనురాగ్ ఠాకూర్ ఎద్దేవా చేశారు.

# నో ఆల్కహాల్ ప్లేజ్!

**నాన్%-%ఆల్కహాల్ వైపు సోషల్ డ్రింకింగ్ కల్చర్**
**మాక్‌టెయిల్స్‌కు మిలీనియల్స్, జెన్-జీ చీర్స్**
**మారుతున్న పట్టణ యువత ఆలోచనా ధోరణి**



అసలే యూత్.. ఆపై ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యత. ఇంకేముంది భారతీయ మిలీనియల్స్ (29%–%44 సంవత్సరాల వయసు), జెన్%–%జీ తరం (13%–%28 ఏళ్లు) ఆల్కహాల్ లేని లేదా తక్కువ ఆల్కహాల్ ఉన్న పానీయాలను ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఈ ధోరణి ముఖ్యంగా మెట్రో నగరాల్లో బాగా కనిపిస్తోంది. సరదాగా గడిపేందుకు ఆల్కహాల్ మాత్రమే పరిష్కారం కాదన్నది యువతరం మాట. సోషల్ డ్రింకింగ్ కల్చర్ భారత్‌లో క్రమంగా మారుతోంది. నీల్సన్‌ఐక్యూ తాజా అధ్యయనం ప్రకారం.. సర్వేలో పాలుపంచుకున్న భారతీయ వినియోగదారుల్లో 24% మంది ఆల్కహాల్ రహిత లేదా తక్కువ ఆల్కహాల్ ప్రత్యామ్నాయాలను ఆస్వాదిస్తున్నారు. ఈ విషయంలో ప్రపంచ సగటు 17% ఉంది. ఆల్కహాల్ రహిత లేదా తక్కువ ఆల్కహాల్ ఉన్న పానీయాలను తీసుకుంటున్నవారిలో సగానికి పైగా జెన్%–%జీ, మిలీనియల్స్ ఉన్నారు. ఫిలిప్పీన్స్ తర్వాత ఆసియా%–%పసిఫిక్ ప్రాంతంలో ఇలాంటి మాక్‌టెయిల్స్‌కు (ఆల్కహాల్ రహిత పానీయాలు) భారత్ రెండో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించింది. మనదేశంలో ఉత్తరాదిలో దాదాపు 54% మంది, తూర్పు భారతంలో 50%, పశ్చిమాన 43%, దక్షిణాన 37% మంది ఆల్కహాల్ పానీయాలను ఇష్టపడుతున్నారని నివేదిక తెలిపింది.

**ట్రెండ్‌గా మారుతోంది**

సాంస్కృతిక, సామాజిక వైఖరుల్లో వస్తున్న మార్పులు దేశంలో మద్యపాన రహిత జీవనశైలికి మార్గం సుగమం చేస్తు న్నాయి. మద్యపానానికి దూరంగా ఉండటం అనేది గతంలో మతపరమైన లేదా ఆరోగ్య కారణాలతో ముడిపడి ఉండేది. ప్రస్తుతం ట్రెండ్‌గా మారుతోంది. ఏం తీసుకుంటు న్నాం, వాటి ప్రభావం ఏమిటో తెలుసుకుని మరీ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. మిలీనియల్స్, నిపుణులు, పట్టణ వినియోగదారుల నుంచి ఆల్కహాల్ రహిత పానీయాలకు డిమాండ్ పెరుగుతోంది. సంప్రదాయ బీర్ అనుభవాన్ని రాజీ పడకుండా మెట్రోలలో ఈ డిమాండ్‌ను తీర్చడానికి కంపెనీలు కూడా నూతన ఆవిష్కరణలు చేస్తున్నాయి.

**జీబ్రా స్ట్రిప్పింగ్ ట్రెండ్**

జెన్–జీ అంటేనే సరికొత్త కోరికలు, ఆవి ష్కరణలకు పెట్టింది పేరు. వారు ఇటీవలి కాలంలో జీబ్రా స్ట్రిప్పింగ్ ట్రెండ్‌ను ఎక్కువ గా అనుసరిస్తున్నారు. అంటే ప్రతి ఆల్కహా లిక్ డ్రింక్ తర్వాత ఆల్కహాల్ రహిత పానీ యాలను తీసుకుంటున్నారు. యూత్ ఎక్కు వగా కాక్‌టెయిల్స్, ప్రీమియం డ్రింక్స్ తాగు తున్నారు. విలువ పరంగా చూస్తే వీటి విలు వ ఎక్కువే కావడం గమనార్హం. అందుకే, కొన్ని కంపెనీలు ఆల్కహాల్ లేని పానీయా ల్లో పెట్టుబడులు కూడా పెడుతున్నాయి.

**ఆల్కహాల్ రహితంవైపు..**

నీల్సన్‌ఐక్యూ అధ్యయనం ప్రకారం భారతదేశంలో 53% మంది పూర్తిగా తాగనివారు లేదా చాలా తక్కువ తాగేవారు.. చట్టబద్ధంగా తాగే వయస్సు కలిగి ఉన్నారు. అంటే.. వీళ్లంతా 18–34 ఏళ్ల లోపు వారన్నమాట. ఇక, ఈ కేటగిరీలో ఉన్న 35–54 ఏళ్లవారు 35 శాతం కాగా, 55 ఏళ్లకుపైబడిన వారు 13 శాతం. ఆల్కహాల్ రహిత పానీయాల వైపు యువత ఆకర్షితులవుతుండటంతో ఈ మార్కెట్ దేశంలో ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. ప్రధానంగా ఈ ట్రెండ్ మెట్రోల్లో ఎక్కువగా కనిపిస్తోంది. నాన్ ఆల్కహాలిక్ స్పిరిట్స్ లభ్యత గతంలో చాలా పరిమితంగా ఉండేది. ప్రస్తుతం ఇవి విరివిగా లభిస్తుండడం సైతం డిమాండ్‌కు ఆజ్యం పోస్తోంది. పైగా క్విక్ కామర్స్ కంపెనీలు వీటిని నేరుగా కస్టమర్లకు 10 నిమిషాల్లో డెలివరీ చేస్తున్నాయి. హైదరాబాద్, గోవా, బెంగళూరు, పుణే, ముంబై, ఢిల్లీ%–%ఎన్సీఆర్‌లోని బార్లు సరికొత్త మాక్‌టెయిల్స్‌ను తమ కస్టమర్లకు అందిస్తున్నాయి. కోలా పానీయాలు, తాజా లైమ్ సోడా, మొహిటో వంటి ఆల్కహాల్ రహిత పానీ యాలు మెనూలో వెనుక భాగంలో ఉండే రోజులు పోయాయన్నది మార్కెట్ వర్గాల మాట.

## విపక్షాలకు అవకాశమిస్తే.. చొరబాటుదారులతో బిహార్ నిండిపోతుంది

ఇంటర్నెట్ డెస్క్: ఓట్ల చోరీ అంటూ 'ఇండియా' కూటమి తప్పుడు ఆరోపణలు చేస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా విమర్శించారు. భాజపా అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని గతంలో ఇదే తరహా దుష్ప్రచారం



చేసిందన్నారు. బిహార్‌లోని డెహరీ ఆన్ సోన్‌లో పార్టీ శ్రేణులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ మేరకు మాట్లాడారు. బంగ్లాదేశీ చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ఇటీవల రాహుల్ గాంధీ యాత్ర నిర్వహించారని ఆరోపించారు. ఒకవేళ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. రాష్ట్రమంతా చొరబాటుదారులతో నిండిపోతుందని వ్యాఖ్యానించారు. "బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులను రక్షించడమే రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరుగుతూ.. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే బిహార్ చొరబాటుదారులతో నిండిపోతుందని చెప్పండి. అదేవిధంగా 'ఓట్ల చోరీ' అంటూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేయడానికి భాజపా యత్నిస్తుందని గతంలో ఇదే తరహా ఆరోపణలు చేశారు. కానీ.. అలాంటిదేమీ జరగలేదు కదా" అని కాషాయ శ్రేణులను ఉద్దేశించి అమిత్ షా పేర్కొన్నారు. బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు అమిత్ షా ఈ పర్యటన చేపట్టారు. మగధ–శాహాబాద్ ప్రాంతంలోని 10 జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 2020 అసెంబ్లీ ఎన్నికలు, గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ ఎన్డీయే పనితీరు అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. అంతకుముందు సీఎం నీతీశ్ కుమార్ పాట్నాలో అమిత్ షాను కలిశారు. తాను ఎన్డీయేలోనే ఉంటానని ఇటీవల ప్రధాని మోదీ సమక్షంలో నీతీశ్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# సైగల భాష అందరూ నేర్చుకోవాలి

**ప్రపంచమంతా ఒకే సైన్ లాంగ్వేజ్ ఉండాలి:**
**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్ :** సైగల భాష అందరూ నేర్చుకోవాలని ప్రపంచమంతా యూనివర్సల్ గా ఒకే సైన్ లాంగ్వేజ్ ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అంతర్జాతీయ సైన్ లాంగ్వేజి వారోత్సవాలు ఈనెల 22 నుండి 28 వరకు నిర్వహించనున్నారు. విద్యానగర్లోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో ముందస్తు అంతర్జాతీయ సైన్ లాంగ్వేజి దినోత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ భాషలు లేని కాలంలో సైగల ద్వారానే కమ్యూనికేషన్ ఉండేదని తెలిపారు. అందువల్ల సైన్ లాంగ్వేజిని చిన్నచూపు చూడొద్దని అన్నారు. ప్రపంచమంతా ఒకే సైన్ లాంగ్వేజి ఉండడం ద్వారా అంతర్జాతీయంగా దివ్యాంగులకు ఎంతో మేలు జరుగుతుందని సూచించారు. దివ్యాంగుల భావాలను అర్థం చేసుకొని వారితో మెరుగైన కమ్యూనికేషన్ ఉండాలనే ఉద్దేశంతో జిల్లాలో అక్షయ్ ఆకృతి ఫౌండేషన్ ద్వారా అధికారులకు, ఉత్సాహం ఉన్నవారికి సైన్ లాంగ్వేజి నేర్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ భాష నేర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తమ సర్వీసులో ఒకసారైనా అంధుల, బధిరుల పాఠశాలల్లో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ బధిరుల పాఠశాలలో




విద్యార్థులకు ఇదివరకే టైలరింగ్, రైటింగ్ వంటి స్కిల్స్ లో శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, డ్రాయింగ్, మొబైల్ రిపేరింగ్ వంటి రంగాల్లో కూడా వీరికి శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే. వెంకటేష్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. చట్టం ప్రకారం దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి వంటివి అందజేయాలని తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కచ్చితంగా అమలుపరచాలని అన్నారు. దివ్యాంగుల చట్టాలను వారికి వివరించేందుకు ఉపాధ్యాయులు, అధికారులు ఈ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కరీంనగర్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఇండియన్ సైన్ లాంగ్వేజ్ నేర్చుకోవడంతోపాటు అధికారులకు నేర్పించడం మంచి విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఐ.ఈ.పి.ఐ.డి బాధ్యులు డాక్టర్ హిమాన్షు, ప్రియాంక, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జి సి డి ఓ కృపారాణి, తహసిల్దార్ నరేందర్, బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ కమల పాల్గొన్నారు.

# కిషోర బాలికల సంఘాల ఏర్పాటు ప్రక్రియ గురించి దిశా నిర్దేషం

**సిద్దిపేట :** 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలలోపు వయసు గల కిషోర బాలికల సంఘాలను ఏర్పాటు చెయ్యాలని కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పాఠశాల ఇంటర్మీడియట్, లేబర్, ఇండస్ట్రీస్, మెడికల్ మరియు హెల్త్, శిశు సంక్షేమ శాఖ మరియు సంబందిత ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు. జిల్లాలో కిషోర బాలికల సంఘాల ఏర్పాటు ప్రక్రియ గురించి దిశా నిర్దేషం చేశారు. కిషోర బాలికల సంఘాల ఏర్పాటుతో ఎన్నో సామాజిక రుగ్మతలను రూపు మాపవచ్చని పేర్కొన్నారు. 14 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు జీవితంలో అత్యంత కీలక దశ అని, ఈ దశలో సరైన మార్గదర్శకం ఇస్తే కౌమార బాలికలు సమాజానికి దారి దీపము ఆవుతారని అన్నారు. బాల్యవివాహాలు, చదువు మానేయడం, రక్తహీనత,




పోషకఆహార లోపం, వేధింపులు వంటి ఎన్నో సవాళ్లు కౌమార దశలో బాలికలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రతి బాలికకు అవకాశాలు కల్పించడమే నిజమైన సాధికారత అని స్పష్టం చేశారు. డిఆర్డిఓ, డిడబ్ల్యుఓ లు ఈ సంఘాల ఏర్పాటులో భాగస్వాములు కావాలని, ఇలాంటి సంఘాల ద్వారా బాలికల సమస్యలను గుర్తించి అవగాహన కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. కిశోర బాలికల భద్రత, పోషకాహారం, ఆరోగ్యం, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనలో ఈ సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ, అటవీ ప్రాంతాల బాలికల సమస్యలు వేర్వేరుగా ఉంటాయని, వాటి స్వభావానుసారం నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమాజంలో వ్యాపిస్తున్న అనేక రుగ్మతలకు రూపుమాపగలిగే శక్తి కిశోర బాలికలలో ఉందని, వీరిచే సంఘాలు ఏర్పాటు చేసి వీటిని బలోపేతం చేస్తే బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలకు సమగ్ర పరిష్కారం లభిస్తుందని అన్నారు. గ్రామాల వారీగా ఎస్ ఇ ఆర్ పి, ఏపిఎం లు,సిసి లు,మరియు వివో ఏ లు, ఈ సంఘాలను ఏర్పాటు చేయాలని అదే విధంగా జిల్లా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

ఈ సమావేశం లో డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, అదనపు డిఆర్డిఓ సుదీర్, డీఎంహెచ్వో, జిఎం ఇండస్ట్రీస్ గణేష్ రామ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ రెడ్డి, లేబర్ ఆఫీసర్ శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు టి.రేణుక, వాసుదేవ్, విద్యాసాగర్, డాకయ్య, రాకేశ్ ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవన్నీ పుకార్లే : రాజ్ గోపాల్ రెడ్డి

**నల్గొండ :** తనపై మీడియాలో, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను పుకార్లను ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కొన్ని చానల్లో సోషల్ మీడియాలో నా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బ తినే విధంగా తప్పుడు వార్తలు వస్తున్నాయి. ఈ మధ్యకాలంలో ఆంధ్రజ్యోతి పేపర్ ని తలపించేలా అందజ్యోతి అనే పేరుతో ప్రింట్ చేసి కాలేశ్వరం ప్రాజెక్టులో అవినీతి లేదన్న రాజగోపాల్ రెడ్డి అనే శీర్షికన నేను అనని మాటలు అన్నట్లు ప్రచురిస్తున్నారు. కాలేశ్వరం ప్రాజెక్టు అవినీతి గురించి మొట్టమొదటి అసెంబ్లీలో ప్రస్తావించిందే నేను. నాకు మంత్రి పదవి రానందుకు రేవంత్ రెడ్డి గారి పైన, ప్రభుత్వం పైన నేను అనని మాటలను అన్నట్టు తప్పుడు కథనాలను సృష్టించి అబద్దాలను ప్రచారం చేస్తున్నారు. నా పైన వచ్చే తప్పుడు వార్తలను అబద్దాలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఒకసారి ఎంపీగా ఒకసారి ఎమ్మెల్సీగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాకు కాంగ్రెస్ పార్టీ అన్న సోనియా గాంధీ, అన్న రాహుల్ గాంధీ గారు అన్నా ఎంతో అభిమానమని అన్నారు. మా కుటుంబమే కాంగ్రెస్ పార్టీ నేపథ్యం . నేను రాజీనామా



చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతున్నానని తప్పుడు వార్తలు రాస్తున్నారు. కొందరు గిట్టని వ్యక్తులు నా ప్రతిష్ట దెబ్బతీయడానికి సోషల్ మీడియా ద్వారా అవస్తవాలు పుకార్లు ప్రచారం చేస్తున్నారు . దయచేసి తెలంగాణ సమాజం పుకార్లను నమ్మకండి. కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కొన్ని సందర్భాలలో అంతర్గతంగా బహిర్గతంగా ఈ విధంగా చేస్తే బాగుంటుంది అని కొన్ని వేదికల్లో చెప్పడం జరిగింది. త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ విషయంలో కొంతమంది అనుకూలంగా మార్చుకున్నారని అనుమానాలు ఉన్నాయి. భూ నిర్వాసితుల విషయంలో కూడా తగిన పరిహారం ఇచ్చి న్యాయం చేస్తే బాగుంటుంది అని నా అభిప్రాయం చెప్పాను. ఈరోజు కూడా నేను గుంటూరు ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరవ్వడానికి వెళ్తుంటే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ని కలవడానికి వెళ్తున్నాడని పుకార్లు సృష్టిస్తున్నారు. నేను గుంటూరు వెళుతున్నాను అంటే మా నియోజకవర్గంలో నుంచి కూడా కొంతమంది నాయకులు నాతో వస్తా అన్నారు. నేను మా నాయకులు కలిసి గుంటూరులో ప్రవేట్ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత అటు నుండి విజయవాడ వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకొని వద్దామని వెళ్తున్నాం. దానికి నేను జగన్ ని కలవడానికి వెళ్తున్నానని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. నా రాజకీయం గురించి నా భవిష్యత్తు గురించి నేను మీడియా సమావేశం పెట్టి చెబుతాను తప్ప అప్పటివరకు ఈ దుష్ప్రచారాలను నమ్మకండని తెలంగాణ సమాజాన్ని కోరుతున్ననని అన్నారు.

# భద్రాద్రి జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన

## పాల్గొన్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు

**కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విస్తృతంగా పర్యటించారు. కలెక్టరేట్లో ప్రజా పాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పాల్గొన్నారు. 1948 సెప్టెంబర్ 17న నిరంకుశ పాలన నుండి ప్రజా పాలనకు అంకురార్పణ జరిగిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. అనంతరం ములకలపల్లిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం. వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్,ఎస్పీ రోహిత్ రాజు,ఐటీడీఏ పీవో రాహుల్ తో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు కలిసి సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారి ఆరోగ్య సంరక్షణపై సమీక్షించారు. విద్యార్థుల కోసం డైట్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచినట్లు తెలిపారు. 'స్వస్థ నారీ, సశక్త పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు హెల్త్ కార్డులు ఇస్తారని, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.



# ఆరోగ్యశ్రీపై సమీక్ష జరపాలి మండలి చైర్మన్ గుత్తా



**నల్గొండ :** నల్గొండ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం లో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియా మిత్రులతో చిట్ చాట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గుత్తా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య ,వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వైద్య రంగానికి ప్రభుత్వం ప్రతి ఏటా దాదాపు 1200 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. అలాగే ఆరోగ్య శ్రీ, సీఎంఆర్ఎఫ్ పథకాలపై మరోసారి సమీక్ష నిర్వహించాలని అన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య వసతులు తక్కువగా ఉండటం కారణంగా పేదలకు ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స కోసం ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేసారు. కానీ నేడు తెలంగాణలోని 32 జిల్లాల్లో ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్మించడం జరుగుతుంది. అలాగే హైదరాబాద్ పట్టణంలో మరో నాలుగు పెద్ద ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్మాణంలో ఉన్నవి . ఈ ప్రభుత్వ హాస్పిటల్స్ ని అభివృద్ధి చేసి , ఆయా హాస్పిటల్స్ లో పని చేసే డాక్టర్స్ కి ప్రోత్సహకాలు ఇచ్చి మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడలని ప్రభుత్వానికి సూచిస్తున్నాను . హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల్లోని హాస్పిటల్స్ ని బలోపేతం చేయాలి. ప్రైవేట్ హాస్పిటల్ కి ఆరోగ్యశ్రీ నిధులను ఇవ్వాల్సిన అవసరం అప్పుడు ఉండదు. ఆరోగ్యశ్రీ , సీఎంఆర్ఎఫ్ నిధులను ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడానికి వినియోగిస్తే బాగుంటుంది అని నా అభిప్రాయం. ఫీజు రియంబర్స్ మెంట్ విషయంలో కూడా ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ స్కూల్ లు , కాలేజిలు , ప్రభుత్వ విద్యాసంస్థలు మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రభుత్వ హాస్పిటల్స్ లో , ప్రభుత్వ విద్య సంస్థలలో పని చేసే ఉద్యోగులు బాధ్యతాయుతంగా తమ కర్తవ్యాలను నిర్వర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు.

## మీర్ పేటలో షూ షాప్‌లో ఘోర అగ్ని ప్రమాదం.. లక్షల్లో నష్టం

**హైదరాబాద్ :** హైదరాబాద్ మీర్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లెల్లగూడ మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీశ్రీ ఫుట్‌వేర్ దుకాణంలో గురువారం తెల్లవారుజామున ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. స్వాగత్ గ్రాండ్ బిల్డింగ్ సెల్లర్‌లో ఉన్న ఈ షాప్‌లో షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగినట్టు ప్రాథమిక విచారణలో తేలింది. సుమారు రూ.25 లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. ఉదయం 4:30 గంటల సమయంలో దుకాణం నుంచి మంటలు, పొగలు కనిపించడం స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్థానికు సమాచారం అందుకున్న వెంటనే మీర్ పేట పోలీస్, ఫైర్‌సర్వీస్ సిబ్బంది రెండు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకుని దాదాపు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయని షాపు యజమాని శ్రీనివాస్ చెప్పారు. అగ్నిమాపక అధికారి రామచంద్రరావు మాట్లాడుతూ..."దుకాణంలో మండే స్వభావం ఉన్న పదార్థాలు అధికంగా ఉండటంతో మంటలు అదుపు చేయడంలో ఆలస్యమైంది. దుర్ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదు" అని తెలిపారు.

## కలెక్టర్ పై ఎంపీ ఆగ్రహం

**అదిలాబాద్ :** పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ జిల్లా కలెక్టర్ శ్రీహర్షపై ఫైర్ అయ్యారు. కలెక్టర్ వైఖరిపై అసహనం వ్యక్తం చేశారు. రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి, ఎయిర్ పోర్ట్ వివరాలు అడిగితే లేవు అనే నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడం,సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే స్పందించకపోవడం మెసేజ్‌లు చేసిన రిప్లై ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభోత్సవం వేళ ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృవందన పథకం కింద ప్రసూతి ప్రయోజనాలను మహిళలకు వివరించారు. మహిళలు ఈ కార్యక్రమన్నీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు బాగుంటేనే కుటుంబం బాగుంటుందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ప్రజలు,ఆసుపత్రి సిబ్బంది ఆసుపత్రికి అంబులెన్స్ అవసరం ఉందని ఎంపీని కోరారు. దీంతో తప్పకుండా ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా అంబులెన్స్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తర్వాత పక్కనే కొత్తగా నిర్మిస్తున్న ప్రధాన ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. బిల్డింగ్ పనులు ఎలా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే ప్రజా సమస్యలపై సమాచారం అందిస్తే ఎందుకు స్పందించడం లేదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను ఎంపీ ప్రశ్నించారు. రామగుండం ఎయిర్ పోర్ట్,ఇఎ ఆస్పత్రి వివరాలు అడిగితే ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఎంపీ హోదాలోనే వివరాలు అడిగితే ఇవ్వలేదంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రజల ద్వారా ప్రజల కోసం ఎన్నికైన తాను ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాసేవ చేసేందుకే ఎంపీగా ఉన్నానని కలెక్టర్ పై మండిపడ్డారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలనేది రిక్వెస్ట్ కాదని కలెక్టర్ గా మీ బాధ్యత అని గుర్తుకు చేశారు. ఎవరైనా ఎంపీ చెప్పిన పనులకు చేయొద్దని నిబంధనలు ఏమైనా పెట్టారా అని కలెక్టర్ ను ప్రశ్నించారు. దీంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష కి ఏమి సమాధానం ఇవ్వాలో నోటి నుంచి మాట రాలేదు. వెంటనే అక్కడి నుంచి వెనుతిరిగి వెళ్ళిపోయారు.

## రిసెప్షన్ ఖర్చుతో రైతులకు ఉచిత యూరియా

**హైదరాబాద్ :** మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కుమారుడి వివాహం ఈ మధ్య జరిగింది. వివాహాన్ని సింపుల్‌గా చేసుకున్న ఎమ్మెల్యే పెళ్లి విందును మాత్రం గ్రాండ్‌గా ఇవ్వాలని నిర్ణయించారు. కానీ తన నియోజకవర్గంలో రైతులు పడుతున్న ఇబ్బందులు చూసి కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆయన వైరల్‌గా మారారు. ఎమ్మెల్యే కుమారుడి విందుకు అయ్యే ఖర్చును రైతులకు అందజేస్తే ఎలా ఉంటుందని ఆలోచించారు. ప్రస్తుతం ప్రతి ప్రాంతంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగని ఆయనే యూరియా కొని రైతులకు ఇస్తే రాజకీయంగా విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉంది. అందుకే ఆయన ఆ డబ్బులు ప్రభుత్వానికి ఇవ్వాలని భావించారు. అనుకున్నట్టుగానే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్యమంత్రిని కలిశారు. తన మనసులో మాట చెప్పారు. తన కుమారుడు ప్రసన్నను, కోడలు వెన్నలతో వెళ్లి ముఖ్యమంత్రికి చెక్ అందజేశారు. విందు కోసం రెడీ చేసుకున్న రెండు కోట్ల రూపాయలను రేవంత్ రెడ్డికి ఇచ్చారు. తన నియోజకవర్గంలోని రైతుల కోసం 2 కోట్లను ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు. లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందజేయాలని కోరిన ఎంఎల్ఏ కోరారు. మిర్యాలగూడలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని భావించిన ఎంఎల్ఏ లక్ష్మారెడ్డి దాన్ని రద్దు చేసుకున్న విషయం తెలిసి రేవంత్ రెడ్డి ఆశ్చర్యపోయారు. రిసెప్షన్ డబ్బును రైతుల కోసం ఖర్చు చేయాలనే ఆలోచనను అభినందించారు. రైతుల ఆశీస్సులు నూతన దంపతులపై ఉంటాయని ఆకాంక్షించారు. ఆయన కూడా వారిని ఆశీర్వదించారు.

## అయిల్ ఫామ్ సాగులో మరో ముందడుగు:

**మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**



**సిద్దిపేట :** అయిల్ ఫామ్ సాగు కు అంతర పంట సాగు ప్రాధాన్యతఅంతర పంట సాగు తో అధిక లాభాలు.అయిల్ ఫామ్ సాగు కు మీరే బ్రాండ్ అంబాసిడర్లు..అనుభవం ఉన్న రైతులు అయిల్ ఫామ్ సాగు పై అవగాహన కల్పించండికోకో, వక్క పంట సాగు ఎంతో మేలు చేస్తుంది.అయిల్ ఫామ్ తోటలో ఆంతర పంట కోకో సాగుకు ఎకరాకు 12వేలు రాయితి.అయిల్ ఫామ్ సాగు చేసిన రైతు లతో టెలికాన్ఫరెన్స్ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.అయిల్ ఫామ్ సాగు లో అంతర్ పంట వేయడం వలన ఎంతో మేలు జరుగుతుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఇటీవల అశ్వరావు పేట కు వెల్లి అయిల్ ఫామ్ సాగు లో అంతర్ పంట సాగు అయిన కోకో వక్క పంటలను సందర్శించిన రైతు లతో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు టెలికాన్ఫరెన్స్ లో మాట్లాడారు. అయిల్ ఫామ్ సాగు చేయడం ఎంతో మేలు జరిగిందని మీరు అయిల్ ఫామ్ సాగు చేసి నాల్గు సంవత్సరాలు గడిచిందని వాటి ఫలితాలు కండ్ల ముందు చూడటం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని అన్నారు కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం ఇంపోర్ట్ డ్యూటీ ని 28% ఉంటే దాన్ని 18% కి తగ్గించింది దీని బీజేపీ ప్రభుత్వం పై పోరాటం చేస్తామన్నారు. మీకు అయిల్ ఫామ్ సాగు లో ఎంతో అనుభవం ఉందని మీరు ఎంతో మంది రైతులకు స్పూర్తి, ఆదర్శం మని చెప్పారు. ఇంకా మరికొంత మంది రైతు లకు మీ కల్ల ముందు జరిగిన ప్రత్యక్ష లాభాన్ని ఇతర రైతులకు అవగాహన కలిపించాలని సూచించారు. అశ్వరావు పేటకు అయిల్ ఫామ్ లో అంతర పంట సాగు తో ఎలాంటి ప్రయోజనం ఉందని మీరు చూసి వచ్చారు. అయిల్ ఫామ్ లో కోకో సాగుకు ఎకరానికి 12వేల రాయితి ఉందన్నారు అదనంగా 80 వేల నుండి లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తుందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోకో పంట వేస్తే ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు అంతర్ పంట సాగు ని వేసుకువాలని సూచించారు.. ఇది అయిల్ ఫామ్ సాగు కు మరో ముందడుగని, అయిల్ ఫామ్ సాగుని మరింత ప్రోత్సహించాలని మీరే అయిల్ ఫామ్ బ్రాండ్ అంబాసిడర్లని చెప్పారు. రైతు లకు మేలు చేసే దిశగా అయిల్ ఫామ్ సాగు విస్తరణ పెంచే అడుగులు వేయాలని సూచించారు. రైతు లకు మేలు జరిగే ఈ పంట కు రైతు లకు ఎల్లప్పుడూ నా సహాయ సహకారం ఉంటుందని చెప్పారు.



# ఉదయం లేవగానే టీ తాగుతున్నారా?

మీలో చాలామందికి ఉదయం నిద్ర లేవగానే ఒక వేడి వేడి కప్పు టీ తాగే అలవాటు ఉంటుంది కదా? కానీ, ఈ అలవాటు మన ఆరోగ్యానికి చాలా నష్టం కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఖాళీ కడుపుతో నేరుగా టీ తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇది మీ జీర్ణవ్యవస్థను, జీవక్రియను దెబ్బతీస్తుంది, అసిడిటీ సమస్యలను పెంచుతుంది.అయితే, ఈ సమస్యకు ఒక సులభమైన పరిష్కారం ఉంది. అదేంటంటే... టీ తాగే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగడం. ఇలా చేయడం వల్ల టీలో ఉండే కెఫిన్ ప్రభావం శరీరంలో తగ్గుతుంది. అంతేకాకుండా, ఇది కడుపులోని ఆమ్లాన్ని పలుచబరిచి, టీ వల్ల వచ్చే కడుపు మంట, అసిడిటీ వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. కాబట్టి, రోజూ ఉదయం టీ తాగే అలవాటు ఉన్నవారు ఖచ్చితంగా ఈ చిట్కా పాటించడం మంచిది.టీ అనేది మంచి శక్తిని ఇచ్చే పానీయం. అయితే, దానిని సరైన పద్ధతిలో తీసుకోవడం చాలా ముఖ్యం. టీ తాగే ముందు నీరు తాగడం వల్ల కలిగే మరో ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే, ఇది మన శరీరంలో అసిడిటీని నియంత్రిస్తుంది. ఇది ముఖ్యంగా అసిడిటీ సమస్యలతో బాధపడేవారికి ఎంతో మేలు చేస్తుంది. ఇలా చేయడం వల్ల టీలోని కొన్ని పదార్థాలు కడుపులో ప్రతికూల ప్రభావాన్ని చూపకుండా సహాయపడతాయి. కాబట్టి, ఇకపై మీరు టీ తాగడానికి ముందు ఒక గ్లాసు నీరు తాగడాన్ని ఒక అలవాటుగా చేసుకోండి. ఈ చిన్న మార్పు మీ జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మీ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఉదయాన్నే ఆరోగ్యకరమైన అలవాటుతో మీ రోజును మొదలు పెట్టండి!

## మంచిదని పసుపు నీరు తాగుతున్నారా..?




ఉదయం పూట పసుపు నీళ్లు తాగడం అనేది ఇటీవల కాలంలో బాగా పాపులర్‌గా మారింది. పసుపులో ఉండే కర్కుమిన్ అనే పదార్థం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతుంటారు. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్, రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు పుష్కలంగా ఉంటాయి. అయితే దీని వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.జీర్ణ సమస్యలు: పసుపు నీరు జీర్ణక్రియకు సహాయపడుతుందని చెప్పినప్పటికీ ఎక్కువ మోతాదులో తీసుకుంటే జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. వికారం, కడుపు నొప్పి, యాసిడ్ రిఫ్లక్స్ లేదా విరేచనాలు వంటి సమస్యలు రావచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. రక్తం పలచబడటం: పసుపుకు రక్తాన్ని పలచబరిచే గుణం ఉంది. ఇది రక్తం గడ్డకట్టకుండా నిరోధిస్తుంది. దీంతో గాయాలైనప్పుడు రక్తం ఎక్కువగా పోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా రక్తం పలచబడటానికి మందులు వాడేవారు. లేదా రక్తస్రావ వ్యాధులు ఉన్నవారు పసుపు నీరు తాగే ముందు వైద్యుడి సలహా తీసుకోవాలి. ఐరన్ శోషణ తగ్గడం: పసుపును ఎక్కువగా తీసుకుంటే శరీరంలో ఐరన్ శోషణ 20శాతం నుండి 90శాతం వరకు తగ్గుతుంది. ఇది కాలక్రమేణా ఐరన్ లోపం, రక్తహీనతకు దారితీస్తుంది. అధిక మోతాదులో పసుపు సప్లిమెంట్లను వాడిన ఒక వ్యక్తికి రక్తహీనత వచ్చినట్లు ఒక నివేదిక వెల్లడించింది. కాలేయ సమస్యలు: అధిక మోతాదులో పసుపు సప్లిమెంట్లను వాడితే కాలేయానికి హాని కలుగుతుంది. ఇప్పటికే కాలేయ సమస్యలు ఉన్నవారు దీనిని అధికంగా తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. కొన్ని సందర్భాల్లో ఇది తీవ్రమైన కాలేయ వైఫల్యానికి కూడా దారితీస్తుంది.

# చపాతీ తినడం మానేస్తున్నారా..?



గోధుమ పిండితో చేసే వంటకాలు చాలా మందికి సాధారణ ఆహారం, కానీ గోధుమ పిండి ఆరోగ్యానికి హానికరం అని కొందరు అంటుంటారు. కానీ ఇది ఎంతవరకు నిజం..? రోజూ చపాతీలు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయా..? భారతీయ వంటకాల్లో చపాతీ చాలా ముఖ్యమైనది. చాలా మంది రోజులో ఒక్కసారైనా చపాతీ తింటారు. కానీ ఇటీవల కాలంలో ఫిట్‌నెస్ విషయంలో శ్రద్ధ పెరిగిన చాలామంది ప్రజలు చపాతీ తినడం మానేస్తున్నారు. గోధుమల్లో గ్లూటెన్ అనే పదార్థం ఉంటుందని, ఇది ఆరోగ్యానికి హానికరమని కొందరు భావిస్తున్నారు. చపాతీ తినడం వల్ల బరువు పెరుగుతుందని, షుగర్ లెవెల్స్ పెరుగుతాయని కూడా నమ్ముతున్నారు. అయితే నిజంగా చపాతీ తినడం హానికరమా? హెూలిస్టిక్ డైటీషియన్ డాక్టర్ గీతికా చోప్రా ప్రకారం.. గోధుమ అనేది ఒక సంక్లిష్ట కార్బోహైడ్రేట్. ఇది రోజంతా మీ శక్తి స్థాయిలను నిలకడగా ఉంచడంలో సహాయపడుతుంది. శుద్ధి చేసిన పిండి లాంటి సాధారణ కార్బోహైడ్రేట్లు శక్తిని త్వరగా పెంచి, త్వరగా తగ్గిస్తాయి. కానీ గోధుమ రోటీలో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. బరువు నియంత్రణ: చపాతీ త్వరగా కడుపు నిండిన భావన కలిగిస్తుంది. దీనివల్ల అతిగా తినడాన్ని తగ్గించుకోవచ్చు, తద్వారా బరువును నియంత్రించుకోవచ్చు. కండరాల పెరుగుదల: గోధుమల్లో కండరాల నిర్మాణానికి అవసరమైన ప్రోటీన్ ఉంటుంది. విటమిన్లు, ఖనిజాలు: ఇందులో విటమిన్ బి, ఐరన్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇవి జీవక్రియ, రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడతాయి. కొంతమందికి గ్లూటెన్ పడదు. అలాంటి వారికి చపాతీ తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి, గోధుమలకు బదులుగా రాగి, జొన్న వంటి గ్లూటెన్ రహిత పిండితో చేసిన రోటీలను తీసుకోవడం మంచిది. ఒకవేళ మీకు గ్లూటెన్ పడకపోతేనే గోధుమ రోటీని మానేయండి. మిగిలిన వారందరికీ గోధుమ రోటీ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఉన్న పోషకాలు మీ మొత్తం ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయి.

# కిడ్నీలు పాడైపోయినప్పుడు కనిపించే లక్షణాలు



శరీరంలో పేరుకున్న వ్యర్థాలను సరైన విధంగా బయటకు పంపించడంలో లివర్ తరవాత కిడ్నీలదే కీలక పాత్ర. యూరిన్ ద్వారా మురికిని బయటకు పంపేస్తాయి మూత్ర పిండాలు.అంతే కాదు. రక్తాన్ని శుద్ధి చేయడంలోనూ, నీటి నిల్వను నియంత్రించడంలోనూ కిడ్నీలు ఎంతో బాగా పని చేస్తాయి. అయితే..కొన్ని సార్లు ఈ పని తీరులో మార్పులు చూస్తారు. అందుకు ముఖ్య కారణం ఇవి దెబ్బ తినడం. ఎప్పుడైతే కిడ్నీలు దెబ్బ తింటాయో అప్పటి నుంచి టాక్సిన్స్ బాడీలో పేరుకుపోతాయి. సరైన విధంగా మురికి బయటకు వెళ్లిపోదు. ఫలితంగా రకరకాల సమస్యలు వస్తాయి. కిడ్నీలు దెబ్బ తిన్నప్పుడు ప్రాథమికంగా కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని సరైన విధంగా గమనించకపోతే సమస్య తీవ్రమవుతుంది. మరి ప్రాథమికంగా కనిపించే ఆ లక్షణాలేంటి. ఎలా వాటిని గుర్తించాలో తెలుసుకోండి.


ఇందాకే చెప్పుకున్నట్టుగా కిడ్నీలు రక్తాన్ని ఫిల్టర్ చేసి, టాక్సిన్స్ ని బయటకు పంపుతాయి. వీటి పనే అది. ఎప్పుడైతే ఇందుకు అంతరాయం కలుగుతుందో అప్పుడే కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని మెడికల్ పరిభాషలో చెబుతుంటారు. నిజానికి కిడ్నీలు ఉన్నట్టుండి పాడైపోవు. అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, లైఫ్ స్టైల్ సరిగా లేకపోవడం, మసాలా ఫుడ్స్ అతిగా తినడం లాంటి కారణాల వల్ల మూత్రపిండాల పని తీరుపై ప్రభావం పడుతుంది. అధికంగా సాల్ట్, ప్రొటీన్ తీసుకున్నా ఇవే ఇబ్బందులు వస్తాయి. అయితే ఇంకొంత మంది విపరీతంగా స్మోకింగ్, డ్రింకింగ్ చేస్తుంటారు. వీటి వల్ల కిడ్నీలు చాలా త్వరగా డ్యామేజ్ అవుతాయి. ఇక నిద్రలేమి సమస్య కూడా కిడ్నీ డ్యామేజ్ కి దారి తీస్తుంది. సింపుల్ గా చెప్పాలంటే..ఇదో సైలెంట్ కిల్లర్. ఇక బీపీ, షుగర్ లాంటి వాటి కోసం మెడిసిన్ ఎక్కువ కాలం పాటు తీసుకోవడం వల్ల కూడా కిడ్నీలు దెబ్బ తినే ముప్పు ఉంటుంది. కిడ్నీలో రాళ్లు వస్తాయి.

కిడ్నీలు పాడైపోయినప్పుడు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని సరైన విధంగా, సరైన సమయానికి గుర్తిస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా సమస్యల నుంచి బయటపడవచ్చు. ఇందులో ముఖ్యంగా కనిపించే మొట్టమొదటి లక్షణం ఏంటంటే..తరచూ యూరిన్ రావడం. ఎక్కువ సార్లు మూత్రం రావడం కిడ్నీలు పాడైపోయాయనడానికి సంకేతం. ముఖ్యంగా రాత్రి పూట తరచూ యూరినేషన్ వస్తుంది. ఇక మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. అంతకు ముందు రోజులతో పోల్చి చూస్తే మూత్రం చాలా తక్కువ క్వాంటిటీలో వస్తుంది. ఇది కూడా కిడ్నీ డ్యామేజ్ కి సంకేతమే. మూత్రంలో ఎక్కువగా నురగ, మరీ పసుపు పచ్చగా రావడం, రక్తం కనిపించడం లాంటి లక్షణాలు కూడా కిడ్నీలు పాడైపోయాయి అనడానికి సంకేతాలే. కిడ్నీలు సరైన విధంగా పని చేయకపోతే శరీరంలో మలినాలు పేరుకుంటాయి. ఇవి బయటకు వెళ్లకపోతే ఎన్నో సమస్యలు వస్తాయి. ముఖ్యంగా జీర్ణ సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ఎప్పుడైతే మూత్ర పిండాలు సరిగ్గా పని చేయవో అప్పుడు బాడీలో టాక్సిన్స్ పెరుగుతాయి. ఇవి నేరుగా జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపిస్తాయి. తరచూ వాంతులు, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు కనబడతాయి. అంత కన్నా ముఖ్యంగా కనిపించే లక్షణం ఏంటంటే..మలబద్ధకం. ఒక్కసారి ఈ సమస్య మొదలైందంటే..అంత సులభంగా తగ్గదు. పైగా మలబద్ధకం కారణంగా ఇతరత్రా అనారోగ్యాలు కూడా తలెత్తుతాయి. ఇక మరో ముఖ్యమైన లక్షణం ఏంటంటే..ఎప్పుడైతే కిడ్నీలు సరిగ్గా పని చేయవో అప్పుడు బాడీలో ఉన్న అదనపు నీరు, ఉప్పు బయటకు వెళ్లడానికి వీలుండదు. సోడియం పెరిగే కొద్దీ అది కండరాల్లోకి చేరుకుంటుంది. ఎక్కువ రోజుల పాటు అలాగే నిల్వ ఉండడం వల్ల వాపులు వస్తాయి. ముఖ్యంగా చేతులు, కాళ్లలో ఈ వాపు కనిపించవచ్చు. ఉదయం పూట ఈ లక్షణం ఎక్కువగా కనబడుతుంది.

కిడ్నీలు పాడైపోయినప్పుడు కనిపించే మరో లక్షణం విపరీతమైన నీరసం. సాధారణంగా మూత్ర పిండాలు ఎరిత్రోపొయిటిన్ అనే హార్మోన్ ని ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది. ఇది ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేసేందుకు ఉపయోగపడే హార్మోన్. ఎప్పుడైతే కిడ్నీల పని తీరుపై ప్రభావం పడుతుందో అప్పుడు ఈ హార్మోన్ ఉత్పత్తి కాదు. ఫలితంగా..ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది. ఇదే క్రమంగా అనీమియాకి దారి తీస్తుంది. అంటే..హిమోగ్లోబిన్ తగ్గిపోతుంది. ఎప్పుడైతే రక్తం తగ్గిపోతుందో అప్పుడు విపరీతంగా నీరసపడిపోతారు. చాలా మంది దీన్ని మామూలు నీరసంగానే చూస్తారు. కానీ..ఇలా తరచూ నీరసంగా అనిపిస్తోంది అంటే తప్పనిసరిగా అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంటుంది. కిడ్నీలు పాడైపోయినప్పుడు వెన్ను నొప్పి కూడా వస్తుంది. కిడ్నీలో రాళ్లు రావడం, ఇన్ఫెక్షన్ , ఇన్ ఫ్లమేషన్ కారణంగా ఇలా విపరీతంగా నొప్పి వస్తుంది. మూత్రంలో కూడా మార్పు వస్తే అప్పుడు వైద్యుడిని సంప్రదించడం అవసరం.

# కలబంద జ్యూస్ తాగితే ఊహకందని ఉపయోగాలు..!



కలబంద జ్యూస్ తాగడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. ప్రతిరోజూ దీనిని తాగేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం కూడా తప్పనిసరి. వచ్చేది శీతాకాలం సీజనల్ వ్యాధులకు ఎక్కువ అవకాశం ఉంటుంది. అందుకే శీతాకాలంలో కలబంద రసం అనేక ప్రయోజనాలను అందిస్తుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కలబందలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, శోథ నిరోధక లక్షణాలు ఉంటాయి. ఈ రసం జీర్ణక్రియను మెరుగుపరచడంలో, చర్మాన్ని మెరుగుపరచడంలో, రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది.జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: కలబందలో కొవ్వులు, చక్కెరలను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడే ఎంజైమ్‌లు ఉంటాయి. దీని వినియోగం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. దీని రసంలో మలబద్ధకం నుండి ఉపశమనం కలిగించే భేదిమందు లక్షణాలు ఉన్నాయి. రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది: కలబంద మధుమేహ రోగులలో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. కలబంద రసం రక్తంలో చక్కెరను తగ్గించడంలో, కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడంలో సహాయపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. కలబందలోని క్రియాశీల పదార్థాలు అధిక రక్తపోటును తగ్గించడంలో కూడా సహాయపడతాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: కలబంద రసం తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. దీని రసంలో విటమిన్లు (సి, ఇ, బి), ఖనిజాలు (కాల్షియం, మెగ్నీషియం, జింక్) ఉంటాయి. ఇవి మొత్తం ఆరోగ్యానికి, రోగనిరోధక వ్యవస్థకు ముఖ్యమైనవి. చర్మానికి మేలు చేస్తుంది: కలబంద రసం చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది, స్థితిస్థాపకతను పెంచుతుంది. ముడతలను తగ్గిస్తుంది. దీని శోథ నిరోధక, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు మొటిమలతో పోరాడటానికి, చర్మపు మంటను తగ్గించడంలో సహాయపడతాయి. మలబద్ధకం: కలబందలోని భేదిమందు లక్షణాలు, ఆంత్రాక్వినోన్ కడుపు సంబంధిత వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. ఇవి ప్రేగులలో మంచి బ్యాక్టీరియాను సక్రియం చేస్తాయి. మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడతాయి.

బిజినెస్ వాయిస్

# 2040 నాటికి ఏఐ ద్వారా 40 శాతానికి ప్రపంచ వాణిజ్యం

2040 నాటికి కృత్రిమ మేధస్సు (ఏఐ) కారణంగా దేశాల మధ్య వాణిజ్య విలువ దాదాపు 40 శాతం పెరుగుతుందని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) తెలిపింది. ఉత్పాదకత పెరుగుదల, తక్కువ వాణిజ్య ఖర్చుల ద్వారా ఇది పెరిగేందుకు దోహదపడుతుందని బుధవారం విడుదల చేసిన ప్రపంచ వాణిజ్య నివేదిక-2025 ఎడిషన్‌లో పేర్కొంది. అయితే, ఏఐ, వాణిజ్యం రెండూ వృద్ధికి దోహదపడాలంటే, డిజిటల్ అంతరాన్ని తగ్గించడానికి, శ్రామిక శక్తి నైపుణ్యాలలో పెట్టుబడులకు, సానుకూల పెట్టుబడుల వాతావరణం కొనసాగే విధానాలు అమలులో ఉండాలి అని నివేదిక అభిప్రాయపడింది. వాణిజ్య ఖర్చులను తగ్గించడానికి, ఉత్పాదకతను పెంచేందుకు ఏఐకి అపారమైన సామర్థ్యం ఉంది. అయితే, ఏఐ సాంకేతికతలకున్న యాక్సెస్, డిజిటల్ వాణిజ్యంలో చొచ్చుకుపోవడంలో వ్యత్యాసం అధికంగా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ న్గోజీ ఒకోంజో-ఇవేలా అన్నారు. నివేదిక ప్రకారం, 2040 నాటికి ఏఐ వాణిజ్యం, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) గణనీయంగా పెరిగేందుకు అవకాశం ఉంది. తక్కువ, మధ్య, అధిక-ఆదాయ దేశాల మధ్య వివిధ స్థాయిలలో పాలసీలు, సాంకేతికత ఆధారంగా ప్రపంచ వాణిజ్యం 34-37 శాతం మేర పెరుగుతుందని అంచనా.




తక్కువ, మధ్య-ఆదాయ ఆర్థిక వ్యవస్థలు అధిక-ఆదాయ ఆర్థిక వ్యవస్థలతో తమ డిజిటల్ మౌలిక సదుపాయాల అంతరాన్ని 50 శాతం తగ్గించుకుని, ఏఐని మరింత విస్తృతంగా వినియోగిస్తే, ఈ ఆర్థిక వ్యవస్థల(తక్కువ, మధ్య దేశాల) ఆదాయాలు వరుసగా 15 శాతం, 14 శాతం పెరుగుతాయని నివేదిక పేర్కొంది.

## పెట్రోలియం రిజర్వుల్లోకి ఎంఇఐఎల్ ప్రవేశం

MEGHA ENGINEERING & INFRASTRUCTURES LIMITED

మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) కొత్తగా వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వు (ఎస్‌పిఆర్)లోకి ప్రవేశించింది. ప్రయివేటు రంగంలోని ఓ కంపెనీ ఈ రంగంలో ప్రవేశించడం, భారీగా పెట్టుబడులు పెట్టడం ఇదే తొలిసారి అని తెలుస్తోంది. కర్నాటకలోని పాదుర్‌లో రూ.5,700 కోట్ల వ్యయంతో ఎస్‌పిఆర్ యూనిట్‌ను నిర్మించనున్నట్లు వెల్లడించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా 2.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఎస్‌పిఆర్‌ను నిర్మించాలని నిర్దేశించుకుంది. ఇది భారతదేశం అత్యవసర ముడి చమురు నిల్వలకు గణనీయంగా దోహదపడుతుందని ఆ వర్గాలు భావిస్తున్నాయి. దేశంలో ప్రస్తుతం విశాఖపట్నం, మంగళూరు, పదుర్‌లో ఎస్‌పిఆర్‌లు ఉన్నాయి. వీటిల్లోని నిల్వలు ప్రస్తుతం దేశ అవసరాలను 8-9 రోజుల డిమాండ్‌ను తీర్చగలవు. ఎంఇఐఎల్ యూనిట్ అందుబాటులోకి వస్తే ఇది మరింత పెరగనుంది. ప్రపంచ సరఫరా అంతరాయాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు లేదా ఊహించని డిమాండ్ పెరిగినా దేశ ఇంధన బఫర్‌కు తోడ్పడనుంది. ఈ రిజర్వ్‌ను నిర్మించడానికి ఎంఇఐఎల్‌కు ఐదేండ్లు సమయం పడుతుంది.

## బ్యాంకులు, బీమా సంస్థల పెట్టుబడులను అనుమతించే దిశగా సెబీ




క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. నాన్-క్యాష్, నాన్-అగ్రికల్చర్ కమోడిటీ డెరివేటివ్ మార్కెట్లలో బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, పెన్షన్ ఫండ్స్ పెట్టుబడులను అనుమతించాలని యోచిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని చూస్తున్నట్టు బుధవారం సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. కాగా, నాన్-క్యాష్ సెటిల్డ్, నాన్-అగ్రికల్చరల్ కమోడిటీ డెరివేటివ్ కాంట్రాక్టుల్లో ట్రేడింగ్‌కు ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)ను అనుమతించాలన్న ప్రతిపాదననూ పరిశీలిస్తున్నట్టు ఇక్కడ ఎంసీఎక్స్ నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన చెప్పారు. ఆర్థిక వ్యవస్థలో కమోడిటీ డెరివేటివ్ మార్కెట్లు కీలకపాత్ర పోషిస్తాయన్న పాండే.. ప్రపంచ స్థాయిలో ధరలను అనుసరించే స్థాయి నుంచి ఆ ధరలను నిర్ణయించే స్థాయికి భారత్ ఎదగాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. ఇక డిసెంబర్‌కల్లా కాంప్లియెన్స్ రిపోర్టుల కోసం కామన్ రిపోర్టింగ్ మెకానిజంలో కమోడిటీ-స్పెసిఫిక్ బ్రోకర్లనూ సమ్మిళితం చేయనున్నట్టు పాండే ఈ సందర్భంగా తెలియజేశారు.

# యెస్ బ్యాంక్‌లో 13.18% వాటా విక్రయించిన ఎస్‌బీఐ

యెస్ బ్యాంక్‌లో 13.18% వాటాను జపాన్ సంస్థ సుమిటోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ)కు విక్రయించడాన్ని పూర్తిచేసినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బుధవారం ప్రకటించింది. ఈ లావాదేవీ విలువ రూ.8,888.97 కోట్లు. సుమిటోమో మిత్సుయ్ ఫైనాన్షియల్ గ్రూప్ (ఎస్ఎంఎఫ్‌జీ)కు చెందిన ఆర్థిక సేవల విభాగమైన ఎస్ఎంబీసీ నుంచి ఈ మొత్తాన్ని అందుకున్నట్లు ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఎస్‌బీఐ పేర్కొంది. యెస్‌బ్యాంకులో రూ.688 కోట్ల విలువైన వాటాలను ఎస్ఎంబీసీకి ఫెడరల్ బ్యాంక్, బంధన్ బ్యాంక్ విక్రయించాయి. యెస్ బ్యాంక్‌లో 15.39 కోట్ల షేర్లను ఎస్ఎంబీసీకి రూ.331 కోట్లకు బంధన్ బ్యాంక్ విక్రయించింది. దీంతో యెస్ బ్యాంక్‌లో బంధన్ బ్యాంక్ వాటా 0.7% నుంచి 0.21 శాతానికి తగ్గింది. ఒక్కో షేరు రూ.21.50 చొప్పున 16.62 కోట్ల యెస్ బ్యాంక్ షేర్లను రూ.357 కోట్లకు ఫెడరల్ బ్యాంక్ విక్రయించింది. రూ.176 లక్షల కోట్ల ఆస్తులు: భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న అగ్రగామి విదేశీ బ్యాంకుల్లో ఎస్ఎంఎఫ్‌జీ ఒకటి. జపాన్‌లో ఇది రెండో అతిపెద్ద బ్యాంకింగ్ గ్రూప్‌గా ఉంది. ఈ సంస్థ చేతిలో అంతర్జాతీయంగా 2 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.176 లక్షల కోట్ల) ఆస్తులు ఉన్నాయి. ఇప్పుడీ బ్యాంక్ చేతికి యెస్‌బ్యాంకులో 14% వరకు లభించింది. 2020లో పునర్వ్యవస్థీకరణ తర్వాత యెస్ బ్యాంక్‌లో అతిపెద్ద




వాటాదారుగా ఎస్‌బీఐ మారింది. అనంతరం 2020 జులైలో యెస్ బ్యాంక్ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్‌లో భాగంగా అదనపు షేర్లను ఎస్‌బీఐ కొనుగోలు చేసింది. తాజా వాటా విక్రయం తర్వాత కూడా యెస్ బ్యాంక్‌లో 10.8% వాటాను ఎస్‌బీఐ కలిగి ఉంది. భారత బ్యాంకింగ్ రంగంలో ఇదే అతిపెద్ద సీమాంతర పెట్టుబడి కావడం విశేషం. ఈ లావాదేవీకి రిజర్వ్ బ్యాంక్, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా సహా అన్ని నియంత్రణ సంస్థల అనుమతులు లభించాయి.

క్రీడా వాయిస్

# వెస్టిండీస్ క్రికెట్ జట్టుకు కొత్త కెప్టెన్.. ఐదుగురు అన్‌క్యాప్డ్ ప్లేయర్లకు చోటు

నేపాల్‌తో టీ20 సిరీస్‌కు వెస్టిండీస్ క్రికెట్ తమ జట్టును ప్రకటించింది. రెగ్యులర్ కెప్టెన్ షాయి హోప్‌నకు విశ్రాంతినిచ్చిన విండీస్ బోర్డు.. అతడి స్థానంలో బౌలింగ్ ఆల్‌రౌండర్ అకీల్ హొసేన్‌కు బాధ్యతలు అప్పగించింది. కాగా షార్జా వేదికగా వెస్టిండీస్ జట్టు నేపాల్‌తో మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. సెప్టెంబరు 27, 28, 30 తేదీల్లో మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. ఈ నేపథ్యంలో విండీస్ బోర్డు గురువారం తమ జట్టును ప్రకటించింది.

**ఐదుగురు అన్‌క్యాప్డ్ ప్లేయర్లకు చోటు**

కెప్టెన్ షాయి హోప్‌తో పాటు పేసర్ అల్జారీ జోసెఫ్, బ్యాటర్ జాన్సన్ చార్లెస్ వంటి కీలక ప్లేయర్లకు కూడా సెలక్టర్లు రెస్ట్ ఇచ్చారు. అయితే, ఈ సిరీస్‌లో అకీల్ హొసేన్ సారథ్యంలో జేసన్ హోల్డర్, ఫాబియాన్ అలెన్, కైల్ మేయర్స్ వంటి వారు ప్రధాన భూమిక పోషించేందుకు సిద్ధమయ్యారు. ఇక ఏకంగా ఐదుగురు వెస్టిండీస్ ఆటగాళ్లు నేపాల్‌తో సిరీస్ సందర్భంగా అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టేందుకు సన్నద్ధంగా ఉన్నారు. బ్యాటర్ అకీమ్ ఆగస్టే, ఆల్‌రౌండర్ నవీన్ బిడైసీ, స్పిన్నర్ జీషన్ మొతారా, పేసర్ రామోన్ సైమండ్స్, కీపర్ అమీర్ జాంగూ (టీ20 అరంగేట్రం)లకు తొలిసారి ఈ జట్టులో చోటు దక్కింది.




**నేపాల్‌తో టీ20 సిరీస్‌కు వెస్టిండీస్ జట్టు**

అకీల్ హొసేన్ (కెప్టెన్), ఫాబియాన్ అలెన్, జువెల్ ఆండ్రూ, అకీమ్ ఆగస్టే, నవీన్ బిడైసీ, జెడియా బ్లేడ్, కేసీ కార్టీ, కరీమా గోరె, జేసన్ హోల్డర్, అమీర్ జాంగూ, కైల్ మేయర్స్, ఒబెడ్ మెకాయ్, జీషన్ మొతారా, రామోన్ సైమండ్స్, షమార్ స్ప్రింగర్. ఇదిలా ఉంటే.. ఈ సిరీస్ తర్వాత.. సీనియర్లతో కూడిన వెస్టిండీస్ క్రికెట్ జట్టు భారత పర్యటనకు వెళ్లనుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025-27లో భాగంగా టీమిండియాతో రెండు మ్యాచ్‌లు ఆడుతుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే విండీస్ తమ జట్టు వివరాలను వెల్లడించింది.

**టీమిండియాతో టెస్టులకు విండీస్ జట్టు వివరాలు**

రోస్టన్ ఛేజ్ (కెప్టెన్), తేజ్ నారాయణ్ చందర్‌పాల్, బ్రెండన్ కింగ్, కెవ్‌లాన్ అండర్సన్, షై హోప్, జాన్ క్యాంప్‌బెల్, అతనాజ్, ఇమ్‌లాక్, గ్రీవ్స్, అండర్సన్ ఫిలిప్, అల్జారి జోసెఫ్, షామర్ జోసెఫ్, జేడెన్ సీల్స్, ఖారీ పైర్, జోమెల్ వారికాన్.

## విజేత బార్బడోస్ రాయల్స్.. కీలకపాత్ర పోషించిన టీమిండియా ప్లేయర్

2025 మహిళల కరీబియన్ ప్రీమియర్ లీగ్ టైటిల్‌ను బార్బడోస్ రాయల్స్ ఎగరేసుకుపోయింది. నిన్న (సెప్టెంబర్ 17) జరిగిన ఫైనల్లో ఆ జట్టు గయానా అమెజాన్ వారియర్స్‌ను 3 వికెట్ల తేడాతో ఓడించి, వరుసగా మూడో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గయానా నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 136 పరుగులు మాత్రమే చేసింది. యామీ హంటర్ (29), కెప్టెన్ షెమెయిన్ క్యాంప్‌బెల్ (28 నాటౌట్), వాన్ నికెర్క్ (27 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. బార్బడోస్ బౌలర్లలో షమీలియా కాన్నెల్, అఫీ ఫ్లెచర్, ఆలియా అల్లెన్ తలో వికెట్ తీశారు. అనంతరం బరిలోకి దిగిన బార్బడోస్.. 19.4 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కోట్నీ వెబ్ (31), కైసియా నైట్ (31), చమారీ ఆటపట్టు (25) గెలుపుకు తమవంతు సహకారాన్ని అందించగా.. ఆఖర్లో టీమిండియా ఆల్‌రౌండర్ శ్రేయాంక పాటిల్ (6 బంతుల్లో 10 నాటౌట్‌బీ 2 ఫోర్లు), ఆలియా అల్లెన్ (9 బంతుల్లో 17 నాటౌట్‌బీ ఫోర్, సిక్స్) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడి బార్బడోస్‌ను విజయతీరాలకు చేర్చారు. స్వల్ప స్కోర్‌ను కాపాడుకునేందుకు గయానా బౌలర్లు చాలా కష్టపడినప్పటికీ.. ఆఖర్లో ఆలియా, శ్రేయాంక వారి నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారు. 18 బంతుల్లో 27 పరుగులు చేయాల్సిన తరుణంలో వరుసగా రెండు వికెట్లు కోల్పోగా.. శ్రేయాంక వరుసగా రెండు బౌండరీలు బాది బార్బడోస్ గెలుపును ఖరారు చేసింది. ఆతర్వాతి ఓవర్‌లో




ఆలియా వరుసగా సిక్సర్, బౌండరీ బాది బార్బడోస్ గెలుపును లాంఛనం చేసింది. ఈ టోర్నీలో తొలిసారి బ్యాటింగ్‌కు దిగిన శ్రేయాంక, బంతితోనూ (2-0-15-0) పర్వాలేదనిపించింది. 21 ఏళ్ల శ్రేయాంక గత కొంతకాలంగా గాయాలతో సతమతమవుతూ భారత వరల్డ్‌కప్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయింది.

## మోటీ మాయాజాలం.. ఫైనల్లో గయానా అమెజాన్ వారియర్స్




ఇమ్రాన్ తాహిర్ నేతృత్వంలోని గయానా అమెజాన్ వారియర్స్ కరీబియన్ ప్రీమియర్ లీగ్ 2025 ఎడిషన్ ఫైనల్స్‌కు చేరింది. భారతకాలమానం ప్రకారం ఇవాళ (సెప్టెంబర్ 18) ఉదయం జరిగిన తొలి క్వాలిఫయర్‌లో ఆ జట్టు సెయింట్ లూసియా కింగ్స్‌పై 14 పరుగుల స్వల్ప తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన గయానా.. తబ్రేజ్ షంషి (4-0-33-3), డేవిడ్ వీస్ (3-0-14-2), అల్జరీ జోసఫ్ (3-0-34-2), తైమాల్ మిల్స్ (3.5-0-38-2), రోస్టన్ ఛేజ్ (2-0-15-1) ధాటికి 19.5 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. గయానా ఇన్నింగ్స్‌లో బెన్ మెక్‌డెర్మాట్ (34), షాయ్ హెప్ (32) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. ఆఖర్లో రొమారియో షెపర్డ్ (8 బంతుల్లో 21బీ 2 ఫోర్లు, సిక్స్), ప్రిటోరియస్ (8 బంతుల్లో 17బీ 2 ఫోర్లు, సిక్స్) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో గయానా గౌరవప్రదమైన స్కోర్ చేయగలిగింది.


**మోటీ మాయాజాలం**

అనంతరం 158 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన లూసియా కింగ్స్.. గుడకేశ్ మోటీ మాయాజాలం (4-0-30-4) దెబ్బకు 19.1 ఓవర్లలో 143 పరుగులకే చాపచుట్టేసింది. ఇమ్రాన్ తాహిర్ (4-0-22-2), ప్రిటోరియస్ (4-0-24-2), రొమారియో షెపర్డ్ (4-0-36-1), హస్సన్ ఖాన్ (2.1-0-21-1) కూడా లూసియా కింగ్స్‌ను డ్యామేజ్ చేశారు. గయానా బౌలర్ల ధాటికి ఓ దశలో లూసియా కింగ్స్ ఇన్నింగ్స్ 100లోపే ముగుస్తుందని అనుకున్నారు. అయితే ఖారీ పియెర్ (29 బంతుల్లో 50బీ 3 ఫోర్లు, 5 సిక్సర్లు), తైమాల్ మిల్స్ (18 బంతుల్లో 30బీ 4 ఫోర్లు, సిక్స్) వీరోచితంగా పోరాడి గాయానా శిబిరంలో ఓటమి భయం పుట్టించారు. మోటీ పియెర్‌ను.. హస్సన్ ఖాన్ మిల్స్‌ను ఔట్ చేయడంతో లూసియా కింగ్స్ పోరాటం ముగిసింది. ఈ మ్యాచ్‌లో ఓడినా లూసియా కింగ్స్‌కు టైటిల్ రేసులో ఉండేందుకు మరో అవకాశం ఉంటుంది. సెప్టెంబర్ 20న జరిగే క్వాలిఫయర్-2లో ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్‌తో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు సెప్టెంబర్ 22న జరిగే ఫైనల్లో గయానాతో అమీతుమీ తేల్చుకుంటుంది.




## బోల్డ్ షోటో షూట్‌తో పిచ్చెక్కిస్తున్న దిశా పటాని






# బడ్జెట్ విషయంలో ఎన్నో కష్టాలు పడ్డాను

తమిళ నటుడు విజయ్ ఆంటోని "భద్రకాళి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. రీసెంట్‌గా మార్గాన్ సినిమాతో మెప్పించిన ఆయన మరోసారి సత్తా చాటేందుకు బలమైన కథతో రానున్నారు. 'అరువి' ఫేమ్ అరుణ్ ప్రభు దర్శకత్వంలో విజయ్ ఆంటోని హీరోగా, తృప్తి రవీంద్ర, రియా హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భద్రకాళి'. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోని సమర్పణలో రామాంజనేయులు జవ్వాజీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న రిలీజ్ కానుంది. తెలుగులో సురేశ్‌బాబు విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో పలు విషయాలను విజయ్ ఆంటోని పంచుకున్నారు. 25వ సినిమాగా భ్రదకాళి రానుంది. నంబర్ మాత్రమే మారింది. కానీ, నేను ప్రతి సినిమాకు ఒకే విధంగా పనిచేశాను. అయితే, ఈ సినిమాకు నిర్మాతకు నా కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మించాను. ఈ క్రమంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాను. ఒక నిర్మాతగా ఈ మూవీ కోసం చాలా ఇబ్బందులు పడ్డాను. నా వెనకాల ఎవ్వరూ లేరు. ప్రతి రూపాయి నేను మాత్రమే ఖర్చు పెట్టాలి. సుమారు 15 నెలల పాటు ఎంతగానో శ్రమించాను. సినిమా విడుదలకు సంబంధించిన వ్యాపార లావాదేవీలు, వడ్డీలు వంటి విషయాలను చూసుకునే క్రమంలో కొన్ని ఒత్తిళ్లు వచ్చాయి. కానీ, వాటిని అధిగమించి సినిమా కోసం పనిచేశాను. అయితే నిర్మాత సురేశ్‌బాబుతో మంచి స్నేహం ఉంది. మార్గన్ మూవీని తెలుగులో ఆయనే విడుదల చేశారు. మరోసారి వారితో కలిసి ప్రయాణం చేస్తున్నాను. సుమారు 300కు పైగా థియేటర్స్‌లో భద్రకాళి విడుదల చేస్తున్నారు. అని ఆయన అన్నారు.

## పవన్ కల్యాణ్ ఓజీ.. ట్రైలర్ రిలీజ్ ఎప్పుడంటే?

పవన్ కల్యాణ్ హీరోగా వస్తోన్న తాజా చిత్రం ఓజీ. ఈ మూవీకి సుజిత్ దర్శకత్వం వహించారు. ముంబై బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కించిన ఈ చిత్రం థియేటర్లలో సందడి చేసేందుకు రెడీ అయిపోయింది. ఈ నేపథ్యంలోనే మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు. తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్‌ను రివీల్ చేశారు. ఓజీ ట్రైలర్‌ను సెప్టెంబర్ 21న ఉదయం 10 గంటల 8 నిమిషాలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఓజీ పోస్టర్‌ను ట్విటర్‌లో పోస్ట్ చేశారు. కాగా 1980–90లో ముంబై బ్యాక్ డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో ఈ మూవీని తెరకెక్కించారు. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా కనిపించనుంది. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ విలన్ పాత్రలో నటించారు. ఈ సినిమాను డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో డీవీవీ దానయ్య నిర్మిచారు. ఈ చిత్రానికి ఎస్ఎస్ తమన్ సంగీతమందించారు.

భారీగా టికెట్ ధరల పెంపు..


పవన్ కళ్యాణ్ హీరోగా వస్తోన్న ఓజీ సినిమా టికెట్ ధరలను భారీగా పెంచేశారు. ఏపీలో ఏకంగా బెనిఫిట్ షో టికెట్ ధరలను రూ.1000 రూపాయలు వసూలు చేసుకునేందుకు అనుమతులిచ్చారు. అర్ధరాత్రి ఒంటిగంటకు బెనిఫిట్ షోలు ప్రదర్శించుకోవచ్చని ఆదేశాలు జారీ చేశారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై రూ.125 పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించారు. మల్టీప్లెక్స్‌ల్లో ఒక్కో టికెట్‌పై రూ.150 పెంపునకు అనుమతులు జారీ చేశారు. సినిమా రిలీజైన రోజు నుంచి పది రోజుల పాటు ఈ టికెట్ ధరలను పెంచుకోవచ్చని ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. గతంలో లేని బెనిఫిట్ షోలకు ఇప్పుడు అనుమతులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. పవన్ కల్యాణ్ సినిమా కావడంతోనే బెనిఫిట్ షోలకు పర్మిషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది.




## 'కల్కి 2' నుంచి తప్పుకున్న దీపికా పదుకొనే.. అధికారికంగా ప్రకటించిన చిత్రబృందం

టాలీవుడ్ నుంచి రాబోయే ప్రెస్టిజీయస్ ప్రాజెక్ట్‌లలో కల్కి 2 ఒకటి. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం కల్కి సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. ప్రభాస్ ఈ చిత్రంలో కథానాయకుడిగా నటించగా.. దీపికా పదుకొనే, దిశా పటాని కథానాయికలుగా నటించారు. కమల్ హాసన్ విలన్‌గా నటించగా.. అమితాబ్ బచ్చన్, దుల్కర్ సల్మాన్, శోభన తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. వైజయంతీ మూవీస్ బ్యానర్ ఈ సినిమాను నిర్మించింది. అయితే ఈ సినిమాకు పార్ట్ 2 త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఒక షాకింగ్ న్యూస్‌ను చిత్రబృందం వెల్లడించింది. ఈ ప్రాజెక్ట్ నుంచి బాలీవుడ్ నటి దీపికా పదుకొనే తప్పుకున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించింది. కల్కి 2 సినిమాలో దీపికా పదుకొనే భాగం అవ్వట్లేదని అధికారికంగా ప్రకటిస్తున్నాం. చాలా విషయాల్లో పరిశీలించిన తర్వాత తమ పార్ట్‌నర్‌షిప్ నుంచి విడిపోవాలని నిర్ణయించుకున్నాం. పార్ట్1 సినిమా చేయడానికి చాలా దూరం ప్రయాణించినప్పటికీ మా మధ్య భాగస్వామ్యం కుదరలేదు. కల్కి వంటి సినిమాలకు నిబద్ధత చాలా అవసరం. ఆమె భవిష్యత్‌లో మరెన్నో సినిమాలు చేయాలని మేము శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము అంటూ వైజయంతీ మూవీస్ రాసుకోచ్చింది.






## ఉపేంద్రకి బర్త్‌డే విషెస్ తెలిపిన 'ఆంధ్రా కింగ్ తాలూకా' టీమ్

యువ కథానాయకుడు రామ్ పోతినేని హీరోగా మహేశ్‌బాబు.పి దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా' ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది. భాగ్యశ్రీ భోర్సే కథానాయికగా నటిస్తుంది. అయితే ఈ సినిమాలో కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ముఖ్యపాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. నేడు ఆయన బర్త్‌డే సందర్భంగా ఉపేంద్రకి బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. 'ఆంధ్రా కింగ్ తాలూకా' నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో ఉపేంద్ర తన నిజ జీవితానికి తగ్గట్టే సూపర్‌స్టార్‌గా, ఆంధ్ర కింగ్ సూర్యకుమార్ పాత్రలో నటిస్తున్నారు. ఆయన అభిమానిగా రామ్ పోతినేని కనిపించనున్నారు. రావు రమేశ్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తుండగా.. వివేక్ %–% మెర్విన్ సంయుక్తంగా సంగీతం అందిస్తున్నారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com